


RNI No: TELTEL/2021/81803

# మెట్రో సిటీటైమ్స్

METRO CITY TIMES Telugu daily

తెలుగు దినపత్రిక




సంపుటి: 4 | సంచిక : 165 | రంగారెడ్డి | ఆదివారం, డిసెంబర్ 22, 2024 | పేజీలు : 8 | వెల : 2/-







# రాళ్లకు, గుట్టలకు రైతుబంధు ఇద్దామా..?

## రైతులను ఆదుకోవడమే మా ప్రభుత్వ ఆలోచన

హైదరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ రైతుబంధు ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తెలిపారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా? అని ప్రశ్నించారు. భూముల్లో రహదారి వెళ్తే.. దానికీ రైతుబంధు జమ చేశారని, క్రషర్ యూనిట్ల భూములకూ రైతుబంధు ఇచ్చిందని సీఎం ఆరోపించారు. రైతు సమాజాన్ని ఆదుకునేందుకు తమ ప్రభుత్వం ముందుంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రైతులను ఆదుకోవడమే మా ప్రభుత్వ ఆలోచనన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం ఇచ్చేందుకు రైతుబంధు తెచ్చారన్న ఆయన రైతుభరోసాపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదన్నారు. నిజమైన లబ్ధిదారులు ఎవరికీ అన్యాయం జరగకూడదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతుబంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాగులో లేని భూములకు రైతుబంధు ఇచ్చి రూ. 22 కోట్లకు పైగా నిదులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రూ. 22600 కోట్ల రైతుబంధు ద్వారా ఆయాచిత లబ్ధి చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ఏటా రూ. 3 కోట్ల ఎకరాలకు రైతుబంధు ఇచ్చారు.. ఏటా రూ. 15 వేల కోట్ల రైతుబంధు ఇచ్చింది. దొంగ పాస్ పుస్తకాలు తయారు చేసుకుని రైతుబంధు లబ్ధి పొందారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక అంశమైన రైతుబంధుపై చర్చ జరిగితే ప్రతిపక్ష నేత సలహాలు ఇస్తారనుకున్నానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. జమీందార్లు, భూస్వాములకు రైతుబంధు ఇవ్వాలా?.. బీఆర్ఎస్ ఇచ్చింది కాబట్టి.. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాళ్లు, గుట్టలకూ రైతుబంధు ఇవ్వాలంటున్నారు. బీఆర్ఎస్ ను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని ఆదర్శంగా తీసుకుంటే తాము కూడా ప్రతిపక్షంలో ఉండేవాళ్లమని సీఎం వెల్లడించారు. 2023లో అధికారం.. 2024లో డిపాజిట్లు పోయిన మీరు మాకు ఆదర్శం కాదని సీఎం ఎద్దేవా చేశారు. రైతుబంధు అమలుపై మంత్రివర్గ ఉపసంఘం వేశామా?.. రైతుబంధుపై అన్ని వర్గాలతో ఉపసంఘం చర్చలు జరిపిందన్నారు. ప్రతిపక్ష నేతల సూచనల్లో సహేతుకత కనిపిస్తే స్వీకరిస్తాం.. బేషజాలు లేవని రేవంత్ స్పష్టం చేశారు. రైతులకు మేలు జరుగుతుందంటే ప్రతిపక్ష నేతల సూచనలు స్వీకరిస్తామని సీఎం తెలిపారు.

చూస్తూ ఊరుకోను

– సినీ ప్రముఖులకు సీఎం వార్నింగ్

సినిమా ప్రముఖులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వార్నింగ్ ఇచ్చారు. అమానవీయ ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేందని లేదని హెచ్చరించారు. సినిమాలు తీసుకోండి, వ్యాపారం చేసుకోండి, డబ్బులు సంపాదించుకోండి, ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు తీసుకోండి, షూటింగ్ లకు సంబంధించి ప్రత్యేక అనుమతులు కూడా తీసుకోండి.. కానీ ప్రజల ప్రాణాలు పోయే పరిస్థితులకు కారణమైతే మాత్రం ఏమీ ఉండవని తేల్చిచెప్పారు. ప్రజలు ప్రాణాలు పోతుంటే మాత్రం ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. తాను కుర్చీలో ఉన్నంత వరకు ఇలాంటి ఘటనలు ఉపేక్షించనని పేర్కొన్నారు. ప్రజలు ప్రాణాలు పోయే ఘటనలు జరిగితే ప్రత్యేక మినహాయింపులు ఉండదని తెలిపారు. తెలంగాణ ప్రజల ప్రాణాలు కాపాడటమే తన బాధ్యతన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే ఎవరినీ ప్రభుత్వం వదిలిపెట్టదని హెచ్చరించారు.

అబద్ధాల సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలే: సీఎం రేవంత్



తెలంగాణ శాసనసభ సమావేశాలు శనివారం కొనసాగుతున్నాయి. రైతు భరోసా విధి విధానాలపై స్వల్పకాలిక చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తొలిస్థానం, తెలంగాణ రెండోస్థానంలో ఉందని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో 3వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు తగ్గించామని చెబుతున్నారు. అద్భుతాలు చేశామని ప్రతిపక్ష సభ్యులు అంటున్నారు. అబద్ధాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదని సీఎం చమత్కరించారు. అద్భుతాలు చేసినందుకు ప్రతిపక్ష నేత సభకు రాలేకపోతున్నారని రేవంత్ విమర్శించారు. అదికారంలోకి వచ్చిన వెంటనే రూ. లక్ష రుణమాఫీ చేస్తామని 2014లో బీఆర్ఎస్ హామీ ఇచ్చింది.. రూ. 16,100 కోట్లు రుణమాఫీ చేసింది. బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందన్నారు. మళ్లీ రుణమాఫీ చేస్తామని 2018లో బీఆర్ఎస్ హామీ ఇచ్చింది.. 2019 తర్వాత బీఆర్ఎస్ రూ. 11,909 కోట్ల రుణమాఫీ చేసిందని లెక్క చెప్పారు. పదేళ్లలో బీఆర్ఎస్ రూ. 27 వేల కోట్ల రుణమాఫీ చేసిందని ఆరోపించారు. రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. తొలి విడతలో రూ. లక్ష వరకు రుణమాఫీ చేశామన్నారు. జులై 18న రూ. 6,034 కోట్లతో తొలి విడత రుణమాఫీ చేశామని చెప్పారు. తొలి విడత పూర్తయిన 12 రోజుల్లో రెండో విడత రుణమాఫీ చేశామని వెల్లడించారు. పంద్రాగస్టున మూడో విడతలో రూ. 5 వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం తెలిపారు. 27 రోజుల్లో రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొందరికీ రుణమాఫీ కాలేదన్న సీఎం రేవంత్ నవంబర్ 30న రూ, 2,747 కోట్ల రుణమాఫీ చేశామని వివరించారు. ఏడాదిలోనే రూ. 20,600 కోట్ల రుణమాఫీ చేశాని ముఖ్యమంత్రి తెలిపారు.




## కిక్ బాక్సింగ్ మ్యాచ్‌లో ఐ-కాంబాట్ స్పోర్ట్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన

ఎల్బీనగర్, మెట్రో సిటీటైమ్స్ ప్రతినిధి:

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి చొరవతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన చీఫ్ మినిస్టర్స్ కప్ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ మ్యాచ్‌లో బేగంపేటలోని ఐ-కాంబాట్ స్పోర్ట్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. బాలికల-32 కేజీల విభాగంలో కుషీ దయాల్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. బాలికల-47 కేజీల విభాగంలో తనిష్క చంద్ బంగారు పతకం సాధించి విజేతగా నిలిచారు. బాలుర -63 కేజీల విభాగంలో అంగత్ రాజ్ అసాధారణమైన పట్టుదలతో స్వర్ణ పతకాన్ని సాధించారు. బాలికల విభాగంలో 37 కేజీల విభాగంలో జోనా నిత్య పోరాడి బంగారు పతకం సాధించారు. మ్యాచ్‌లోని అధికారులు అవినాష్ సింగ్, సురేష్ టోర్నమెంట్ విజయానికి సహకరించారు.

# అసెంబ్లీలో ప్రభుత్వం ఆమోదించిన కీలక బిల్లులివే..



హైదరాబాద్, డిసెంబర్ 21: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. ఏడు రోజుల పాటు సభ జరుగగా.. 37.44 గంటల పాటు నడిచింది. ఈ సమావేశాల్లో మొత్తం 8 బిల్లులు పాస్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం నుంచే అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీ వేడీగా చర్చలు జరిగాయి. ఒకనొక సమయంలో శాసనసభలో యుద్ధవాతావరణమే నెలకొంది. కేటీఆర్‌పై కేసు నమోదు చేసిన రోజున.. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రచ్చ రచ్చ చేశారు. ఇక అసెంబ్లీ సమావేశాల చివరి రోజున.. అల్లు అర్జున్ అరెస్ట్, పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన అంశాలపై హాట్ డిస్కషన్ నడిచింది.

ఎనిమిది బిల్లులకు ఆమోదం..

తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో నాలుగు అంశాలపై లఘు చర్చ జరిగింది. అలాగే 8 బిల్లులకు అసెంబ్లీ ఆమోద ముద్ర వేసింది. భూ భారతి 2024, పంచాయితీ రాజ్ చట్ట సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ యూనివర్సిటీస్ చట్ట సవరణ బిల్లు, యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యూకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ చట్ట సవరణ బిల్లు, గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ సవరణ బిల్లు, తెలంగాణ పేమెంట్స్ ఆఫ్ శాలరీస్ అండ్ పెన్షన్ అండ్ రిమూవల్ ఆఫ్ డిస్ క్వాలిఫికేషన్ సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

ఇక అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర అప్పులపై లఘు చర్చ జరిగింది. రాష్ట్ర అప్పులపైనా లఘు చర్చ నిర్వహించారు. టూరిజం పాలసీ, గుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. సభలో ఔటర్ రింగ్ రోడ్డు లీజ్‌పై సిట్ విచారణకు ఆదేశించారు సీఎం రేవంత్ రెడ్డి.



## రాజీనామా చేస్తా.. వాళ్లకు కేటీఆర్ సవాల్

హైదరాబాద్: రైతు రుణమాఫీ వందశాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సవాల్ విసిరారు. రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఛాలెంజ్ చేశారు. కొండారెడ్డి పల్లి, పాలేరు ఎక్కడికైనా వెళ్దామని ఛాలెంజ్ చేశారు. ఈరోజు అసెంబ్లీలో రుణమాఫీపై చర్చ జరిగింది. దీనిపై కేటీఆర్ షాకింగ్ కామెంట్స్ చేశారు. రైతులను అడుగుదామని అన్నారు. వంద శాతం రుణమాఫీ అయినట్లు నిరూపించాలని కేటీఆర్ అన్నారు.

రైతు భరోసాను ప్రారంభించింది మేమే: కేటీఆర్

రైతుబంధుపై సమగ్ర చర్చ జరగాలని కేటీఆర్ అన్నారు. రైతు భరోసాను ప్రారంభించింది తామేనని స్పష్టం చేశారు. రైతుబంధుతోనే సాగు విస్తీర్ణం పెరిగిందని గుర్తుచేశారు. రైతుబంధుపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి చెప్పాలని అన్నారు. రైతుబంధు ఒక పంటకు ఇస్తారో లేక..రెండు పంటలకు ఇస్తారో ప్రభుత్వం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

వారి కోసం పనిచేయొద్దు...

రైతుబరోసాపై అసెంబ్లీలో చర్చలో కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అదాని కోసం సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ రైతులను జైల్లో పెట్టారని మండిపడ్డారు. కేవలం అనుముల కుటుంబం కోసం, బామ్మర్ది కోసం, అన్నదమ్ముల కోసం పని చేయకండి అని హెచ్చరించారు. అన్నదాతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పనిచేయాలని కోరారు.రైతు రుణమాఫీ పూర్తిగా జరిగింది అంటున్నారని.. 60 శాతం అయ్యిందని మరొకరు అంటున్నారని చెప్పారు. రైతు రుణమాఫీ ఎంత మేర జరిగిందో స్పష్టంగా చెప్పాలని అన్నారు. 25 శాతమా, 50 శాతమా మీకే స్పష్టత లేదని విమర్శించారు. కోతలు పెడితే అది మీ ఇష్టమని అన్నారు. కౌలు రైతులకు ఇస్తారా లేదా క్లారిటీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర రైతాంగం కోసం పనిచేయాలని కేటీఆర్ చెప్పారు.

అసెంబ్లీ ఆలస్యంపై హరీష్‌రావు ఫైర్

శాసనసభ పది నిమిషాల ఆలస్యంగా ప్రారంభం కావటంపై మాజీ మంత్రి హరీష్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. 10గంలకు ప్రారంభం కావాల్సిన సభ.. 10.10గంకు ఎందుకు ప్రారంభం అయిందని ప్రశ్నించారు. సభను సమయానికి ఎందుకు నడపడం లేదని హరీష్‌రావు నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు సభను సమయానికి నడిపామని హరీష్‌రావు గుర్తుచేశారు. చట్టాలు చేసే మనం ఆదర్శంగా ఉండాలని హరీష్ రావు చెప్పారు. సభను సమయానికి ప్రారంభించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు.

మిషన్ భగీరథలో అవినీతి ఎలా జరిగింది: మాజీ మంత్రి హరీష్‌రావు

మిషన్ భగీరథ ఖర్చే రూ.28వేల కోట్లు అయిందని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. అందులో రూ.50వేల కోట్ల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రికోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను డిమాండ్ చేశారు. నల్గొండకు ఏం చేయలేదు అనడం సరికాదని హరీష్‌రావు పేర్కొన్నారు.

మెట్రో సిటీటైమ్స్

ఆదివారం, డిసెంబర్ 22, 2024

## విద్యారంగానికి పొంచి ఉన్న ప్రమాదం

అతిపెద్ద జనాభా కలిగిన భారత దేశంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. ఫలితంగా దేశ భవిష్యత్తు ప్రమాదంలో కనిపిస్తోంది. ఇండియాలోని విద్యారంగం సువిశాలంగా ఉన్నా.. దేశంలో విద్యార్థులు చదువులో ఫెయిలవుతున్నారు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధి కోసం తగిన వనరులు కేటాయించడం లేదు. ఈ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం పాఠశాలల్లో చదువుకునే వారు లక్షమంది విద్యార్థులు ఫెయిలయ్యారు. దీంతోపాటు దేశంలో పది లక్షల టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. రిపోర్ట్ లోని ఈ గణాంకాలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయని.. విద్యారంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉపాధ్యాయులపై ప్రపంచ నివేదిక 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 44 మిలియన్ల ప్రాథమిక మరియు మాధ్యమిక ఉపాధ్యాయుల అత్యవసర అవసరాన్ని వెల్లడిస్తోంది. ఇందులో సెకండరీ స్థాయిలో పది మందిలో ఏడుగురు ఉపాధ్యాయుల కోసం డిమాండ్ ఉంది మరియు ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులలో సగం మందిని భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. 2030 నాటికి 15 మిలియన్ల మంది కొత్త ఉపాధ్యాయుల అవసరం ఉంటుందని అంచనా వేయబడిన సబ్-సహారా ఆఫ్రికా ముఖ్యంగా ప్రభావితమైంది. ఈ డిమాండ్ స్థాయి, దాని భౌగోళిక చిక్కులు మరియు విద్యా మౌలిక సదుపాయాలు మరియు విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తులపై తదుపరి ప్రభావాలను అర్థం చేసుకోవడం గురుత్వాకర్షణను అర్థం చేసుకోవడానికి ప్రాథమికమైనది. పరిస్థితి.ఉపాధ్యాయుల కొరత ప్రపంచ సమస్య, అభివృద్ధి చెందుతున్న దేశాలలో మాత్రమే కాకుండా యూరప్ మరియు ఉత్తర అమెరికా వంటి అధిక-ఆదాయ ప్రాంతాలలో కూడా ప్రబలంగా ఉంది. మంచి వనరులతో కూడిన విద్యా వ్యవస్థలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతాలు అర్హత కలిగిన అధ్యాపకులను నియమించుకోవడానికి మరియు నిలుపుకోవడానికి కష్టపడుతున్నాయి, విద్యా నాణ్యత మరియు ఈక్విటీకి గణనీయమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, ప్రైమరీ టీచర్లలో అట్రిషన్ రేట్లు ప్రపంచవ్యాప్తంగా 2015లో 4.62 శాతం నుండి 2022లో 9.06కి దాదాపు రెట్టింపు అయ్యాయి, ఉపాధ్యాయులు వారి ప్రారంభ ఐదేళ్లలో తరచుగా వృత్తిని విడిచిపెట్టారు. ఈ కొరత యొక్క విస్తృత స్వభావాన్ని మరియు దాని సామాజిక-ఆర్థిక ప్రభావాలను అర్థం చేసుకోవడం సమర్థవంతమైన, అన్నింటినీ కలుపుకొని పరిష్కారాలను రూపొందించడంలో కీలకమైనది.ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించేందుకు సమగ్ర దృక్పథం అవసరం. రిక్రూట్‌మెంట్‌కు మించి, ఉపాధ్యాయుల ప్రేరణ, శ్రేయస్సు, నిలుపుదల, శిక్షణ, పని పరిస్థితులు మరియు సామాజిక స్థితి వంటి అంశాలకు శ్రద్ధ అవసరం. వృత్తిపరమైన అభివృద్ధి, స్వయంప్రతిపత్తి మరియు ఉద్దేశ్యానికి సమానమైన ప్రాప్యతతో ఆకర్షణీయమైన కెరీర్ మార్గాలను సృష్టించడం ఉపాధ్యాయుల ప్రేరణను కొనసాగించడంలో కీలకమైనది. ఈ సమస్య యొక్క బహుముఖ స్వభావాన్ని గుర్తించడం మరియు సమగ్రమైన వ్యూహాలను ప్రతిపాదించడం శాశ్వత పరిష్కారాలను కనుగొనడంలో కీలకం.ఉపాధ్యాయ వృత్తిలో లింగ సమానత్వాన్ని పెంపొందించే సమగ్ర విధానాలు చాలా ముఖ్యమైనవి. విభిన్నమైన టీచింగ్ వర్క్‌ఫోర్స్‌లు వారు సేవలందించే కమ్యూనిటీలను ప్రతిబింబిస్తూ విద్య యొక్క ఔచిత్యాన్ని మెరుగుపరుస్తాయి మరియు అభ్యాస అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. ఉపాధ్యాయ వృత్తిలో పురుషులను నిమగ్నం చేస్తున్నప్పుడు నాయకత్వ స్థానాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని ప్రోత్సహించడం, ముఖ్యంగా ప్రారంభ సంవత్సరాల్లో విద్యలో, క్లిష్టమైనది. లింగ-సమతుల్య టీచింగ్ వర్క్‌ఫోర్స్ యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం మరియు విద్యా ఫలితాలపై దాని ప్రభావం కలుపుకొని మరియు సమర్థవంతమైన విద్యా వ్యవస్థలను రూపొందించడంలో కీలకమైనది.వేతనాలు, పని పరిస్థితులు మరియు విద్యలో పెట్టుబడి పెంపుదల ఉపాధ్యాయుని శ్రేయస్సు మరియు ప్రేరణను గణనీయంగా ప్రభావితం చేస్తాయి. నిర్ణయం తీసుకోవడంలో ఉపాధ్యాయులను చేర్చుకోవడం మరియు సహకార పాఠశాల సంస్కృతిని పెంపొందించడం నాణ్యమైన అధ్యాపకులను ఆకర్షించగలదు మరియు నిలుపుకోవచ్చు. అనుభవశూన్యుడు ఉపాధ్యాయులలో తగినంత పెట్టుబడి పెట్టడం వలన అట్రిషన్ తగ్గించవచ్చు మరియు కొరతను స్థిరంగా పరిష్కరించవచ్చు. సమర్థవంతమైన సంస్కరణలను అమలు చేయడానికి ఈ చర్యల యొక్క సూక్ష్మ వివరాలను మరియు బోధనా ప్రకృతి దృశ్యంపై వాటి సంభావ్య ప్రభావాన్ని అన్వేషించడం చాలా అవసరం.2030కి చేరుకుంటున్న తరుణంలో ఉపాధ్యాయుల కొరత పెద్ద సవాలుగా నిలుస్తోంది. ఉపాధ్యాయులపై యునెస్కో-టీచర్ టాస్క్ ఫోర్స్ యొక్క ప్రపంచ నివేదిక భయంకరమైన గణాంకాలను బహిర్గతం చేసింది. ఈ కొరత కేవలం సంఖ్య కాదు: ఇది ప్రపంచవ్యాప్తంగా విద్యా వ్యవస్థలను బలహీనపరిచే సంక్షోభం. ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ప్రభావం తీవ్రంగా ఉంది, ఇది పెద్ద తరగతి పరిమాణాలు, అధిక భారం ఉన్న విద్యావేత్తలు, విద్యాపరమైన అసమానతలు మరియు విద్యా వ్యవస్థలపై ఆర్థిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఈ కొరత విద్యా నాణ్యత మరియు యాక్సెస్‌పై చూపే తీవ్ర ప్రభావాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం.ప్రస్తుత ఉపాధ్యాయులకు ఎంత చెల్లించాలో నిర్ణయించడం లేదా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదా ప్రొఫెషనలైజేషన్ కార్యక్రమాలలో పెట్టుబడి పెట్టడం అనేది ఏదైనా విద్యా వ్యవస్థకు కీలకమైన ఆర్థిక నిర్ణయాలు. అదనంగా, అయితే, అనేక దేశాలు కొత్త టీచింగ్ పొజిషన్ల అంచనా వ్యయాలకు కూడా కారణం కావాలి. తాజా అంచనాల ప్రకారం, మరియు గాఆఉ లక్ష్యం 4ని చేరుకోవడానికి, అదనపు ఉపాధ్యాయుల ఆర్థిక సహాయం సార్వత్రిక ప్రాథమిక విద్య కోసం జూవి12.8 బిలియన్లు మరియు సార్వత్రిక మాధ్యమిక విద్య కోసం జూవి106.8 బిలియన్లు ఖర్చు అవుతుంది. 2030 నాటికి కొత్త ప్రైమరీ మరియు సెకండరీ టీచింగ్ పోస్టుల వేతనాలను కవర్ చేయడానికి అవసరమైన అదనపు ఫైనాన్సింగ్ వార్షికంగా జూవి120 బిలియన్లకు చేరుకుంటుంది. డెల్లాయిట్ యెస్సె 2023-24 సంవత్సరానికి గాను విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని స్కూళ్లలో దాదాపు 27 కోట్ల మంది విదార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. వీరిలో 52 శాతం అబ్బాయిలు, 48 శాతం అమ్మాయిలు. మరోవైపు వీరికి బోధించడానికి దేశంలో 11.3 కోట్ల మంది టీచర్లున్నారు. అత్యధికంగా ఉత్తర్ ప్రదేశ్ లో 16,29,781 మంది టీచర్లున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో రాజస్థాన్ (913,050), మహారాష్ట్ర (836,261), తమిళనాడు (817,142), మధ్యప్రదేశ్ (686,599) రాష్ట్రాలున్నాయి. చూడడానికి టీచర్లు ఎక్కువ మంది ఉన్నట్లు కనిపిస్తుంది. కానీ పరిశీలన చేస్తే.. నిజం ఆందోళన కలిగించేలా ఉంది. ఎందకంటే దేశంలో పది లక్షలకు పైగా టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నీతి ఆయోగ్ రిపోర్ట్. వీటిలో అధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే ఖాళీలున్నాయి.ఫలితంగానే ప్యూపిల్(స్టూడెంట్)-టీచర్ నిష్పత్తి చాలా అధిక వ్యత్యాసంలో ఉంది. బిహార్ లో అత్యధికంగా 45 మంది విద్యార్థులకు ఒక టీచర్ మాత్రమే ఉన్నారు. అదే లదాఖ్ లో మాత్రం అత్యల్పంగా ప్రతి 7 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు. ఢిల్లీ డైరెక్టరేట్ ఆఫ్ ఎడుకేషన్ 2023-24 సంవత్సరానికి గాను విడుదల చేసిన రిపోర్ట్ ప్రకారం.. గత సంవత్సరం ఒక ఢిల్లీలోనే 9వ తరగతి చదివే పిల్లలు లక్ష మందికి పైగా ఫెయిలయ్యారు.వీటికి తోడు చాలా మంది టీచర్లు ప్రైవేట్ స్కూళ్లలో, ప్రభుత్వ పాఠశాలల్లో టెంపరరీ కాంట్రాక్టులపై పనిచేస్తున్నారు. వీరందరూ ఉద్యోగ భద్రత లేకపోవడంతో చాలా మంది అయిష్టంగా పనిచేస్తూ.. వృత్తి పట్ల 100 శాతం నిజాయితీ చూపించడం లేదు. ఫలితంగా నష్టపోతోంది టీచర్లు మాత్రమే కాదు విద్యార్థులు కూడా. యునెస్కో రిపోర్ట్ ప్రకారం.. మధ్య ప్రదేశ్ పరిస్థితి దారుణంగా ఉంది. అక్కడ స్కూల్ ఒక్క టీచర్ మాత్రమే ఉన్నారు. అలాంటి 21,000 స్కూళ్లు ఆ రాష్ట్రంలో ఉన్నాయి.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. టీచర్లకు జీతాలు తక్కువగా ఉండడం, గ్రామీణ ప్రాంతాల్లో సరైన వసతులు, వనరులు లేకపోవడం, టీచర్ల భర్తీలకు ప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోకపోవడం, టీచర్లకు విద్యాబోధనలో సరైన శిక్షణ (టీచర్ ట్రైనింగ్) ఇవ్వడం.. ఇవే టీచర్ల కొరతకు ముఖ్యకారణాలని విద్యారంగంలో నిపుణులైన ప్రొఫెసర్ జ్ఞానేంద్ర తివారీ, సంజీవ్ రాయ్, డాక్టర్ సంగీత భాటియా అభిప్రాయపడుతున్నారు.విద్యారంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం పై తెలిపన సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించడానికి పూనుకోవాలి.. ఎందుకంటే సరైన విద్యా రంగం అభివృద్ధి లేనిదే దేశాబివృద్ధి సాధ్యం కాదు.

# పర్యావరణం కాపాడడం మన అందరి బాధ్యత



హైదరాబాద్ : వన మహోత్సవం -2024 కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ వెనుక భాగం లో గల లింక్ రోడ్డు ప్రాంతంలో పెద్దయెత్తున చేపట్టే ప్లాంటేషన్ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డీ, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ,అటవీ శాఖ అధికారులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకుంది. యావత్ తెలంగాణ ప్రజలు ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రతి పౌరుడు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని సంకల్పం తీసుకోవాలి. రాబోయే కాలంలో హైదరాబాద్ ను కాలుష్యం నుండి రక్షించే బాధ్యతను తీసుకోవాలని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యంతో పాఠశాలలు బంద్ చేసే పరిస్థితి ఏర్పడింది ..వలస పోయి వేరే దగ్గర బతుకే పరిస్థితి ఉంది. హైదరాబాద్ అలాంటి పరిస్థితి రాకుండా ఉండడానికి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.కాలుష్యాన్ని నివారించడానికి వాహనాలకు ఈవీ పాలసీ తీసుకొచ్చింది. హైదరాబాద్ నగరంలో అన్ని వాహనాలు ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు ఆటోలు ఎలక్ట్రిక్ వాహనాలుగా మారుస్తాం. కాల పరిమితి పూర్తి చేసుకున్న జీహెచ్ఎంసీ వాడే వాహనాలు స్క్రాప్ కి ఇచ్చి ఈవి వెహికిల్ గా మారుస్తాం. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్ పాలసీ తీసుకొచ్చాం. చెట్లు చాలా అవసరం సామాజిక బాధ్యత గా రోజు వారి కార్యక్రమాల్లో మొక్కలు నాటడం పెంచడం చేసుకోవాలి. ప్రజలందరికీ విజ్ఞప్తి వాతావరణాన్ని కాపాడడానికి..పర్యావరణం కాపాడడం మన అందరి బాధ్యత అని అన్నారు. .

# మహిళా సంఘాల పని తీరు మెరుగు పర్చాలి

### - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి : జిల్లాలో ఉన్న మహిళా సంఘాల పనితీరు మెరుగుపరిచేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళా సంఘాల పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలో2024-25 ఆర్థిక సంవత్సరానికి 9102 మహిళా సంఘాలకు సుమారు 478 కోట్ల రుణాల మంజూరు చేయడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3898 సంఘాలకు 322 కోట్ల 68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని,నిర్దేశిత లక్ష్యంలో 67.51% రుణాలు మంజూరు చేసామని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యంలో పెండింగ్ బ్యాంకు లింకేజీ రుణాల ను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పెద్దపెల్లి జిల్లాలో ఉన్న ఎన్.పి.ఏ లను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్.పి.ఏ లు అధికంగా ఉన్న సీసీ లు ప్రత్యేక శ్రద్ధ వహించి నెల రోజులలో వాటిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని స్వశక్తి మహిళా సంఘాల గ్రేడింగ్ 3 నెలల కాలంలో పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, గ్రేడింగ్ ఈ ఉన్న స్వశక్తి మహిళా సంఘాల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని బి, లేదా ఏ గ్రేడింగ్ వచ్చే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని మహిళా సంఘాలలో నూతనంగా మహిళలను జాయిన్ చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. స్త్రీ నిధి రుణాల రికవరీ పై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రౌండ్ చేసిన యూనిట్లు లాభదాయకంగా నడిచేలా వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలని కలెక్టర్ సూచించారు.ఈసమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, అడిషనల్ డి ఆర్ డి ఓ రవికుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్ జోన్ లో ఢిల్లీ



న్యూఢిల్లీ : దేశ రాజధానిని పొంగమంచు, కాలుష్యం ఇబ్బంది పెడుతున్నాయి. నెల రోజులుగా ఇబ్బంది పడుతున్న ఢిల్లీ వాసులను మూడు రోజులుగా పరిస్థితులు మరింత కష్టంగా, కఠినంగా మార్చాయి. మారిన వాతావరణం, పడిపోతున్న ఉష్ణోగ్రతలు ఊపిరి సడలకుండా చేస్తున్నాయి. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం, ఢిల్లీలో మొత్తం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఉదయం 7:15 గంటలకు 442 వద్ద నమోదైంది, జాతీయ రాజధానిలోని అనేక ప్రాంతాలు 400 నుంచి 500 మధ్య స్థాయిలను నమోదు చేస్తున్నాయి.పొగ మంచు కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విజిబిలిటీ 300 మీటర్లకు పడిపోయిన తర్వాత తక్కువ?విజిబిలిటీ విధానాలతో ప్రాంతం అంతటా దృశ్యమానత గణనీయంగా తగ్గింది. ఆనంద్ విహార్ (481), అశోక్ విహార్ (461), బురారీ క్రాసింగ్ (483), మరియు నెహ్రూ నగర్ (480) సహా ఢిల్లీలోని కీలక ప్రాంతాలు భయంకరమైన అఖఐ స్థాయిలను నివేదించాయి. అలీపూర్, జహంగీర్‌పురి మరియు ముండ్కా వంటి ఇతర ప్రముఖ స్థానాలు వరుసగా 443, 469 మరియు 473 అఖఐ స్థాయిలను నవోదు చేశాయి.ఎన్‌సీఆర్‌లోని పొరుగు ప్రాంతాలు కూడా పేలవమైన గాలి నాణ్యతను ఎదుర్కొన్నాయి, హర్యానాలోని ఫరీదాబాద్‌లో గాలి నాణ్యత స్థాయిలు 263, గురుగ్రామ్‌లో 392 మరియు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో 390, గ్రేటర్ నోయిడాలో 330, నోయిడా 364 వద్ద ఉన్నాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 100 శాతం, 66 శాతం మధ్య హెచ్చుతగ్గులు ఉన్న తేమ స్థాయిలను ఎదుర్కొన్నందున తీవ్రమైన వాయు కాలుష్యం చల్లని వాతావరణ పరిస్థితులతో సమానంగా ఉంది.ఇక కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రత 5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైంది. ప్రశాంతమైన గాలులు మరియు అధిక తేమ నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిస్సారమైన పొగమంచుకు దోహదపడింది, కాలుష్య స్థాయిలను మరింత దిగజార్చింది. రాబోయే రోజుల్లో పొగమంచు వాతావరణం కొనసాగుతుందని, చలిగాలులు తీవ్రతరం అయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. తెల్లవారుజామున దృశ్యమానత తగ్గుదల మరియు చలి పరిస్థితులను గమనించవచ్చు. నివాసితులు ప్రమాదకర గాలి నాణ్యత మరియు ఆరోగ్య ప్రమాదాలతో పోరాడుతున్నందున కాలుష్య నియంత్రణ చర్యల తక్షణ అవసరాన్ని పరిస్థితి నొక్కి చెబుతుంది.పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. 400 కంటే ఎక్కువ ఏయ్యూఐని 'తీవ్రమైనది'గా వర్గీకరిస్తుంది, ఇది నివాసితులందరికీ తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలను హైలైట్ చేస్తుంది. కాలుష్య నిరోధక చర్యలను కఠినంగా అమలు చేయాలని అధికారులు కోరారు. నివాసితులకు, ముఖ్యంగా హాని కలిగించే సమూహాలకు బహిరంగ కార్యకలాపాలను పరిమితం చేయాలని సూచించారు.శీతాకాలం తీవ్రతరం కావడం మరియు కాలుష్య స్థాయిలు పెరగడంతో, పొగమంచుతో ఢిల్లీ?ఎన్‌సీఆర్‌ల యుద్ధం ఆందోళన కలిగిస్తోంది.

# పదోన్నతులను ,పెండింగ్ లో ఉన్న బదిలీలను సత్వరమే పూర్తి చేయాలి

### - టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు

హైదరాబాద్ : పదోన్నతి ప్రతి ఉద్యోగి హక్కు అని,ఖాళీలను గుర్తించి అర్హత గల వారికి పదోన్నతులు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కోరింది. ఈ మేరకు టీజీఓ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావుకు నేతృత్వంలో ఉద్యోగుల బృందం శాంతికుమారితో భేటీ అయ్యి ,వినతిపత్రం సమర్పించింది, ప్రజాపాలన లక్ష్యాలను ప్రజలకు చేరవేయడంలో ,ఫలితాలను సాధించడంలో ,విజయోత్సవాల నిర్వహణలో ఉద్యోగులు నిబద్ధతతో పాల్గొన్నట్టు అని గుర్తు చేశారు .ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.పదోన్నతుల ప్యానల్ సంవత్సరాన్ని సెప్టెంబర్ నుండి మరుసటి ఏడాది ఆగస్టు వరకు నిర్వహిస్తారని,పలు శాఖలు సీనియార్టీ జాబితాలు తయారు,ఖాళీలను గుర్తించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని తెలిపారు.పరిపాలన సౌలభ్యం వేగవంతం కోసం ప్రభుత్వం పదోన్నతులను ప్రతి ప్యానల్ సంవత్సరాన్ని నిర్వహించి పూర్తి చేయాలని కోరారు. లోకసభ ఎన్నికల ముందు ఉద్యోగుల అంగీకారం ,కౌన్సెలింగ్ లేకుండా యం పి డి ఓ లను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారని ,మళ్లీ వారిని పూర్వ స్థలాలకు తిరిగి బదిలీ చేయాలని కోరారు .తీవ్రమైన పని భారం ,గ్రూప్ 1 కేడర్ లో నియమితులై గత 18 సంవత్సరాలుగా ఏలాంటి పదోన్నతి లేకుండా ఉంటున్నారని ,వీరికి స్పష్టమైన జాబ్ చార్ట్ మరియు పదోన్నతుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేసి అన్ని ప్రధాన ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వాలని,దీని వలన ఉద్యోగుల మౌలిక సమస్యల పరిష్కారానికి ఒక వేదిక అవుతుందని సూచించారు .సి పి యస్ రద్దు ,ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు విధానం అమలు ,కారుణ్య నియామకాలు చేపట్టడం వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ,తద్వారా ఉద్యోగ కుటుంబాలు మానసిక శారీరక ఆరోగ్య సంతోషాలకు మూలం అవ్వాలని విజ్ఞప్తి చేశారు .ఉద్యోగులు ద్విగుణీకృత ఉత్సాహంతో ప్రజా పాలన వారధులుగా పని చేస్తారని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలసిన వారిలో టి జి ఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ,టి జి ఓ రాష్ట్ర నేతలు శ్రీనివాస మూర్తి ,ఆస్నాల శ్రీనివాస్ ,రంగారెడ్డి అధ్యక్షుడు డాక్టర్ రామారావు ,సిద్దిపేట అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్ రెడ్డిలతో పాటు పలు ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

# నేత కార్మికుడి ఆత్మహత్య

రాజన్న సిరిసిల్ల : కార్మిక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేత కార్మికుడి ఆత్మహత్య కలకలం సృష్టిస్తుంది. గాంధీనగర్ లో నేత కార్మికుడు దూస గణేష్(45) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉపాధి లేక అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాశాడు. ఐదు లక్షల వరకు అప్పు ఉందని సూసైడ్ నోట్ లో పేర్కొన్నాడు. పోలీసులకు అడ్రస్ చేస్తూ రాసిన సూసైడ్ నోట్ అప్పుల వివరాలు తెలుపుతూ ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు తాళలేక అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు రాశాడు. భార్య ఇద్దరు కూతుళ్లకు క్షమించాలని సూసైడ్ నోట్ లో కోరాడు.

## ఫామ్ ఆయిల్ తోట దగ్ధం.. బూడిదైన మూడెకరాలు..

జనగామ : జాఫర్ ఘడ్ మండలం తిమ్మంపేటలోఫామ్ అయిత్ తోట మంటల్లో దగ్ధమయింది. సుమారు 15 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు గాదె వెంకటరత్నం ఆవేదన వ్యక్తం చేసారు. పక్క రైతు మారపాక పోషయ్య పొలంలో వరి కొయ్యలకు నిప్పంటించడంతో, నిప్పంటుకుని పామ్ ఆయిల్ తోట కాలిపోయిందని ఆరోపించాడు. పోశయ్యపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసాడు..

## కేటీఆర్ పై కేసులు కుట్రపూరితం

హైదరాబాద్ : బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్రమ కేసులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పందించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ హైదారాబాద్ నగరన్ని అభివృద్ధి చేసినందుకా కేటీఆర్ ను అరెస్టు చేయడం. ప్రపంచ పటంలో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపెట్టినందుకా కేటీఆర్ ను అరెస్టు చేయడం. హైదారాబాద్ నగరంలో 24 గంటల కరెంటు చరిత్ర కేటీఆర్ కే దక్కుతుందని అన్నారు. ఏం తప్పు చేశారని ఏసిబి విచారణ చేస్తుంది. ఈ ఫార్ములా రేస్ ద్వారా రాష్ట్రానికి ఏడు వందల కోట్ల పై చిలుకు ఆదాయం రాష్ట్రానికి వచ్చింది. ఈ ఫార్ములా రేస్ ద్వారా ప్రపంచంలో తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు వచ్చింది. కక్ష్యపూరిత కేసులు కాంగ్రెస్ పెడుతుంది. ఇదే ధోరణి అవలంబిస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బుద్ధి చెప్పుతారని అన్నారు.

## మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

### - హర్షం ప్రకటించిన విద్యార్థులు, అధ్యాపకులు

హైదరాబాద్ : కోఠి మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెడుతూ శాసనసభ లో తెలంగాణ ప్రభుత్వం బిల్లు పెట్టడం పట్ల యూనివర్సిటీ అధ్యాపకులు , విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ ఆవరణంలోని దర్బార్ హాల్ ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్ రెడ్డి చిత్రపటానికి పులభిషేకం చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళల విద్యను ప్రోత్సహిస్తూ వారి సంక్షేమాన్ని కోరుతూ యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రానికి ఒక మహిళా యూనివర్సిటీ ఉంటే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిలో విద్యావంతులైన మహిళల పాత్రను పెంచడానికి ఆస్కారం ఉంటుందని తెలిపారు. యూనివర్సిటీ బిల్లు ఆమోదం పొందడం పట్ల తెలంగాణ విద్యార్థినులు, ఆడబిడ్డలు, తెలంగాణ సమాజం ముఖ్యమంత్రికి ఋణపడి ఉన్నారన్నారు. అలాగే యూనివర్సిటీ అభివృద్ధిలో, కోర్సుల నిర్వహణలో, విద్యార్థినుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

## సికింద్రాబాద్ లో అగ్ని ప్రమాదం

సికింద్రాబాద్ : మహంకాళి పీఎస్ పరిదిలో అగ్నిప్రమాదం జరిగింది. తాజ్ మహల్ ట్రై స్టార్ హోటల్ ఎదురుగా పాన్ షాప్ లో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఫైర్ ఇంజన్ తో మంటలు ఆర్పివేసారు. దేవుడికి పెట్టిన దీపం అంటుకొని మంటలు ఏర్పడినట్లు గుర్తించారు. గురువారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో ఘటన జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలు

హైదరాబాద్ : తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద న్యూ సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న సైఫాబాద్ ట్రాఫిక్ హోంగార్డు కిష్టయ్య రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గత అర్ధరాత్రి 12:11జీఎ సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కిష్టయ్య రోడ్డు దాటుతున్న సమయంలో, ఇక్బాల్ మినార్ నుంచి పాత అంబేద్కర్ విగ్రహం వైపు డియో ద్విచక్ర వాహనంపై వేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన రైడర్ అతనిని ఢీకొట్టాడు. దీంతో హోంగార్డు కిష్టయ్య రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్రమైన గాయమైంది. సంఘటనా స్థలానికి సైఫాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీసులు చేరుకొని, కిష్టయ్యను చికిత్స కోసం మొదట గ్లోబల్ ఆస్పత్రికి తరలించారు మెరుగైన వైద్యం కోసం ఆపై ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ద్విచక్ర వాహనదారుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## సంగారెడ్డి జైలు నుంచి విడుదలైన 16 మంది రైతులు

### - ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల నినాదాలు
### - తమను అన్యాయంగా అరెస్ట్ చేశారని మండిపాటు

సంగారెడ్డి : లగచర్ల ఘటనలో అరెస్టయిన 16 మంది లగచర్ల రైతులు సంగారెడ్డి జైలు నుంచి విడుదలయ్యారు. ఈ ఉదయం వీరంతా జైలు నుంచి బయటకు వచ్చారు. దాదాపు నెల రోజుల పాటు వీరు జైల్లో ఉన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన రైతులకు బీఆర్ఎస్ నేతలు, గిరిజన సంఘాలు స్వాగతం పలికాయి. మరోవైపు జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమను అన్యాయంగ అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఘటన జరిగిన సమయంలో ఆ ప్రదేశంలో తాము లేమని చెప్పారు. అర్ధరాత్రి తమను అరెస్ట్ చేసి పరిగి పోలీస్ స్టేషన్ లో చిత్రహింసలకు గురి చేశారని మండిపడ్డారు. తమకు పరిహారం, ఉద్యోగాలు ఇచ్చినా ప్రభుత్వానికి భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. జైల్లో ఉన్న మిగిలిన రైతులకు కూడా బెయిల్ ఇప్పించాలని కోరారు. తమ గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ఈ గొడవకు కారణమని, ఆయనను ఇంతవరకు అరెస్ట్ చేయలేదని చెప్పారు. శేఖర్ ను విచారిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. జైలు నుంచి విడుదలైన రైతులకు నాంపల్లి కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ పత్రాలు నిన్న ఆలస్యంగా జైలు అధికారులకు చేరాయి. దీంతో, రైతులు నిన్న విడుదల కాలేదు. ఈ క్రమంలో ఈ ఉందయం వీరు జైలు నుంచి విడుదలయ్యారు.

## ఫార్ములా ఈ కంటిన్యూ అయితే టెస్లా వచ్చేది

### - ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

హైదరాబాద్ : ఫార్ములా ఈ పై చర్చ పెట్టాలంటే అంటే అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే మీద చెప్పు చూపించారు. ఇంతకంటే దారుణం ఉంటదా? ఇదేనా సభా సంప్రదాయమని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. ఆ ఎమ్మెల్యే మీద ఎస్సీ ఎస్టీ కేసు పెట్టాలి. ఫార్ములా ఈ కంటిన్యూ అయితే టెస్లా వచ్చేది. వేలాది మందికి ఉపాధి కలుగుతుంది. తెలంగాణ కురు ప్రపంచ వ్యాప్తంగా చెడ్డ పేరు తెచ్చారు రేవంత్ రెడ్డి. తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గు చేటు. ఎలాంటి అవినీతి లేదు అని నిన్న పొన్నం ప్రభాకర్ అన్నాడు. ప్రొసీజర్ ల్యాప్ అన్నారని అన్నారు

# ఈవీఎంల వ్యవహారంపై ఏకాకిగా కాంగ్రెస్



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల ప్రక్రియ అంటేనే ఓ భారీ కసరత్తు. అటూ ఇటుగా 100 కోట్ల జనాభా పాల్గొనే ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడం చూసి ప్రపంచ దేశాలే నివ్వెరపోతుంటాయి. ఇదంతా ఒకెత్తయితే.. దేశంలో జరిగే ఎన్నికల్లో గెలిచిన ప్రతిసారీ సంబరాలు చేసుకుని తమ ఘనతగా చాటుకునే కాంగ్రెస్ పార్టీ.. ఓడినప్పుడు మాత్రం ఈవీఎం 'గోల్‌మాల్' అంటూ గోల చేస్తోంది. ఆ పార్టీకి ఇది కొత్తేమీ కాదు. కానీ ఈసారి కనీసం మిత్రపక్షాల నుంచి మద్దతు లభించకపోగా.. కాంగ్రెస్ తీరును తప్పుబడుతూ మిత్రపక్షాలే తలంటేస్తున్నాయి. మొన్న జమ్ము-కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ (ఏఐఔఅ), నిన్న తృణమూల్ కాంగ్రెస్ (ఁఓఅ)లు కాంగ్రెస్ వాదనను తప్పుబట్టాయి. దీంతో ఈవీఎం గోల్‌మాల్ ఆరోపణల విషయంలో కాంగ్రెస్ ఒంటరిగా మారింది. ఎన్నికల ప్రక్రియలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఇఎఓ) ర్యాండమైజేషన్ చేస్తారు. ఆ తర్వాత మాక్ పోల్ కూడా నిర్వహిస్తారు. ఆ తర్వాతే ఎన్నికలు జరుపుతారు. ఇదంతా అన్ని పార్టీల ఏజెంట్ల ముందే చేస్తారు. పోలింగ్, కౌంటింగ్ సమయంలోనూ పార్టీల ఏజెంట్లు ఉంటారు. వీటన్నింటితో పాటు ఇఎఓలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేస్తూ 'ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్' (ఎఎఖఁ) విధానాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓటరు ఏ పార్టీకి ఓటు వేశారన్నది ఈవీఎం పక్కనే ఉన్న ఎఎఖఁలో ఒక స్లిప్ ముద్రించి కొన్ని సెకన్ల పాటు కనిపిస్తుంది. ఆ తర్వాత ఆ స్లిప్ బాక్సులోకి జారిపోతుంది. ఓట్ల లెక్కింపు సమయంలో ర్యాండమ్‌గా కొన్ని ఈవీఎంలో వచ్చిన ఓట్లను, దానికి అనుసంధానించిన ఎఎఖఁ స్లిప్పులను సరిపోల్చి చూస్తుంటారు. ఇప్పటి వరకు ఈవీఎం గణాంకాలకు, ఎఎఖఁలో స్లిప్పుల లెక్కకు తేడా వచ్చిన సందర్భాలు లేవు. ఒకరకంగా చెప్పాలంటే ఇది బ్యాలెట్ విధానం కంటే కూడా మెరుగైన ఎన్నికల ప్రక్రియగా కితాబు అందుకుంది. బ్యాలెట్ విధానంలో ఓటర్లు తాము ఓటు వేయాలనుకున్న గుర్తుపై సరిగా ముద్ర వేయలేక, అనేక ఓట్లు చెల్లని ఓట్లుగా మిగిలిపోతుండేవి. ఇఎఓ-ఎఎఖఁ వ్యవస్థలో అలాంటి చెల్లని ఓట్లకు స్థానమే లేదు. పైగా బ్యాలెట్ విధానంలో బూత్ క్యాప్చరింగ్ చేసి, తమకు నచ్చిన పార్టీకి ఓట్లు గుద్దేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డ సందర్భాలు అనేకం ఉన్నాయి. లేదంటే బ్యాలెట్ బాక్సులో ఇంకు పడేసి బ్యాలెట్ పేపర్లను ముద్రించిన ఓట్లను ధ్వంసం చేసే అవకాశాలు కూడా ఉంటాయి. ఇలాంటి సమస్యలు లేకుండా.. ప్రశాంతంగా జరుగుతున్న అతి పెద్ద ఎన్నికల ప్రక్రియలో అనేక రాజకీయ పార్టీలు పాల్గొంటూ.. ప్రజల ఆదరణ పొంది గెలుపొందుతున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఓటమికి కారణం ఈవీఎం గోల్‌మాల్ అంటూ తమ వైఫల్యాలను ఈవీఎంల మీదకు నెట్టేసే ప్రయత్నం చేస్తోంది. నిజానికి ఈమధ్య జరిగిన 4 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఓటర్లను ఆకట్టుకోలేకపోయింది. కొద్ది నెలల వ్యవధిలో జరిగిన 4 రాష్ట్రాల ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లో ఓడిపోయి, రెండు రాష్ట్రాల్లో కూటమిలో భాగమై గెలుపొందింది. గెలిచిన ఆ రెండు రాష్ట్రాల్లోనూ కూటమిలో భాగమైన ప్రాంతీయ పార్టీల బలమే కాంగ్రెస్ పార్టీని గెలిపించిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జమ్ము-కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ 56 స్థానాల్లో పోటీ చేసి 42 చోట్ల గెలుపొందితే, కాంగ్రెస్ 38 స్థానాల్లో పోటీ చేసి కేవలం 6 సీట్లు మాత్రమే గెలువగలిగింది. అవి కూడా మిత్రపక్షం ఓట్లు బదిలీ కావడం వల్లనే అన్నది సుస్పష్టం. ఇక జార్ఖండ్ విషయానికొస్తే.. జార్ఖండ్ ముక్తి మోర్చా (ఏఓఓ) 43 స్థానాల్లో పోటీ చేసి 34 స్థానాల్లో గెలవగా.. కాంగ్రెస్ 30 స్థానాల్లో పోటీ చేసి 16 స్థానాలు గెలుచుకుంది. ఈ రాష్ట్రంలోనూ జేఎంఎంకు అనుకూలంగా ఉన్న వాతావరణమే కాంగ్రెస్ పార్టీకి ఆ కాస్త సీట్లు గెలిపించి పెట్టాయని అర్థమవుతోంది. హర్యానాలో ముఖాముఖి పోరులో బీజేపీతో తలపడగా.. స్వల్ప తేడాతో ఓటమిపాలైంది. మహారాష్ట్రలో కూటమిలో భాగంగా పోటీ చేసినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో ప్రజల్ని ఆకట్టుకోవడంలో ఎందుకు వైఫల్యం చెందుతున్నామన్నది గుర్తించకుండా.. ఓడిన ప్రతిసారీ ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందని, అధికారపక్షం ఏదో మాయ చేసిందని ఆరోపిస్తోంది. ఒకవేళ అదే నిజమైతే బెంగాల్, హిమాచల్, తెలంగాణ, కర్ణాటక, జమ్ము కాశ్మీర్ రాష్ట్రాల్లో బీజేపీకి ప్రత్యర్థులుగా ఉన్న పార్టీలు గెలిచే అవకాశమే ఉండేది కాదు. గతంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ గెలుపొంది ప్రభుత్వాలు నడిపింది. అప్పుడు లేని అనుమానం తాము ఓడినప్పుడు మాత్రమే లేవనెత్తడం ఆ పార్టీని మరింత పలుచన చేస్తోంది. టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఈవీఎం విధానంలో జరిగే ఎన్నికలకు మద్దతుగా మాట్లాడారు. ఈవీఎంలపై ప్రశ్నలు లేవనెత్తే వారు తమ వద్ద ఏవైనా ఆధారాలుంటే ఎన్నికల కమిషన్‌కు వెళ్లి డెమో చూపించాలని అన్నారు. ఈవీఎం ర్యాండమైజేషన్, మాక్ పోల్ సమయంలో అన్నీ సరిగా పనిచేసినప్పుడు ఈ ఆరోపణలో నిజం ఉందని తాను అనుకోవడం లేదని చెప్పారు. బెంగాల్‌లో వరుసగా రెండు పర్యాయాలు టీఎంసీని దెబ్బకొట్టి అధికారం సాధించాలని బీజేపీ శతవిధాలుగా ప్రయత్నించినా సరే, సాధ్యపడలేదు. అక్కడ తృణమూల్ కాంగ్రెస్ వరుసగా గెలుస్తూ వస్తోంది. కాబట్టి ఆ రాష్ట్రంలో ఈవీఎంల పనితీరుపై తృణమూల్ కాంగ్రెస్‌కు ఎలాంటి అనుమానాలు లేవని స్పష్టమవుతోంది. అయితే తమ అభిప్రాయం వ్యక్తం చేయాలంటే ఇండి-కూటమి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని అభిషేక్ బెనర్జీ వ్యాఖ్యానించారు. మరోవైపు జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సైతం ఈవీఎంలకు మద్దతు ఇచ్చారు. ఎన్నికల ఫలితాలను కాంగ్రెస్ అంగీకరించాలని, ఈవీఎంలపై ఏడుపు ఆపాలని ఒమర్ సూచించారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎలాగైతే స్వీకరిస్తారో, ఓడినప్పుడు కూడా ఫలితాలను అలాగే స్వీకరించాలని, వాటిని నిందించడం తగదని హితవు పలికారు. ఇప్పటికే ఇండి-కూటమి నాయకత్వం విషయంలో అభ్యంతరాలు చెబుతూ కూటమికి తమ (మమతా బెనర్జీ) నాయకత్వం అవసరమని చెబుతున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి సమాజ్‌వాదీ (ౠఖ), రాష్ట్రీయ జనతా దళ్ (ఖీఏఅ), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఔఅఖ) పార్టీలు సైతం మద్దతు తెలిపాయి. ఇప్పుడు తాజాగా ఈవీఎం వాదన విషయంలో కాంగ్రెస్ తీరును తృణమూల్ తప్పుబట్టడంతో కాంగ్రెస్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

# సినిమాల కోసం పవన్ శాఖలు త్యాగం

హైదరాబాద్ : గత ఏడాది కాలంగా రాజకీయాలకే పరిమితం అయ్యారు పవన్ కళ్యాణ్. సంక్రాంతికి ఎన్నికల ప్రచారంలోకి దిగిన పవన్.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సినిమాలపై దృష్టి పెట్టలేదు. ఇప్పుడు నాగబాబు వచ్చిన తరువాత రిలాక్స్ కావాలని భావిస్తున్నారు. మెగా బ్రదర్ నాగబాబు ఎప్పుడు మంత్రివర్గంలోకి వెళ్తారు? ఆయనకు ఇచ్చే శాఖలు ఏంటి? హోంశాఖ ఇస్తారా? సినిమాటోగ్రఫీ శాఖ కేటాయిస్తారా? ఇలా బలమైన చర్చ నడుస్తోంది. మరోవైపు మార్చి వరకు మంత్రి పదవి దక్కే ఛాన్స్ లేదని కూడా ప్రచారం నడుస్తోంది. నేరుగా మంత్రిగా కంటే.. ఎమ్మెల్సీ అయిన తరువాత మంత్రి పదవి ఇవ్వాలని పవన్ పట్టుబడుతున్నట్లు సమాచారం. మరోవైపు నాగబాబు కొద్ది రోజుల్లోనే మంత్రి పదవి తీసుకుంటారని కూడా ప్రచారం నడుస్తోంది. పవన్ కళ్యాణ్ పెండింగ్ సినిమాలపై దృష్టి పెడతారని.. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసే అవకాశం ఉందని.. అందుకే నాగబాబును క్యాబినెట్ లోకి తీసుకుంటారని మరో ప్రచారం అయితే మాత్రం ఉంది. పవన్ చేతిలో రెండు మూడు సినిమాలు ఉన్నాయి. అవి వందల కోట్ల రూపాయల బడ్జెట్ తో రూపొందించాల్సినవి. వీలైనప్పుడు సినిమా షూటింగ్లకు పవన్ హాజరవుతున్నారు. కానీ దానికి సమయం చాలడం లేదు. మరోవైపు పవన్ వద్ద పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి తో పాటు అటవీ శాఖ వంటి కీలక శాఖలు ఉన్నాయి. వాటికి పాలనాపరమైన సమయం ఎక్కువగా కేటాయించాల్సి ఉంటుంది. అందుకే సినిమా షూటింగ్లకు విలువైన సమయాన్ని కేటాయించలేకపోతున్నట్లు తెలుస్తోంది. నాగబాబు క్యాబినెట్లోకి వస్తే తనకు కొంత వెసులుబాటు దొరుకుతుందని పవన్ ఆశిస్తున్నట్లు సమాచారం. నాగబాబు మంత్రివర్గంలోకి వచ్చిన తరువాత కాస్త రిలాక్స్ అయినా సరే.. అన్ని సినిమాల షూటింగ్ లు పూర్తిచేయాలని పవన్ కళ్యాణ్ పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం. ఆపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ, పర్యావరణం వంటి ఐదు శాఖలు ఉన్నాయి. పవన్ కళ్యాణ్ తన శాఖల విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. అన్నింటిని అధికారుల కే వదిలేయరు. తన ఆలోచనలకు తగ్గట్టు వ్యవహరిస్తుంటారు. అయితే ఇప్పుడు నాగబాబు ఎంట్రీ తో కీలకమైన అటవీ శాఖను ఆయనకు విడిచి పెట్టేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరోవైపు నాగబాబు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కావడంతో.. సినిమాటోగ్రఫీ శాఖను ఆయనకే విడిచి పెడతారని తెలుస్తోంది. అయితే కందుల దుర్గేష్ వద్ద ఒక పర్యాటక శాఖ మిగులుతుంది. నాగబాబు కు సినిమాటోగ్రఫీ శాఖ వదిలిపెట్టనుండడంతో.. మరో శాఖను ఆయనకు సర్దుబాటు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరి అది ఎంతవరకు కార్యరూపం దాల్చుతుందో చూడాలి.

# అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పి ఎంపీ పదవికి రాజీనామా చేయాలి

## - భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్

వేములవాడ : పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అంబేద్కర్ ను అగౌరవపరుస్తూ మాట్లాడటాన్ని ఖండిస్తూ వెంటనే క్షమాపణ చెప్పి యంపీ పదవికి రాజీనామా చేయాలి, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బలప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తరతరాలుగా అవమానాలకు అణిచివేతకు అంటరానితానికిగురి అయి ఒకవ్గరం చేతుల్లో బానిసలుగా మిగిపోయిన ఈ దేశంలో నూటికి తొంభై శాతం ఉన్నప్రజలకు బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం ద్వారా వారి చీకటి బ్రతుకులు నుండి వెలుగు వైపు నడిపించి వారికి సమాన హక్కులు కల్పించిన బాబా సాహెబ్ అంబేద్కర్ ను పేరు బదులు దేవుని పేరు తలిస్తే ఏడు జన్మల పుణ్యం వస్తుంది అనడం బిజెపి నేతలకు బిజెపి, పార్టీకి అంబేద్కర్ పైన ఎంతటి ద్వేషం ఉన్నదో అర్దం అవుతుంది అని అన్నారు. మనిషి మనిషిగా చూడని ధర్మాలు దేవుళ్ళు ఒకవైపు ఉంటే మనిషి మనిషిగా గౌరవించే, భారత రాజ్యాంగం ద్వారా ప్రతి బడుగు బలహీన వర్గాల అట్టడుగు వర్గాలకు సమానమైనటువంటి హక్కులు కల్పించి సమానత్వం సమాజాన్ని నిర్మించిన, డాక్టర్ బాబాసాహెబ్ ఈ దేశ ప్రజలకు ఆరాధ్య దైవం అని అతడే ఈ దేశానికి దేవుడు అని నూటికి 90 శాతం ఉన్న ప్రజలుకొలుస్తున్నారని అటువంటి వ్యక్తిని కించపరుస్తూ మాట్లాడడం ఎస్సీ, ఎస్టీ, బీసీల పైన బిజెపి, ఆర్ఎస్ఎస్ ఉన్న ద్వేషం స్పష్టంగా అర్థమవుతుందని అన్నారు. ఒక వైపు నరేంద్ర మోడీ చాయ్ అమ్ముకునే నేను ఈ దేశ ప్రధాని అయినట్టే అది బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ అని పార్లమెంటు సాక్షిగా స్పష్టంగా నమస్కారం చేసి మాట్లాడిన వ్యక్తి ఈరోజు క్యాబినెట్ మినిస్టర్ అయిన అమిత్ షా అంబేద్కర్ గురించి మాట్లాడితే అతని వెనుకేసుకురావడం అంటే మోడీ యొక్క అంబేద్కర్ పై ఉన్న కపట, నాటకం అర్థమవుతుందని అన్నారు. నిజంగా బాబాసాహెబ్ అంబేద్కర్ పైన ప్రేమ ఉంటే వెంటనే అమిత్ షా ను క్యాబినెట్ నుండి తొలగించి ఎంపీకి రాజీనామా చేయించాల్సిందిగా అలాగే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించాల్సిందిగా అన్నారు, లేదంటే రేపటి రోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తూ బిజెపి కార్యాలయాలను, బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలను మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధు, నాగరాజు, సాయి, ప్రశాంత్, వంశి, వినోదు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు రామ్ మాధవా.. కిషనా...

హైదరాబాద్ : తెలుగు నేతలకు మరో అరుదైన చాన్స్. బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ఇద్దరి పేర్లను పరిగణలోకి తీసుకుంది బిజెపి హై కమాండ్. అయితే ఏపీకి చెందిన నేతకు దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. బిజెపి జాతీయ అధ్యక్షుడు మారనున్నారు. ప్రస్తుతం జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వచ్చే ఏడాది ఆయన మార్పు అనివార్యంగా తెలుస్తోంది. కొత్త అధ్యక్షుడిని నియమించుకోవాల్సిన అవసరం ఉంది. మరోసారి జెపి నడ్డాకు అవకాశం ఇచ్చే ఛాన్స్ లేదని తెలుస్తోంది. ఈ తరుణంలో రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ప్రముఖంగా శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు వినిపించింది. అయితే ఈసారి దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వ్యక్తులకు పార్టీ పగ్గాలు అప్పగిస్తారని తెలుస్తోంది. బిజెపి దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. వచ్చే ఎన్నికల్లో కీలకమైన స్థానాలను దక్షిణాది రాష్ట్రాల నుంచి గెలుపొందాలని ప్లాన్ చేస్తోంది. ఈ తరుణంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన నేతలకు జాతీయ పగ్గాలు అప్పగించాలని భావిస్తోంది. ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనుంది. అయితే ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరూ ఆర్ఎస్ఎస్ మూలాలు ఉన్న నేతలు కావడం గమనార్హం. తెలంగాణ నుంచి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనకు పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకోవాలని ఢిల్లీ అగ్రనేతలు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వ్యక్తి కిషన్ రెడ్డి. బిజెపి భావజాలం ఉన్న నేత కూడా. ప్రధాని నరేంద్ర మోడీ సమకాలీకుడు. అయితే నరేంద్ర మోడీ మాత్రం గుజరాత్ కు మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు.

ఏకంగా ఈ దేశానికి ప్రధానమంత్రిగా మూడుసార్లు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడిగా ఉన్న కిషన్ రెడ్డిని మార్చుతారని ప్రచారం నడుస్తోంది. ఆయన పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పరిగణలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. అయితే ఏపీకి చెందిన రామ్ మాధవ్ కు ఛాన్స్ అని తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ లో జాతీయస్థాయిలో కీలక బాధ్యతలు చేపట్టిన రామ్ మాధవ్ 2014లో బిజెపిలో చేరారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పార్టీ గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి చెందినవారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మైసూర్ యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో పీజీ చేశారు. 1981లో ఆర్ఎస్ఎస్ లో చేరారు రామ్ మాధవ్. సమర్థవంతంగా తన సేవలు అందించగలిగారు. గత కొద్దిరోజులుగా బిజెపిలో యాక్టివ్ రోల్ ప్లే చేస్తున్నారు. ఏపీలో టీడీపీతో బిజెపి పొత్తు కుదర్చడంలో రామ్ మాధవ్ పాత్ర కీలకమని వార్తలు వచ్చాయి. 2014లో బిజెపి జాతీయ కార్యదర్శిగా నియమితులయ్యారు రామ్ మాధవ్. ఆయనకు బిజెపి జాతీయ పగ్గాలు ఇవ్వాలని ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసినట్లు సమాచారం. అటు బిజెపి అగ్రనేతలు సైతం దీనికి సమ్మతించినట్లు ప్రచారం నడుస్తోంది. వచ్చే ఏడాదిలో జాతీయ అధ్యక్షుడు నియామకం ఉన్న నేపథ్యంలో.. రామ్ మాధవ్ పేరు ఖరారు చేస్తారని తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కోమరవెల్లి జాతర ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, పోలీసు కమిషనర్



సిద్దిపేట కొమరవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవము సందర్భంగా కలెక్టర్ మను చౌదరి, పోలీస్ కమిషనర్ డా.బి. అనురాధ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు ఈనెల 25 తారీకు లోపు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి. కళ్యాణోత్సవం సందర్భంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈనెల 29న శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం మరి జనవరి 9 నుండి బ్రహ్మోత్సవాల సందర్భంగా కలెక్టర్, పోలీస్ కమిషనర్ జిల్లా అధికారులతో కలిసి కళ్యాణం జరిగే తోట బావి, విఐపి దర్శనము, శీఘ్రదర్శనము, సాధారణ దర్శనము వీఐపీ పార్కింగ్, జనరల్ పార్కింగ్, బస్టాండ్, ఎల్లమ్మ టెంపుల్, నూతనంగా నిర్మిస్తున్న 50 గదుల సత్రాన్ని నూతనంగా నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ భవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేర్యాల, హైదరాబాద్, కరీంనగర్ సిద్దిపేట, బస్సులు ఆటోలు వెళ్లే రూట్ లను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ. స్వామివారి కళ్యాణం జరిగే తోటబావి వద్ద విఐపి దర్శనము సాధారణ దర్శనం గురించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, బారికెట్లు పటిష్టంగా ఏర్పాటు చేయాలని కళ్యాణం జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ను ప్రతిరోజు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వారు లైటింగ్ గురించి అన్ని ఏర్పాట్లు చూసుకోవాలని లైటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దని ప్రజలకు ఇబ్బంది కలిగించే ట్రాన్స్ఫర ంకు చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ అధికారులకు సూచించారు. ఫైర్ సేఫ్టీ గురించి షాప్ యజమానులకు అవగాహన కల్పించాలని రాబోవు మూడు నెలలు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలి విఐపి పార్కింగ్లో తగు ఏర్పాటు చేయాలి ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు ఫైర్ సేఫ్టీ మెజర్స్ తీసుకొని ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలి తెలిపారు షాప్స్ ముందర దుకాణాలు పెట్టి వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా పెయింటింగ్ వేయించాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. సూచించారు వచ్చే భక్తులకు మంచినీటి సౌకర్యం 24చీ7 కల్పించాలని ఆర్డబ్ల్యూ అధికారులకు సూచించారు. టెంపుల్ కు ఇరువైపులా స్టాప్ గేట్స్ ఏర్పాటు చేయాలని టెంపుల్ ఈఓకు సూచించారు. వచ్చే భక్తులకు మెడికల్ ఎమర్జెన్సీ గురించి తాత్కాలికంగా స్టాల్స్ ఏర్పాటు చేసి మందులు అందుబాటులో ఉంచుకోవాలని డిఎంహెచ్ఓ కు సూచించారు. సౌండ్ సిస్టం ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఐ,పి డిపార్ట్మెంట్ కు సూచించారు. వచ్చే ఆర్టీసీ బస్సులను బస్టాండ్ లో నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు తెలిపారు.

వచ్చే భక్తుల గురించి మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వచ్చే భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు 25 తారీకు లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డిపార్ట్మెంట్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని తెలిపారు.

ఈనెల 29 శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం, మరియు జనవరి 7 నుండి జరిగే బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి భక్తులు పెద్ద ఎత్తున జాతరకు వచ్చే వారి గురించి అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు.

పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ మాట్లాడుతూ. ఈనెల 29న శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవానికి మరియు జనవరి 9 నుండి జరిగే బ్రహ్మోత్సవాలకు ఏక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆలయ ఇఓ బాలాజీ, ఆలయ ప్రధానార్చకులు మల్లికార్జున్, విద్యుత్ శాఖ ఎస్ఇ చంద్రమోహన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, ఎక్సైజ్ సూపరింటిండెంట్ శ్రీనివాసమూర్తి, హుస్నాబాద్ ఏసిపి సతీష్, చేర్యాల సిఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు, డీపీఆర్ఓ రవికుమార్, పీఆర్ ఇఇ శ్రీనివాస్ రెడ్డి, ఐ,పీఆర్ డిఇ భూపాల్ రెడ్డి, ఆర్ అండ్ బి, డిఇ వెంకటేష్, ఆర్డబ్ల్యూఎస్, ఎండోమెంట్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎంబీబీఎస్ చదివిన వారంతా లోకలే..

హైదరాబాద్ : తెలంగాణలో పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. స్థానికత నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను న్యాయస్థానం రద్దు చేసింది. ఎంబీబీఎస్‌లో స్థానిక కోటా కింద రాష్ట్రంలో ప్రవేశాలు పొందిన వారే.. పీజీలోనూ స్థానిక కోటా రిజర్వేషన్లకు అర్హులు అని కోర్టు స్పష్టంచేసింది. ఇతర రాష్ట్రాలకు చెందినవారు తెలంగాణలో ఎంబీబీఎస్ చదివినంత మాత్రాన పీజీలో స్థానిక కోటా వర్తించదంటూ తెచ్చిన జీవో 148, 149లను హైకోర్టు కొట్టివేసింది.

తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి ఇకపై పీజీలో స్థానిక కోటా పరిధిలోనే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొంది. అదేవిధంగా తెలంగాణలో స్థానికులై ఉండి.. రాష్ట్రం వెలుపల ఎంబీబీఎస్ చదివిలన, ఇన్ సర్వీసు(తెలంగాణలో సివిల్ సర్జన్లుగా చేస్తున్న) అభ్యర్థులకు సైతం రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని కోర్టు తెలిపింది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని స్పష్టం చేసింది.

2021 పీజీ మెడికల్ ప్రవేశాల నిబంధన 8కి సవరణ చేసి ఈ ఏడాది అక్టోబరు 28న ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ హైకోర్టులో 90కిపైగా పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ప్రస్తుత పిటిషనర్లలో దాదాపు అందరూ ఏపీ, రాజస్థాన్‌లలో ఎంబీబీఎస్ పూర్తిచేసినవారే ఉన్నారు. వీరితోపాటు చైనా తదితర దేశాల్లో ఎంబీబీఎస్ పూర్తిచేసి తెలంగాణలో ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా సేవలందించినవారు కూడా.. తమను స్థానిక కోటా కింద తిరస్కరించడంపై పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి తాజాగా 106 పేజీల తీర్పును వెలువరించింది. రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలని కానీ.. మార్చాలని కానీ రాష్ట్రపతిని ప్రభుత్వం కోరలేదు. ఈ క్రమంలో రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 మేరకు.. తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదు. ఆ చట్టంలోని సెక్షన్ 101 ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రభుత్వం అన్వయించుకోలేదనే వాదన సరికాదు. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు రాష్ట్రానికి వర్తిస్తాయి. స్థానికత ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలన్న విధానం పూర్తిగా తొలగించాల్సింది కాదు. పీజీ కోర్సుల్లో స్థానికత ఆధారంగా ప్రవేశాలు కల్పించే వెసులుబాటు ఉంది. అయితే ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు.. నాన్-లోకల్ కేటగిరీలో రాష్ట్రంలో ఎంబీబీఎస్‌లో చేరినవారు స్థానిక కోటా కింద పీజీలో ప్రవేశాలకు అర్హులుకాదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 6 నుంచి ఇంటర్ వరకు రాష్ట్రంలో చదివినవారికే స్థానిక కోటా కింద ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు లభిస్తాయి. వారికే పీజీ ప్రవేశాల్లో స్థానిక కోటా కింద అర్హత లభిస్తుందన్న వాదన చట్టవిరుద్ధం. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నాలుగేళ్లు స్థానికంగా చదువుకున్నట్లయితే స్థానిక అభ్యర్థిగా పరిగణించాలి. ప్రభుత్వ జీవోలు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం. రాష్ట్ర విద్యాసంస్థల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 3(2)కు సైతం విరుద్ధం. 2021 చట్టంలోని నిబంధన 8 ఇన్ సర్వీసు అభ్యర్థులకు పూర్తిస్థాయి నిషేధం కల్పించలేదు. ఇందులో నిబంధన 1, 6, 8ల మధ్య తేడాలేదు. ఒకసారి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమయ్యాక నిబంధనలను సవరించడం సరికాదు. ఈ కారణాలతో జీవో 148, 149లను కొట్టివేస్తున్నామని తీర్పులో ధర్మాసనం పేర్కొంది. హైకోర్టు వెలువరించిన స్థానికత తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ప్రభుత్వ జీవోలపై విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో రాష్ట్రంలో కాళోజీ వర్సిటీ పీజీ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇప్పటివరకూ వెలువరించలేదు. విద్యార్థుల మెరిట్ జాబితా కూడా పెండింగ్‌లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయంతో రాష్ట్రంలో పీజీ కౌన్సెలింగ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. హైకోర్టు తీర్పుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను వివరణ కోరగా ఏజీ న్యాయ సలహాతో ముందుకెళ్తామని తెలిపారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES ఆదివారం, డిసెంబర్ 22, 2024

# కరీంనగర్ కాంగ్రెస్‌లో విబేధాలు



కరీంనగర్ : కరీంనగర్ కాంగ్రెస్‌లో విభేదాలు బయటపడ్డాయి. అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పురుమళ్ల శ్రీనివాస్ మంత్రి పొన్నం ప్రభాకర్ తీరుపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. పనిలో పనిగా పార్లమెంట్ ఇన్ చార్జి వెలిచాల రాజేందర్ రావుపై కూడా విమర్శలు చేశారు. డీసీసీ కార్యాలయంలో కార్యకర్తలతో రహస్యంగా సమావేశమై పార్టీ నాయకత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు, ఆరోపణలు చేయడం కాంగ్రెస్ లో కలకలం సృష్టిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల ముంగిట బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరి చివరి నిముషంలో టికెట్టు దక్కించుకున్న పురుమల్ల శ్రీనివాస్ మూడో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారానికి కూడా దూరంగా ఉండిపోయారన్నది బహిరంగ సత్యం. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన తర్వాత క్రమంలో కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో పురుమల్ల ప్రాధాన్యత రోజురోజుకు తగ్గిపోయిన సంగతి అనేక సందర్భాల్లో తేటతెల్లమైంది. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ కు సన్నిహితంగా ఉంటూ వచ్చిన పురుమల్ల శ్రీనివాస్ తనకు తన నియోజకవర్గంలో, పార్టీలో గాని ఎటువంటి ప్రాధాన్యత దక్కడం లేదంటూ తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు నగరానికి వచ్చిన సందర్భంగా సమాచారం అందజేసేలా చూస్తున్నానని.. మంత్రి పొన్నం ప్రభాకర్ సహా ఇతర మంత్రులు, ముఖ్య నేతలెవరు వచ్చినా కూడా నియోజకవర్గ ఇన్ చార్జిగా తనకు మాటమాత్రంగా కూడా ఇవ్వడం లేదంటూ మదనపడుతూ వస్తున్నారు. పురుమల్ల శ్రీనివాస్ ను నమ్మి ఆయన వెంట కాంగ్రెస్ పార్టీలో చేరిన వారం దరూ కూడా ఇప్పుడు ఆయనతో కలిసి నడిచేందుకు కూడా ఆసక్తి చూపకపోవడా న్ని పురుమల్ల జీర్ణించుకోలేక పోయారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన సంబరాల సందర్భంగా కూడా పురుమల్ల శ్రీనివాస్ కు సమాచారం లేకపోవడంతో ఇన్ చార్జి, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచన మేరకు చివరి నిముషంలో నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తానే చొరవ తీసుకొని సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. దీంతో అసలు ఏం జరుగుతుందో. తెలియక తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న పురుమల్ల ఎట్టకేలకు తన మనసులో మాట కార్యకర్తల ముందు పెట్టాలనే నిర్ణయంతో డీసీసీ కార్యాలయంలో లంచ్ మీటింగు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోంది అసలు.. ఉజ్వల పార్కు టెండర్ ఎవరికి దక్కింది... చేగుర్తి ఇసుక క్వారీ ఎవరికి దక్కింది... ఊటూరు ఇసుక క్వారీలో ఏం జరుగుతోంది.. మినరల్ ఫండ్ కింద మూడు కోట్ల రూపాయలను కేవలం ఒక చోటనే ఎందుకు పెట్టాల్సి వచ్చింది... ఇంకా చాలా ఉన్నాయి. బయటకు తీయాలంటే.... అంగబలం, అర్థబలం ఉందని విచ్చలవిడిగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదు... ఈ అన్యాయాలను.. అక్రమాలను ఇకపై సహించబోం... అంటూ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్ చార్జి పురుమల్ల శ్రీనివాస్ నిప్పులు చెరిగారు. అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న పురుమల్ల శ్రీనివాస్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మంత్రి పొన్నం ప్రభాకర్ ను ఉద్దేశించినవేనని కార్యకర్తలు చెబుతున్నారు. నియోజకవర్గ ఇన్ చార్జిగా తనకు కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని.. ప్రొటోకాల్ కూడా పాటించడం లేదని, కార్యకర్తలకు కూడా పనులు జరగడం లేదని, తాము ఎక్కడకు పోవాలి.. ఎవరిని కలువాలన్నది కూడా అర్థం కాకుండా పోయిందంటూ పురుమల్ల వాపోయారు. ఎవరు వస్తారో తెలియదు.. ఎవరు పోతారో తెలియదని, నేతలు వచ్చినప్పుడు సమాచారం ఇస్తే పది మంది కార్యకర్తలు వచ్చి నాయకుల వెన్నంటి ఉంటేనే కదా పార్టీలో ఉత్సాహం కనబడేది, ఎవరికి వారే యమునా తీరేలా ఉంటే మరోసారి నగరంలో పార్టీ ఎలా బలపడుతుందని అంటున్నారు.. ఇక్కడ పార్టీని పట్టించుకోరని, పని చేస్తానంటే తనకు సహకరించరని కార్యకర్తలు దయనీయ స్థితిలో ఉన్నా ఎవరూ పట్టించుకోరని పురుమల్ల శ్రీనివాస్ తన ఆవేదన వెళ్ళగక్కారుఅన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్నట్టుగా కరీంనగర్ కార్యకర్తల పరిస్థితి ఉందని పురుమల్ల వాపోయారు. నామినేటెడ్ పదవులు ఎవరికి వస్తున్నాయో కూడా తెలియదన్నారు. ఏడాది క్రింద సుడా చైర్మన్ ఇచ్చారు.. గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఇచ్చారు.. డైరెక్టర్ పదవులను కూడా భర్తీ చేస్తే పది మందికి లాభం జరిగేది.. మార్కెట్ కమిటీ ఇప్పటికీ పెండింగ్ పెట్టారు.. అదీ కూడా నియమిస్తే మరో పది మందికి అవకాశం లభించేది కదా...గిద్దె పెరుమాళ్ళ గుడి, సాయి బాబా, బ్రహ్మంగారి గుడి, వెంకటేశ్వర దేవస్థానం సహా అనేక చోట్ల నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే ఈ రోజు నగరంలో కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా ఉండేవారంటూ పురుమల్ల గుర్తు చేశారు. తన పొరపాట్లు ఉంటే చెప్పాలని.. సరిదిద్దుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానంటూ సంకేతాలు ఇచ్చారు. నగరానికి మంజూరైన 3 కోట్ల రూపాయలలో తలా పది లక్షలు కేటాయిస్తే కార్యకర్తలు సంతోషించే వారని.. అలా కాకుండా మల్కాపూర్ వద్ద కేవలం ఒక ప్రైవేటు నిర్మాణం అవసరాల కోసం 2.70 కోట్ల రూపాయలు కేటాయించడం ఎంత వరకు సమంజసమని పురుమల్ల సూటిగా ప్రశ్నించారు.

బాలాజీ ఫంక్షన్ వద్ద పనులు పెట్టారని.. కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా ఎవరికీ తెలియకుండా ఇలా చేయడం సమంజసం కాదని పురుమల్ల ఎత్తిచూపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రెండుసార్లు పార్లమెంట్, రెండుసార్లు అసెంబ్లీకి చేశారని.. ఆ సమయంలో నియోజకవర్గ సమావేశాలకే మంత్రి పొన్నమే సభాధ్యక్షత వహించారని పురుమల్ల శ్రీనివాస్ గుర్తు చేశారు. మరి ఏడాదికాలంగా ఇక్కడ జరుగుతున్న సమావేశాల్లో తనకు ఎందుకు ఆ బాధ్యత అప్పగించడం లేదని ఆయన పార్టీ నాయకత్వాన్ని నిలదీశారు. పొన్నం ఇన్ చార్జిగా ఉన్న సమయంలో వేరే వాళ్ళు అధ్యక్షత వహించలేదు కదా అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ప్రజాపాలన సంబరాల సమావేశంలోనూ తానే అధ్యక్షత వహించాల్సి ఉండేదని వాపోయారు.

కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి తాను పోటీ చేస్తే పార్టీ నేతలెవరూ తనకు సహకరించలేదని పురుమల్ల సంచలన ఆరోపణలు చేశారు. గంగుల కమలాకర్ కోసం కేసీఆర్, కేటీఆర్.. బండి సంజయ్ కుమార్ గెలుపు కోసం మోడి ప్రచారం చేస్తే తనకు రేవంత్ రెడ్డి కాకుండా చత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రిని పంపించారని పురుమల్ల వాపోయారు. ఆ సమయంలో ఆయన ప్రచారానికి రావల్సిన అవసరమే లేదని.. రేవంత్ రెడ్డి వస్తే పరిస్థితి వేరేగా ఉండేదని.. వేరే కారణాల వల్ల రాలేకపోయారన్నారు. పార్టీ కోసం దశాబ్దాలుగా శ్రమిస్తూ వస్తున్న వారిని గుర్తించి పదవులు కట్టబెట్టాలంటూ పురుమల్ల శ్రీనివాస్ సూచించారు. డీసీసీ అధ్యక్ష పదవిని వెలిచాల రాజేందర్ రావుకు కాకుండా పార్టీ కోసం కష్టపడుతున్న వారిలో ఎవరో ఒకరికి ఆ పదవిని ఇవ్వాలంటూ పురుమల్ల సూచించారని తెలుస్తోంది. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా కొత్తగా వచ్చిన వారికి కాకుండా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తించి టికెట్లు ఇచ్చి అందరం కలిసి గెలిపించుకుందామంటూ కొత్త ట్విస్టు సంధించారు. పార్టీలో ఇటీవల చేరిన కార్పొరేటర్లు ఇటీవల సమావేశంలో వేదికపై ఉండటం చూసి సీనియర్ కార్యకర్తలు బాధపడ్డారని పురుమల్ల శ్రీనివాస్ గుర్తు చేశారు.

## హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ కుప్పకూలింది : ఎమ్మెల్యే మల్లారెడ్డి

హైదరాబాద్ : హైడ్రా ఏర్పాటయ్యాక ప్రజల్లో భయాందో ళన మొదలై రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రమంటే ప్రపంచమంతా మారుమోగిపోయింది. హైడ్రా వచ్చాక అంతా కుప్పకూలింది. హైడ్రా ఏం తప్పు చేయలేదు కానీ నగరానికి దిష్టి తగిలింది. శనివారం పొద్దున్నే వెళ్లి ఇళ్లు కూలగొట్టాల్సిన అవసరం ఏముంది? ఇంకా నాలుగేళ్లు ఉందిగా. నెమ్మదిగా చేసుకుంటూ వెళ్లండి' అని అసెంబ్లీలో వ్యాఖ్యా నించారు.

## కోతుల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

మహబూబాబాద్ : కోతుల దాడిలో మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ వాసులు ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మీదుగా వరంగల్ వెళుతుండగా కొత్తగూడ మండలం గాదేవాగు దగ్గర కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. ఒక్కసారిగా బైక్ బ్రేక్ వేయడంతో మద్దెల నాగమణి వెనుక వైపు తిరిగి పడటంతో తలకు గాయం అయి తీవ్ర రక్తస్రావం కావడంతో 108 వాహనానికి సమాచారం ఇచ్చి మహిళను అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కొరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మండలంలోని కోతుల బెడద రోజు రోజుకి పెరిగిపోతుంది. అడవులను విడిచి గ్రామీణ ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయి. గ్రామాలను కోతుల ఆవాసాలుగా మార్చుకుంటున్నాయి. ఆకలితో అలమటిస్తూ వాహన దారుల పై దాడులు చేసి వారిని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. పంట పొలాలకు నాశనం చేసి రైతులకు తీవ్ర నష్టాలను తెచ్చి పెడుతున్నాయి అంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

## కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలి

### - కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం

మంథని : పార్లమెంటులో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అవమానించే విధంగా ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని మంథని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం డిమాండ్ చేశారు. పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ మధ్యన అంబేద్కర్ అనే పదం ఫ్యాషన్ అయిపోయిందంటూ హేళనగా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. దేశ శాంతి భద్రతులకు విఘాతం కలిగించే విధంగా ప్రసంగించినందుకు వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మంథని మండల అధ్యక్షుడు మంథని రాకేష్, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు నాగెల్లి జానీ, ఎస్సీ సెల్ నాయకులు కాసిపేట బాపు, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి అక్కపాక సదయ్య, నాయకులు రొడ్డ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పొగతో విద్యార్థుల అవస్థలు

జగిత్యాల : జగిత్యాల న్యాక్ కేంద్రం సమీపంలో పట్టణం నుంచి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు పొగతో విద్యార్థులు నూకపల్లి సమీపంలోని డంపింగ్ యార్డు తో అవస్థలు పడుతున్నారు. జగిత్యాల పట్టణం నుంచి సేకరించే చెత్తను నూకపల్లి సమీపంలోని డంపింగ్ యార్డులో వేస్తున్నారు. చెత్త నుంచి ఎరువును తయారు చేయాల్సి ఉండగా కాల్చుతుండగా పొగతో సమీప ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. న్యాక్ కేంద్రంలో 100 మంది విద్యార్థులు శిక్షణ పొందుతుండగా పొగతో ఇబ్బంది పడుతున్నారు.. రెండు రోజుల కిందట ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. చెత్తను కాల్చకుండా ఎరువు తయారు చేయాలని వెంటనే ధీనిపై చర్యలు తీసుకోవాలి అని అధికారులని సమీప ప్రజలు మరియు విద్యార్థులు కోరుతున్నారు.

## 1605 కోట్లతో శేరిలింగంపల్లి అభివృద్ధి

రంగారెడ్డి : రూ 1605 ఐదు కోట్లతో శేర్లింగంపల్లి నియోజకవర్గాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేస్తున్నామని పిఎసి చైర్మన్ శాసనసభ్యుడు ఆరెకపూడి గాంధీ అన్నారు ఈ నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు దేశంలోని అతిపెద్ద నియోజకవర్గం శేరిలింగంపల్లిలో పలు చౌరస్తాలు అండర్ పాసులు, ఫ్లైఓవర్లు లింక్ రోడ్ల నిర్మాణానికి ఈనిధులు కేటాయించినట్లు గాంధీ పేర్కొన్నారు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన తన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

## షకీల్, ఆయన కుమారుడు... పరార్

నిజామాబాద్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే ఆ ఎమ్మెల్యేకి ఒక ప్రత్యేకత ఉండేది. ఆయన హడావుడి కూడా అలాగే ఉండేది. అయితే మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయాక ఆయన మాయమయ్యారంట. దాంతో అక్కడ గులాబీపార్టీ పట్టించుకునే దిక్కు లేక అనాథలా తయారైందంట. గత ఎన్నికల్లో అక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆ మాజీ ఎమ్మెల్యే ఇప్పుడు నియోజక వర్గాన్ని వదిలేసి సంవత్సరం గడుస్తుందంట. పార్టీ కార్యకర్తలకు పెద్దదిక్కుగా ఉండాల్సిన ఆయన నాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తుండటం ఎందుకో? ఎవరికీ అంతుపట్టడం లేదంట.. అసలు మిస్సింగ్ అయిన ఆ మాజీ ఎమ్మెల్యే ఎవరు?? ఆ నియోజకవర్గం ఏది? నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజవర్గం ఒకప్పుడు బీఆర్ఎస్‌కి కంచుకోట. రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ గెలిచి .. గత ప్రభుత్వంలో రాష్ట్రంలోనే ఏకైక మైనార్టీ ఎమ్మెల్యేగా పేరుపొందిన మహ్మద్ షకీల్ ఇప్పుడు నియోజకవర్గంలో కనిపించడం మానేశారు. గత సంవత్సర కాలంగా పార్టీకి, నియోజకవర్గానికి దూరం ఉంటూ తన సతీమణి అయోషా ఫాతిమాకు పెత్తనం అప్పగించి విదేశాలకు వెళ్లిపోయారు .. షకీల్‌తో పాటు ఆయన కొడుకు సాహిల్‌పై ఉన్న కేసుల నేపథ్యంలో అప్పటినుంచి ఇండియాకు రాలేదు. అయితే ఇప్పటికే రాష్ట్ర పోలీసు శాఖ షకీల్ ఆయన కొడుకు రాహిల్‌పై ఉన్న కేసులు నేపథ్యంలో లుకౌట్ నోటీసులు జారీ చేసింది. ఈ ఏడాది ఆరంభంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ప్రజాభవన్ వద్ద రోడ్డు ప్రమాదం చేశాడు. కొడుకుని తప్పించడానికి షకీల్ తీవ్ర ప్రయత్నాలు చేశారు. యాక్సిడెంట్ కేసులో తనకుమారుడిని తప్పించడానికి షకీల్ సహకరించాడని అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఆ ఇద్దరితో పాటు మరో నలుగురు విదేశాలకు పారిపోవటంతో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. అప్పటినుంచి మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్ తన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడడం లేదు. షకీల్ పారిపోతూ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు తన సతీమణి ఫాతిమాకు అప్పగించారంట. అప్పటి నుంచి బీఆర్ఎస్ పిలుపు మేరకు ఫాతిమా అడపాదడపా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. అయితే ఆమె కార్యకర్తలకు బలమైన భరోసా ఇవ్వలేక పోతున్నారని పార్టీ వర్గాలు పెదవి విరుస్తున్నాయి. గత ఎన్నికల్లో షకీల్ మీద కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గెలుపొందారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం, సుదర్శన్‌రెడ్డి బలమైన నేత అవ్వడం, దానికి తోడు మంత్రివర్గ విస్తరణలో ఆయనకు మంత్రి పదవి ఖాయమన్న ప్రచారంతో ? బోధన్‌లో కారు పార్టీ మొత్తం కాళీ అవుతుందంట. ఇప్పటికే మున్సిపల్ ఛైర్మెన్ తూము పద్మాశరత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరగా కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. దాంతో బీఆర్ఎస్‌లో మిగిలింది రూపాయిలో చారణా భాగమే అంటున్నారు? వాళ్ళను అయినా కపడుకుంటారో లేదో అన్న చర్చ నియోజకవర్గంలో నడుస్తుంది. బోధన్ నియోజవర్గానికి షకీల్ దూరమవ్వడంతో.. ఆయన భార్య ఫాతిమా పార్టీకి, కేడర్‌కి తానే పెద్ద దిక్కని నమ్మకం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఆమె కార్యకర్తలకు పూర్తిస్థాయిలో భరోసా ఇవ్వలేకపోతున్నారంట. రాష్ట్రంలోనే మైనార్టీ ఫుడ్ బ్యాంక్ ఉన్న నియోజకవర్గాల్లో బోధన్ నియోజకవర్గ ఉంటుంది. అక్కడ తరచూ పొలిటికల్ వివాదాలు, ఇసుక మాఫియా ఆగడాలు, వివిధ ఇల్లీగల్ యాక్టివిటీస్ చోటుచేసుకుంటాయి. అంత వివాదాస్పదమైన నియోజవర్గం కాబట్టే ఫాతిమా వివాదాలు, కార్యకర్తల పంచాయతీలు పరిష్కరించలేక పోతున్నారంట. ఇక వచ్చే ఎన్నికల్లో తానే ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఫాతిమా ప్రచారం చేసుకుంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా నాలుగు సంవత్సరాలు సమయం ఉండడంతో .. అప్పటికి ఆమెకు బీఆర్ఎస్ టికెట్ ఇస్తుందో? లేదో? చూద్దాం లే అని కేడర్ లైట్ తీసుకుంటుందంట.. మరి లుక్‌ఔట్ నోటీసులు ఉన్న మాజీ ఎమ్మెల్యే షకీల్ నాలుగేళ్లకైనా విదేశాల నుంచి తిరిగివస్తారా?..ఆయన్ని రప్పించడానికి పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా?.. బోధన్ బీఆర్ఎస్‌కు దిక్కెవరన్నది సెగ్మెంట్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఇద్దరికీ హెల్మెట్ ఉండాల్సిందే..

### - రోడ్డుపైనే చలాన్లు వసూలు..బండి సీజ్ - ఏపీ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేసి జూన్ నుంచి సెప్టెంబరు వరకు 667 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ విషయంపై హైకోర్టు సీరియస్ అయింది. మోటార్ వాహనాల చట్టం అమలు చేయడంలో వచ్చిన ఇబ్బంది ఏంటని ప్రశ్నించింది. సిసి కెమెరాలు చూసి చర్యలు తీసుకునే విధానం తగ్గించి నేరుగా రోడ్లపైనే పోలీసులు నిలబడి చలాన్లు వసూలు చేయాలని సూచించింది. హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలంటూ తాము ఇచ్చిన ఆదేశాలను పోలీసులు ఎందుకు లైట్ తీసుకుంటున్నారని హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సంగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించింది. పోలీసులు నేరుగా రోడ్లపై ఉంటే నేరాల సంఖ్య కూడా తగ్గుతుందని అభిప్రాయపడింది. అక్కడే హెల్మెట్ ఉందా లేదా చూసి రికార్డుల తనిఖీ అన్ని జరిగిపోతాయన్నారు. రాష్ట్రంలో 99 శాతం మంది హెల్మెట్ లేకుండానే వాహనాలు నడుపుతున్నారని ఇది ఏ మాత్రం క్షేమం కాదని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాహనాలు నడిపే వ్యక్తి కాకుండా వెనుకన కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని కోర్టు ఆదేశించింది. అలాంటి చేయని వారిపై మోటార్ వెహికిల్ చట్టం ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. కొందరు సంవత్సరాలుగా చలాన్లు కట్టలేదని వారిపై సెక్షన్ 167, సెక్షన్ 206 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు.

వారి వాహనాలను సీజ్ చేసి లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశించింది. ఒక్క హెల్మెట్ విషయమే కాకుండా ఆటోల్లో కూడా పరిమితికి మించి జనాలను ఎక్కిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడింది కోర్టు. ఇలాంటి చట్ట విరుద్ధమైన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. ప్రచార మాధ్యమాల్లో యాడ్లు, సైన్‌బోర్డుల ద్వారా విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పింది. చలాన్లు ఎలా వేస్తున్నారు? ఎలా వసూలు చేస్తున్నారు? చట్టం కఠినంగా అమలు చేయడానికి తీసుకున్న చర్యలేంటీ? రోడ్లపై తనిఖీలకు ఏర్పాటు చేసిన టీంలు ఎన్ని? అన్ని వివరాలతో అఫిడవిట్ వేయాలని పోలీసులను ఆదేశించింది. అనంతరం విచారరణ మూడు వారాలు వాయిదా వేసింది.

## బంగారం వ్యాపారస్థులకు కుచ్చు టోపి

పోరుమామిళ్ళ : గోల్డ్ షాప్ యజమాని మహబూబ్ బాషా, బంగారు వ్యాపారస్తులకు 60 లక్షలు కుచ్చు టోపీ పెట్టిన వైనం బయటపడింది. పోరుమామిళ్లలో పట్టణం లోని వసీం జ్యువెలర్స్ యజమాని మెహబూబ్ భాష తన భార్య హర్షత్ ఉన్నీషా 60 లక్షలు విలువచేసే వెండి బంగారు ప్రొద్దుటూరు, చాగలమర్రి, బద్వేల్ , మైదుకూరు, మరియు తదితర 12 మంది వద్ద బంగారు వెండి కొనుగోలు చేసి వ్యాపార స్తులకు కుచ్చుటోపి పెట్టి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ప్రొద్దుటూరుకు చెందిన గోల్డ్ షాప్ యజమానులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్లలో సబ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి ప్రొద్దుటూరు కు చెందిన కొంతమంది వ్యాపారస్తులు దగ్గర గోల్డ్, వెండి తీసుకొని వచ్చి అమ్ముకొని ప్రతి నెల తిరిగి కొంత కొంత డబ్బు చెల్లించేవాడని నెల క్రితం ప్లాన్ ప్రకారం షాపు యజమాని సుమారు 60 లక్షలు విలువచేసే బంగారుతో వెండితో పరారు కావడంతో ప్రొద్దుటూరుకి చెందిన గోల్డ్ యజమానులు పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చెయ్యగా సబ్ ఇన్స్పెక్టర్ కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## హోటళ్లపై ఆహార భద్రత టాస్క్ ఫోర్స్ దాడులు

### - కాలం చెల్లిన ఆహార పదార్థాలు, బొద్దింకలు గుర్తింపు

సికింద్రాబాద్ : ఆహార భద్రత టాస్క్ ఫోర్స్ అధికారులు సికింద్రాబాద్ పరిధిలోని మూడు హోటళ్లపై దాడులు నిర్వహించారు. గోల్డెన్ డ్రాగన్, సర్వి రెస్టారెంట్, చిల్లీస్ రెస్టారెంట్ల పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించడంతో పాటు వంటశాలలో అపరిశుభ్రమైన వాతావరణం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చిల్లీస్ రెస్టారెంట్ లో వంటశాలలో బొద్దింకలు తిరుగుతున్నట్లు ఆహార పదార్థాలు, వ్యర్థాలు నేలపై అంటుకుని జారుతున్నట్లు తెలిపారు. వంట గదిలో కాలువలతో పాటు ఆహార వ్యర్థాలతో మూసుకుపోయినట్లు పేర్కొన్నారు. రిఫ్రిజిరేటర్లు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు అందులో మాంసాన్ని నిల్వ ఉంచుతున్నట్లు గుర్తించారు. వంటశాలలో పనిచేసే కార్మికులు ఎలాంటి శుభ్రత పాటించడం లేదని అన్నారు. సర్వి బేకరీలో లేబుల్ లేకుండా బిస్కెట్ల విక్రయాలు జరుగుతున్నట్లు, కేక్లా తయారీకి ఉపయోగించే కంటైనర్లు పూర్తిగా తుప్పుపట్టిన స్థితిలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మూడు రెస్టారెంట్లపై కేసు నమోదు చేసినట్లు ఆహార భద్రత టాస్క్ ఫోర్స్ అధికారుల లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

## రేవంత్ కు బుద్ధి చెప్పాలి : సత్యవతి రాథోడ్

మండలిలో ప్రజాసమస్యలపై పోరాడుతున్నం. సమస్యలను పక్కనపెట్టి బిల్లులు ఆమోదించుకుంటున్నారని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. లగచర్ల రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారు. కేటీఆర్ పై అక్రమ కేసులుపెట్టడం ప్రభుత్వ కుట్రలో భాగం. గిరిజన లగచర్ల రైతులకు అండగా నిలిచినందుకే కేటీఆర్ పై కేసులు. లంబాడీలు గిరిజనులు ప్రభుత్వం కుట్రలను తిప్పికొడుదాం. రేవంత్ రెడ్డికి బుద్ధి సరైన బుద్ధి చెప్పాలని అన్నారు....

## ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్టు

హైదరాబాద్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి జరిగింది. ఏఐఎస్ఎఫ్ నాయకులను సుమారు 50 మంది పైగా పోలీసులు అరెస్ట్ చేసి అంబర్పేట మరియు వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దుకై అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నూతన జాతీయ విద్యా విధానం వలన పేద మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రను చేస్తున్నారని అన్నారు. మతతత్వ భావజాలాన్ని విద్యార్థులపై రుద్దాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసేంతవరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు... ప్రజా ప్రభుత్వం అని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో నూతన జాతీయ విద్యా విధానం రద్దుకై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

## రసాభాసగా ఆసుపత్రి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం

పిఠాపురం : పిఠాపురం ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం రసాభాసయింది. ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్ అయిన పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఫోటోను ఆసుపత్రి అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో జనసైనికులు తీవ్ర అభ్యంతరం తెలపడంతో రసాభాసకు దారితీసింది. పవన్ కళ్యాణ్ ఫొటో ఉన్న ఫ్లెక్సీ తెచ్చిపెట్టేవరకూ కార్యక్రమం మొదలు పెట్టడానికి వీల్లేదంటూ జనసైనికులు భీష్మించి కూర్చోవడంతో అప్పటికప్పుడు ఫ్లెక్సీ తెచ్చిపెట్టారు. అయితే., రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటో కూడా పెట్టకుండా కార్యక్రమాన్ని నడిపిస్తుండడంతో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహించి అక్కడ్నుంచి బయటకు వెళ్ళిపోయారు. పిఠాపురం నియోజకవర్గంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు ఫొటోగానీ, ఇక్కడి ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ ఫొటోగానీ అధికారులు పెట్టడం మానేశారని, మూడునాలుగు సార్లు ఇలాంటి అనుభవం ఎదురైందని మాజీ ఎమ్మెల్యే వర్మ మీడియా ముందు ఆవేదన చెందారు. ఇకపై ఇటువంటి పొరపాట్లు పునరావృతమయితే ఉన్నతాధికారులతో చెప్పి సంబంధిత అధికారుల్ని సస్పెండ్ చేయించే చర్యలు కూడా ఉంటాయని వర్మ హెచ్చరించారు..

## మద్యం మత్తులో మైనర్ బాలుడి హల్ చల్

పిఠాపురం : మైనర్ బాలుడు మద్యం సేవించడమే కాకుండా ఇద్దరు వ్యక్తులపై బీరు సీసాతో దాడి చేసిన ఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒక బాలుడు మద్యం సేవించి గొల్లప్రోలు మెయిన్ రోడ్డులో తిరుగుతూ కనిపించిన వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. దారి వెంట ఉన్న సైకిళ్లను కాలితో తన్నుతు భీభత్సం సృష్టించాడు. గొల్లప్రోలు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న అక్కి రెడ్డి వీరబాబు సైకిల్ను కాలితో తన్ని పడగొట్టడంతో సైకిల్ ఎందుకు తన్నావని అడిగిన వీరబాబుపై పక్కనే పడి ఉన్న ఖాళీ బీరు సీసాతో దాడికి దిగాడు. గాయాలు పాలైన వ్యక్తులను మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు..

## జాకెట్లను మాత్రమే దొంగిలిస్తాడు

నరసాపురం : బండి పోయింది ..ఇంట్లో వస్తువు లు , నగదు దూచుకుపోయారు ... ఇలా దొంగతనాలు గురించి సాధారణంగా మనం వింటూ ఉంటాం . అయితే పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ప్రాంతంలో ఓ దొంగ చోరీలు వింతగా ఉన్నాయి వందల సంఖ్యలో దొంగతనాలు చేసిన ఖరీదైన వస్తువుల్ని దోచుకుపోలేదు ఇంతకీ ఈ వింత దొంగ చేసిన చోరీ లు వింటే మీకే ఆశ్చర్యం కలగక తప్పదు ఎందుకంటే అతను చేసిన చోరీలు ఏమిటంటే మహిళలు ఆరవేసిన జాకెట్లు ఎత్తుకుపోవ డం. పశ్చిమగోదావరి నరసాపురం మండలంలో గత ఆరు నెలల నుంచి రాత్రి సమయాల్లో మహిళల జాకెట్లు కనిపించకుండా పోతున్నాయి. బాత్రూంలో బయట ఆరేసిన జాకెట్లను ఎత్తుకెళ్లి పోతుండటంతో గ్రామస్తులు నిగా పెట్టి రాత్రి దొంగ ను పట్టుకున్నారు. అతను సంచిలో జాకెట్లు ఉండటం చూసి షాక్ అయ్యారు. ఇదే మండలం వేముల దీవి గ్రామానికి చెందిన వ్యక్తిగా దొంగను గుర్తించారు. నిలదీయగా ఇప్పుడు వరకు300లకు పైగా జాకెట్లను దొంగలించినట్లు ఒప్పు కున్నాడు. దొంగలించిన జాకెట్లు కాలవల్లో పడేస్తున్నట్టు చెప్పాడు. అతని ప్రవర్తనను గమనించిన గ్రామస్తులు సైకోగా గుర్తించి పోలీసులకు అప్పగించారు.

మెట్రో సిటీటైమ్స్ METRO CITY TIMES ఆదివారం, డిసెంబర్ 22, 2024

# వేములవాడలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

## -సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు

వేములవాడ : వేములవాడలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు డిమాండ్ చేశారు. వేములవాడ ఫస్ట్ బైపాస్ రోడ్ లో కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగి ప్రజా ఆరోగ్యానికి ఇబ్బందికరంగా ఉన్నాయని, గతంలోనే వేములవాడ మున్సిపల్ కమిషనర్ లెటర్ ఇవ్వడం జరిగిందని కానీ తొలగించలేదని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదే విషయమై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడావిజ్ఞాపన చేయడం జరిగిందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా హానికరమైన చెట్లని డబ్ల్యూహెచ్వో సైతం ఈ చెట్లను నిషేధించింది అని,కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం వీటిని హరితహారంలో భాగంగా పెట్టి ప్రజల ప్రాణాలతోచెలగాటం ఆడారని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు ఆకుల. ఆంజనేయులు,బొడిగె మల్లవ్వ,వావిలాల లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు మెడిటేషన్ కార్యాక్రమం

ఏలూరు : ఏలూరు పెరేడ్ గ్రౌండ్ లో ప్రపంచ మెడిటేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ సిబ్బంది చే మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పి ఎన్ఎస్ఎస్ శేఖర్, ఆర్ ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ మెడిటేషన్ అనేది మనసు, శరీరం మరియు ఆత్మకు సమతౌల్యం అందించే ప్రాక్టీస్. దీనికి అనేక ఆరోగ్య మరియు మానసిక ప్రయోజనాలు ఉన్నాయిన్నారు. బ్రహ్మ కుమారి ఈశ్వరి విశ్వ విద్యాలయం రాజ యోగి సిస్టర్ లావణ్య, సిస్టర్ బిందు, బ్రహ్మ కుమారి ఫాలోవర్స్ పాల్గొని మెడిటేషన్ వల్ల కలిగే ఉపయోగాలను గురించి పోలీసు అధికారులకు వివరించారు.
ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు ఏ ఆర్ ఎస్ ఐ లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

అల్లూరు: అల్లూరి జిల్లాలో గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. భారీ వర్షాలకు కొత్తవలస కిరండూల్ రైలు మార్గంలో ట్రాక్పై బండరాళ్లు జారిపడ్డాయి. ఈక్రమంలో విశాఖపట్నం నుంచి అరకు వెళ్తున్న గూడ్స్ రైలులో ఒక వాగన్ బొర్రా రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ట్రాక్ను పునరుద్ధించేందుకు రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు.

# ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బిజెవైఎం ఆందోళన

హైదరాబాద్ : ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బిజెవైఎం ఆందోళనకు దిగింది. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ అంబేద్కర్ ను అవమాన పరిచింది కాంగ్రెస్ పార్టీనే. అంబేద్కర్ ను గౌరవించి భారత రత్న ఇచ్చింది బిజెపి. అంబేద్కర్ విగ్రహాన్ని పార్లమెంట్ లో పెట్టిన ఘనత బిజెపిది. కాంగ్రెస్ పార్టీ కులాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవలని చూస్తుంది. రాహుల్ గాంధీ సహనం కోల్పోయి తమ ఎంపీపై దాడి చేశాడు. కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరిని ప్రజల మధ్య ఎండగడతామని అన్నారు. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు బిజెవైఎం నాయకులు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులకు , బిజెవైఎం నాయకుల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో , వారిని అరెస్ట్ చేసారు.

# మిస్సింగ్ అయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన వేములవాడ పోలీసులు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని హరిహర ఫంక్షన్ హాల్ వద్ద రెండు సంవత్సరాల బాలిక హన్సిక మిస్సింగ్ అయింది. అయితే కోడిమ్యాల నుండి రమేష్ రమ్య దంపతులు గురువారం రోజున బందువుల పెళ్లి కోసం వేములవాడ కి వచ్చారు. రాత్రి బందువుల ఇంటి వద్దనే ఉండగా తెల్లవారు జమున బాలిక మిస్సింగ్ అయింది. అయితే ఆడుకుంటూ రోడ్డు దాటి ముందుకు చాలా దూరం వెళ్ళింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా దొరక లేదు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీస్ లకి సమాచారం ఇచ్చారు. అయితే దర్యాప్తు లో భాగంగా ప్రభు అనే యువకుడి కి పాపం దొరకడంతో పోలీస్ స్టేషన్ లో అప్పగించాడు. తల్లిదండ్రులకి బాలిక ను అప్పగించారు.

# కలెక్టర్ మానవత్వం

## పల్లీలు అమ్ముకునే దివ్యాంగురాలికి లక్ష రుణం

ఖమ్మం : ఖమ్మం త్రీ టౌన్ జహీర్ పుర చౌరస్తాలో దివ్యాంగురాలు దుంగ్రోత్ కమల నాలుగు చక్రాల బండిపై పల్లీలు అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఖమ్మం నగరంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటిస్తున్న సందర్భంలో దివ్యాంగురాలు కమలమ్మ పల్లీ బండి వద్ద కారులో ఆగారు. కలెక్టర్ అంటే ఎవ్వరో తెలియని కమల పల్లీలు కావాలా సార్ అని అడగటంతో.. ఓ చిరునవ్వు నవ్వారు. దివ్యాంగురాలు కమల కుటుంబ పరిస్థితిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నేను మా అమ్మ మాత్రమే ఉన్నాం సార్ అంటూ తన దుర్భర జీవితాన్ని వివరించింది. స్పందించిన కలెక్టర్. నీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మాటా ఇచ్చి వెళ్లారు. తర్వాత కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫోన్ చేసిన కలెక్టర్, జమలమ్మకు రుణం అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతో మెప్మా డీఎంసీ సుజాత, టీఎంసీ సుజాత, సీవో రోజా ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న బ్యాంక్ తో మాట్లాడి కేవలం ఐదు రోజుల్లోనే 1లక్ష వ్యాపార రుణం చెక్కును అందించారు. త్వరలో కమలతో కూరగాయాల వ్యాపారం ఏర్పాటు చేసేందుకు కార్యచరణ చేశారు.

# విద్యార్థులకు స్కాలర్ షిప్ లను వెంటనే చెల్లించండి

వనపర్తి : జిల్లా కేంద్రంలోని బి సి ఎఫ్ రాష్ట్ర నాయకులు ఆదేశానుసారం వనపర్తి జిల్లా నాయకులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ప్రధానంగా ఇంటర్ డిగ్రీ పీజీ నర్సింగ్ కాలేజీలలో చదివే విద్యార్థులకు ఫీజులు స్కాలర్ షిప్ లను గవర్నమెంట్ పెండింగ్లో రెండేళ్ల నుంచి ఉన్నాయి. తక్షణమే పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు పెంచాలని విడుదల చేయాలని కోరడమైనది విదేశాలలో విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థికి 20 లక్షలు రూపాయలను ఇవ్వాలని కోరడమైనది కలెక్టర్ స్పందించి గవర్నమెంట్ కు పంపిస్తామని స్పందించడం జరిగింది ,, ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కురుమూర్తి , టౌన్ అధ్యక్షులు ఉందే కోటి అంజి , రాష్ట్ర నాయకులు తోట బాలరాజ్, కృష్ణ, కాశీం, వెంకటాచారి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడు లక్షల ఇరవై వేల దొంగ పెన్షన్లు

అనకాపల్లి : అనకాపల్లి జిల్లా నాతవరం మండలం మర్రిపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అయ్యన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా దొంగ పెన్షన్లపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రాష్ట్రంలో మూడు లక్షల 20వేల మంది దొంగ పెన్షన్లు తీసుకుంటున్నారని తేలింది. తప్పుడు వయసు ధ్రువపత్రాలు సృష్టించి దొంగ పెన్షన్లు తీసుకుంటున్నారని బట్టబయలు అయింది. ప్రతినెల మనిషి ఒక్కొక్కరికి పెన్షన్ రూపంలో 4వేలు రూపాయలను మంజూరు చేస్తున్నారు. దొంగ పెన్షన్లు కారణంగా నెలకు పెన్షన్లు రూపంలో 120 కోట్లు ప్రభుత్వానికి నష్టం చేకూరుతుంది. సంవత్సరానికి 1440 కోట్లు, ఐదు సంవత్సరాలకు 7200 కోట్లు ప్రభుత్వానికి నష్టం. ఇదే సొమ్ముతో మూడు తాండవ రిజర్వాయర్లు నిర్మించుకోవచ్చు. దొంగ పెన్షన్ తీసుకుంటున్న వారందరూ... దొంగలే అని అంటాను. దొంగ పెన్షన్లపై సీఎం చంద్రబాబు నాయుడు కు కూడా చెప్పాను... చూద్దాం అని అన్నారు. ఇక్కడ చెప్పొచ్చో లేదో అంటూనే... ఎవరేమనుకున్నా లెక్క చేయనంటూ తన పాత తరహా పందాలోనే నా స్టైలే వేరు అంటూ అన్నారు.

# పాలమూరు గులాబీలో కుమ్ములాటలు



మహబూబ్ నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్ఎస్ పాలిటిక్స్ విచిత్రంగా తయారయ్యాయి. అక్కడ బీఆర్ఎస్ రాజకీయాలు ప్రజలకు కాదు. అసలు పార్టీ శ్రేణులకే అర్థం కావడం లేదంట. ఎన్నికల ముందు పార్టీ కార్యక్రమాలు అంటే ఎంతో హడావిడి ఉండేది. ఇప్పుడు అసలు పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు, మాజీ ఎమ్మెల్యేలు ఎవరు పెద్దగా ఆక్టివ్‌గా లేరని క్యాడర్ లో చర్చ నడుస్తోంది. ఇక జిల్లా కేంద్రంలో అయితే ఆ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా కనిపిస్తున్నాయి. పార్టీ సొంత నిధులతో నిర్మితమైన జిల్లా కార్యాలయం ఎన్నికల్లో ఓటమి తర్వాత నిరుపయోగంగా మరిందనుకుంటే? కొత్తగా మరో కార్యాలయం తెర మీదకు వచ్చింది. మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ కార్యాలయం ఎన్నికల తర్వాత ప్రమోషన్ పొందింది. అందుకేనెమో ఇప్పుడు ఏకంగా జిల్లా పార్టీ కార్యాలయం అని స్టికర్ మార్చేసుకుంది. .. వాస్తవానికి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఒకరో ఇద్దరు కూడా కనిపించేవారు కాదు. అదే టైంలో న్యూ టౌన్ లో ఉన్న నియోజకవర్గ కార్యాలయంలోనే కార్యకర్తలు, నాయకుల సందడి కనిపించేది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న శ్రీనివాస్ గౌడ్ నిత్యం ఇదే కార్యాలయానికి రావడం, కార్యక్రమాలు నిర్వహించి హడావుడి చేశారు?. అనంతరం ఎంపీ ఎన్నికల్లోను అదే తరహా పార్టీ కార్యక్రమాలు నిర్వహించే వారు.. అంతవరకు అంతా బాగానే ఉన్నా? అకస్మాత్తుగా నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి జిల్లా పార్టీ కార్యాలయంగా పేరు మార్చడం గులాబీ క్యాడర్ లో చర్చనీయాంశం అయింది. జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున సొంత భవనం నిర్మంపచేసి?. జిల్లా పార్టీ కార్యాలయం అందులో ఏర్పాటు చేసి ఆ భవనాన్ని స్వయంగా కారు పార్టీ అధినేత కేసీఆరే ప్రారంభించారు? అలాంటి జిల్లా కార్యాలయానికి నియోజకవర్గ ఆఫీసు ఇప్పుడు పోటీగా మారింది. ఇదంతా ఎందుకు జరిగిందో ఏం జరుగుతుందో ఎవరికి అర్థం కావడం లేదు. పార్టీలో ఆధిపత్య పోరులో భాగంగానే ఇది జరిగిందా? అన్న అనుమానాలు కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నాయిజడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన హయాంలో ఇప్పటివరకు ప్రారంభోత్సవం తప్ప జిల్లా పార్టీ కార్యాలయంలో ఒక్క సమావేశం కూడా జరగలేదు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనూ ఎలాంటి సందడి లేకుండా బోసిపోయింది. జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కేంద్రంగా పార్టీ వ్యవహారాలు కొనసాగాయి. దాంతో జిల్లా పార్టీ ఇన్చార్చ్‌కి పెద్దగా పనుండేది కాదని, పార్టీ కార్యకలాపాలు పర్యవేక్షించాల్సిన అవసరం కూడా రాలేందంటారు. పార్టీకి సంబంధించి ఏ పనులైన నేరుగా అధిష్టానంతో చర్చించుకొని నాటి ఎమ్మెల్యేలే చేయించుకునేవారట. దాంతో అటు జిల్లా అధ్యక్షుడు, ఇటు పార్టీ జిల్లా కార్యాలయాలకు ప్రాధాన్యత లేకుండా పోయిందిఎన్నికల తర్వాత సడన్‌గా మరో జిల్లా కార్యాలయం పుట్టుకు రావడం జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మొదటి నుంచి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జిల్లా పార్టీ కార్యాలయంలో కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో.. శ్రీనివాసగౌడ్ పర్యవేక్షించే నియోజకవర్గ కార్యాలయంలోనే పార్టీ హడావిడి జరుగుతోంది. లక్ష్మారెడ్డి పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండం వల్లే ఇలాంటి పరిణమాలు చోటు చేసుకుంటున్నాయని కేడర్ భావిస్తుంది. జిల్లా కేంద్రంలో తాను హడావిడి చేస్తే మాజీ మంత్రి శ్రీనివాన్‌గౌడ్‌తో తనకు నేరుగా అభిప్రాయ బేధాలు వస్తాయని, లేనిపోని తలనొప్పి ఎందుకని లక్ష్మా రెడ్డి భావిస్తున్నట్లు చెప్తున్నారు. ఏదేమైనా సడన్‌గా నియోజకవర్గ కార్యాలయం? జిల్లా కార్యాలయంగా మార్పు చెందడంతో క్యాడర్ లో గందరగోళం నెలకొంది. ఇద్దరు మాజీ మంత్రుల మధ్య గ్యాప్ కారణంగానే శ్రీనివాసగౌడ్ నియోజకవర్గం ఆఫీసుకి జిల్లా పార్టీ కార్యాలయం బోర్డు పెట్టించారంటున్నారు. మొత్తానికి ఓటమి తర్వాత కూడా పాలమూరు జిల్లా బీఆర్ఎస్ నేతల రాజకీయం ఎవరికీ అంతుపట్టకుండా తయారైంది.

# మాకో ఇల్లు కావాలి.. పొలిటికల్ సినిమా స్టార్ట్..

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం తెలంగాణ ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తే.. పనులు ప్రారంభించేందుకు రెడీగా ఉన్నారు. ప్రభుత్వం ఒక్కో ఇల్లుకు రూ. 5 లక్షలు ఇవ్వనుంది. దీంతో మరికొన్ని డబ్బులు కలిపి ఇల్లు కట్టుకోవాలని చాలామంది ఆశగా ఉన్నారు. అటు లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఈ సర్వే తర్వాత లబ్ధిదారుల జాబితాను ప్రకటించే అవకాశం ఉంది. బాగానే ఉన్నా.. అసలు పొలిటికల్ సినిమా ఇప్పుడే స్టార్ట్ అయ్యింది. గ్రామాలు, పట్టణాల్లో కాంగ్రెస్ నాయకుల ఇళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇండ్ల కోసం ఎదురుచూసేవారు కాంగ్రెస్ లీడర్ల చుట్టూ తిరుగుతున్నారు. అన్నా.. మనకో ఇల్లు మర్చిపోకే.. అంటూ ఎక్కడ కలిస్తే అక్కడ గుర్తు చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో.. లీడర్లు కూడా ఆచితూచి మాట్లాడుతూ.. తమవారి కోసం పైరవీలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కమిటీల ఏర్పాటు పూర్తయ్యింది. కానీ.. అసలు సమస్య ఇక్కడే వచ్చింది. గ్రామాల విషయం పక్కనబెడితే.. పట్టణాల్లో ఈ కమిటీలో కౌన్సిలర్లు, కార్పోరేటర్లు కీలకంగా మారారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే చాలామంది కౌన్సిలర్లుగా ఉన్నారు. కొన్నిచోట్ల బీజేపీ వారు ఉన్నారు. కమిటీల్లో వారు ఉండటాన్ని కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. వారిపై పైచేయి సాధించడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని చోట్ల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కమిటీల్లో సభ్యులుగా ఉన్నారు. అలాంటి చోట కాంగ్రెస్, బీఆర్ఎస్ లీడర్లు కాంప్రమైజ్ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. తాను కౌన్సిలర్ కాబట్టి.. తమ అనుచరులకు కొన్ని, అధికారం మీది కాబట్టి మీకు కొన్ని అని ఇండ్లను పంచుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. తొలి దశలో తక్కువ ఇండ్లు వస్తున్నాయి. లబ్ధిదారులు ఎక్కువమంది ఉన్నారు. ఈ నేపథ్యంలో.. ఇండ్ల కోసం నాయకుల చుట్టూ తిరుగుతున్నారు. చాలాచోట్ల ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సమస్యగా మారబోతోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల కమిటీల ఏర్పాటు విషయంలోనే గొడవలు అయ్యాయి. కాంగ్రెస్ కాకుండా వేరే పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు కమిటీల్లో చోటు ఇవ్వడంపై ఘర్షణలు జరిగాయి. అలాంటి పంచాయితీలు కలెక్టర్ల దగ్గరకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. కానీ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే కమిటీలు ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. దీంతో లబ్ధిదారుల ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే అన్ని జిల్లాల్లో యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. 30 - 35 ప్రశ్నల ఆధారంగా వివరాలను సేకరించి.. ఆన్ లైన్ లో ఎంట్రీ చేస్తున్నారు. అన్ని కోణాల్లో వివరాలను క్రోడీకరించి అసలైన అర్హులకే స్కీమ్ ను వర్తింపజేయనున్నారు. గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. గ్యారెంటీ పథకాల కోసం మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 82,82,332 అప్లికేషన్లు అందాయి. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావటంతో వీటి వడపోత ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్ గా మారింది.

# ప్రజల సౌకర్యార్థం పన్నూరు వాగుపై బ్రిడ్జి నిర్మించండి

కమాన్ పూర్ : రామగిరి మండలంలోని పన్నూర్ వాగుపై ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జి ఏర్పాటు చేయాలని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ కోరారు. పన్నూరు వాగు పై బ్రిడ్జి లేక వాగు అవతలి వైపు ఉన్న పొలాలకు మరియు మదన పోచమ్మ ఆలయానికి వేళ్ళే నందుకు వర్షాకాలంలో వాగుపై బ్రిర్డిజి. లేక పొలాల వెళ్లే రైతులు మరియు గుడికి వెళ్లే భక్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయం పై తాజామాజీ ఎంపీటీసీ చిందం మహేష్ తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించడంతో రామగిరి మండలం పన్నూర్ గ్రామం లో పంచాయతీరాజ్ ఏఈ వర లక్ష్మి ,వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ వాగు వద్దకు వచ్చి ఎస్టిమేషన్ కోసం మెజర్మెంట్ తీసుకోవడం జరిగింది.

# టాలీవుడ్ వర్సెస్ సర్కార్



హైదరాబాద్ : సినీ ఇండస్ట్రీ, పాలిటిక్స్ బంధం బలమైనది అంటారు. ఇప్పటి వరకు అలాగే ఉండేది.. రెండు రంగాల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఇంత కాలం కొనసాగుతూ వచ్చింది.. రాష్ట్రమేదైనా, ప్రభుత్వమేదైనా గ్లామర్ వరల్డ్‌కు ఇచ్చే ప్రయారిటీ వేరు.. ఐతే తెలంగాణలో మాత్రం సీన్ రివర్స్ డైరెక్షన్‌లో సాగుతోంది. ఇండస్ట్రీకి-పాలిటిక్స్‌కి చిన్న గ్యాప్ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సినిమా వాళ్లకు ప్రయారిటీ ఇచ్చే సాంప్రదాయానికి రేవంత్ సర్కార్ ప్యాకప్ చెప్పేసినట్లుగా మారింది పరిస్థితి. ప్రజాపాలనలో చట్టం ముందు అందరూ సమానమేనని చెబుతోంది. వట్టి డైలాగులే కాదు.. చేసి చూపించింది కూడా. కాంగ్రెస్ సర్కార్ అధికార పీఠం ఎక్కగానే.. నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చేసి టాలీవుడ్‌కి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇక మొన్న అల్లు అర్జున్ అరెస్ట్‌తో చట్టానికి ఎవరైనా ఒక్కటేనని మరింత బలంగా చెప్పింది..గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్న వాళ్లకి ప్రజల్లో క్రేజ్ మామాలుగా ఉండదు. స్పెషల్ స్టేటస్, డబ్బులు, ఫారెన్ టూర్లు, ఫ్యాన్స్ ఫాలోయింగ్ రాయల్ లైఫ్ ఉంటుంది. సామాన్య జనమే కాదూ పొలిటికల్ లీడర్లు కూడా హీరోలకు అభిమానులే. ఇలా చాలాకాలంగా సినీ రంగంలోని పెద్దలను ప్రత్యేక క్యాటగిరీగా చూస్తున్నారు. రాజకీయ పరిచయాలు, ప్రభుత్వ పెద్దలతో చనువు ఇలా అన్ని రంగాల్లో స్పెషల్ క్యాటగిరీగా చెలామణి అవుతున్నారు. అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా సినీ ప్రముఖులతో సన్నిహితంగా ఉండడం పరిపాటిగా వస్తోంది. కొందరు సినీ నటులు ఎన్నికల వేళ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయా పార్టీలకు ప్రచారం చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. టాలీవుడ్ హీరోల అభిమానుల ఓట్ల కోసం గత ప్రభుత్వాలు.. వారేం చేసినా.. చూసీ చూడనట్లు వ్యవహరించేవి. నిజానికి కళాకారులను ప్రోత్సహించాలి. కానీ కేవలం సినీ ఇండస్ట్రీ వాళ్లే కళాకారులన్నట్లుగా, మిగితా వారిని పట్టించుకోవాల్సిన పని లేదన్నట్లుగా వ్యవహరించే వారు. కొందరు సినీ స్టార్లు అయితే ప్రభుత్వాలను కూడా లెక్క చేసే వారు కాదు. దీంతో సినిమా వాళ్లు ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అభిప్రాయం జనాల్లో బలంగా నాటుకుపోయింది. కానీతెలంగాణలో రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత ఇండస్ట్రీ లెక్కలు తారుమారయ్యాయి. సినిమా స్టార్స్ అంటే ప్రత్యేకం కాదని స్పష్టం చేస్తోంది రేవంత్ ప్రభుత్వం. తప్పు జరిగితే ఎవరైనా డోంట్ కేర్ అంటూ దూసుకెళ్తోంది. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా అల్లు అర్జున్ అరెస్టుపై నిర్ణయం తీసుకోగలిగింది. అల్లు అర్జున్ అరెస్ట్‌పై వారం రోజుల ఆలస్యం జరిగినప్పుడే బిగ్‌బాస్ ఫేమ్ పల్లవి ప్రశాంత్‌కి ఓ న్యాయం.. అల్లు అర్జున్‌కు మరో న్యాయమా? అనే చర్చ మొదలైంది. కానీ చివరికి చట్టం ముందు అందరూ సమానమని తేల్చేసింది కాంగ్రెస్ సర్కార్. ఒక్క అల్లు అర్జున్ విషయంలోనే కాదు.. ఏడాది కాలంగా గ్లామర్ ఫీల్డ్‌లో ఉన్న చాలామంది విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతోంది. అక్కినేని నాగార్జున ఎన్ కన్వెన్షన్ రూల్స్‌కి విరుద్ధంగా నిర్మించారని నేల మట్టం చేసేశారు. ఈ మధ్య రచ్చగా మారిన మంచు ఫ్యామిలీ ఎపిసోడ్ లోనూ పోలీసులు నిక్కచ్చిగా వ్యవహరించారు. మంచు ఫ్యామిలీ గొడవను పక్కన పెడితే జర్నలిస్టుపై దాడి విషయంలో మోహన్‌బాబుపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు పోలీసులు. ఏ క్షణంలోనైనా మోహన్ బాబును అరెస్ట్ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు పోలీసులు. ఆ మధ్య జానీ మాస్టర్ అరెస్ట్ పైనా ఆగమేఘాలపై ఆదేశాలు ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం. అదేవిధంగా జూనియర్ ఎన్టీఆర్ దేవర ప్రీ రిలీజ్ ఈవెంట్ విషయంలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తగ్గేదేలే అన్నట్టే వ్యవహరించారు. రేవంత్ దూకుడు ముందు సినీ స్టార్ల ఆటలు సాగడం లేదు. ఎక్కడ ఏ చిన్న పొరపాటుతో పట్టుబడినా సామాన్యుల మాదిరిగానే ట్రీట్ చేస్తున్నారనే అభిప్రాయం ఇండస్ట్రీకి బలంగా వెళ్లిపోయింది. అందుకే.. మిగిలిన వారంతా ఎందుకు వచ్చిన గొడవ అని సర్దుకుంటున్నారట. మద్యం తాగి వాహనం నడపాలన్నా జంకుతున్నారట. ముఖ్యంగా చాలా మంది సినిమా వాళ్లకి డ్రగ్స్ విషయంలో లింకులు ఉన్నాయి. కొందరు వాటికి అలవాటు పడితే.. మరి కొందరు సైడ్ బిజినెస్‌గా మార్చుకున్నారని అందరూ బహిరంగంగా చెప్పుకునే సీక్రెట్.. ఇప్పుడు సర్కార్ దెబ్బకి అందరూ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయినట్లు ఇండస్ట్రీ టాక్. ఐతే ఇదంతా ఎందుకు? ఇండస్ట్రీని రేవంత్ సర్కార్ టార్గెట్ చేయడానికి కారణమేంటి? అనే ప్రశ్నలకు మాత్రం కరెక్ట్ ఆన్సర్ లేదు.. కాకపోతే సినీ ఇండస్ట్రీ కానీ, సెలబ్రిటీలు కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పట్టించుకోవడం లేదనే టాక్ పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తోంది.. అందుకే ఇలాంటి ఝలక్‌లు ప్రభుత్వం నుంచి ఎదురవుతున్నాయని కూడా గాసిప్ చక్కర్లు కొడుతోంది.. మరి ఏది నిజం.. ముందు ముందు అంతా సర్దుకుంటుందా? చూడాలి..

# 28న చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం

హైదరాబాద్ : చర్లపల్లి రైల్వే టెర్మినల్ ప్రారంభానికి ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 28న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కిషన్‌రెడ్డి దీన్ని ప్రారంభించనున్నారు. దాదాపు రూ. 430 కోట్ల వ్యయంతో చర్లపల్లి టెర్మినల్‌ను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. ఇక్కడ ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం కల్పించనున్నారు. ఇక్కడ ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్లు, ప్రయాణికుల కోసం వెయిటింగ్ ఏసీ, నాన్ ఏసీ హాల్స్, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు ఎంఎంటీఎస్ ప్లాట్‌ఫాంలతో కలిపి 9 ప్లాట్‌ఫాంలు, 2 ఫుట్ఓవర్ బ్రిడ్జిలు, 6 ఎస్కలేటర్లు నిర్మించారు. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమైన తర్వాత 50 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించనున్నాయి. ప్రతిరోజూ దాదాపు 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం చర్లపల్లి 26 రైళ్లు ఆగుతున్నాయి. వాటిల్లో ముఖ్యంగా కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, పుష్-పుల్, శబరి ఎక్స్‌ప్రెస్, శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, రేపల్లె ప్యాసింజర్, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్ రైళ్లు ఉన్నాయి. చర్లపల్లి నుంచి రైళ్ల రాకపోకలతో హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లపై భారం తగ్గనుంది. అయితే.. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభం అయిన తర్వాత స్టేషన్‌కు చేరుకునే మార్గంలో.. రోడ్ల విస్తరణ చేపట్టి ప్రజారవాణాను మెరుగుపరచాలనే డిమాండ్ ఉంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపితే.. ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. హైదరాబాద్‌కు తూర్పున చర్లపల్లి టెర్మినల్‌ను నిర్మించారు. దీనికి దగ్గర్లోనే ఘట్‌కేసర్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ ఉంది. దీంతో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్లపల్లి టెర్మినల్‌కు చేరుకునే అవకాశం ఉందని.. అధికారులు చెబుతున్నారు. ప్రైవేట్, ప్రజా రవాణా వాహనాలు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. చర్లపల్లి రైల్వే స్టేషన్ పనులు పూర్తైన నేపథ్యంలో రైల్వే బోర్డు పలు అనుమతులు ఇచ్చిందని తెలుస్తోంది. చర్లపల్లి స్టేషన్ నుంచి 6 ఎక్స్ ప్రెస్ రైళ్లను నడిపేందుకు అనుమతి వచ్చిందని సమాచారం. మరో 12 రైళ్లు ఈ స్టేషన్‌లో ఆపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. షాలిమార్ - హైదరాబాద్ ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ - సికింద్రాబాద్ - గోరఖ్ పూర్ ఎక్స్‌ప్రెస్, ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్‌లు చర్లపల్లి నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది.

# పట్టణ అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలి

పెద్దపల్లి : పట్టణాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పని తీరు పై సంబంధిత అధికారులతో నిర్వహించిన రివ్యూ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణాలలో రోడ్ల పై చెత్త లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. పట్టణంలోని ముఖ్యమైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోడ్లపై చెత్త ప్లాస్టిక్ ఉండకుండా చూడాలని అన్నారు. మంథని, సుల్తానాబాద్ పట్టణాలలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి క్రింద మంజూరైన రోడ్లు, డ్రైయిన్, ఇతర అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో మార్చి నాటికి పూర్తి చేయాలని , రోడ్డు విస్తరణ మొదలగు అభివృద్ధి పనులకు ఆటంకం గా ఉన్న విద్యుత్ పోల్స్ ను విద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ తొలగించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పట్టణాలలో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పూర్తి స్థాయిలో వసూలు చేయాలని, మున్సిపాలిటీలలో పని చేసే సిబ్బందికి జీతాల చెల్లింపు లేట్ కాకుండా చూడాలని అన్నారు. ఎల్.ఆర్.ఎస్ పెండింగ్ దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిష్కరించా లని అన్నారు. సుల్తానాబాద్ లోని డివైడర్ లలో మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవా లని కలెక్టర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణానికి డంప్ యార్డ్ ఏర్పాటుకు అనుకూలమైన స్థలాన్ని తహసిల్దార్ తో ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారు లకు తెలిపారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఇంచార్జి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కూటమి పాలనలో రైతుకి పారిశ్రామికవేత్తలతో

# సమంగా ప్రాధాన్యం

బద్వేలు : కూటమి ప్రభుత్వంలో రైతుకు పారిశ్రామికవేత్తలతో సమంగా ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి అడుగులో ఎర్రతివాచీ పరచి రైతుకి ఎక్కడా ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని బద్వేలు నియోజకవర్గ కూటమి నాయకులు ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్లు మంచూరు సూర్యనారాయణ రెడ్డి బోవిల్లా నందగోపాల్ రెడ్డి గుర్రంపాటి వెంగళరెడ్డి తెలిపారు. విత్తనాల కొనుగోలు నుంచి ధాన్యం అమ్ముకునే వరకు సింగిల్ విండో తరహా విధానాలు అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా వ్యవసాయ రంగ పటిష్టతకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో సొమ్ము రైతు అకౌంట్ లో వేసే ఏర్పాటు చేస్తామని తెలిపారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా పౌరసరఫరాల శాఖ బకాయిల్లో రూ. 10 వేల కోట్లు తిరిగి చెల్లించడంతో పాటు 10 వేల కొత్త రేషన్ షాపులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఫెయిర్ ప్రైస్ షాపులు తీసుకువచ్చి బియ్యం, కందిపప్పుతోపాటు చక్కెర, పామ్ ఆయిల్ ఇతర నిత్యావసరాలు అందచేసే ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో బియ్యం నాణ్యత పెంచే విధంగా చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి పని ప్రజల పక్షాన నిలబడే విధంగా ముందుకు వెళ్తోందన్నారు. “ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో చెప్పిన మాటలు అధికారంలోకి వచ్చిన తర్వాత తు.చ.తప్పకుండా ముందుకు తీసుకువెళ్తున్నాం.ప్రజల పక్షాన నిలబడి నిస్వార్ధంగా సేవలు అందిస్తున్నాం. గ్రామాల్లో 80 శాతం మంది కౌలు రైతులు ఉంటే, గత ప్రభుత్వ హాయంలో ఐదేళ్లలోవారి గురించి పట్టించుకున్న నాథుడు లేకపోయాడు. కౌలు రైతుల కృషిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.వారు ఆత్మహత్యలకు పాల్పడినప్పుడు ఒక్కొక్కరు రూ.17 లక్షల వరకు అప్పులు చేస్తే, లక్షా, లక్షా 20 వేలుగా చిత్రించారు. కౌలు రైతు గుర్తింపు నిబంధనలు మార్చేసి సీసీఆర్సీ కార్డులు కూడా ఇవ్వకుండా చేసింది.

# వడ్డేపాళ్యంలో దారుణ హత్య

అనంతపురం : కుందుర్పి మండల సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక బార్డర్లో బోయ గిత్తరాజు దారుణ హత్యకు గురయ్యాడు. మలయనూరు గ్రామపంచాయతీ వడ్డేపాళ్యం గ్రామానికి చెందిన గిత్త రాజు కుందుర్పి మండల సరిహద్దు ప్రాంతమైన నాగేపల్లి గేటు సమీపంలో బస్సు షెల్టర్ వెనకాల రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు సమాచారం అందుకున్న కర్ణాటక పరశురాంపురం పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతూ మృతదేహాన్ని శవ పంచనా నిమిత్తం తరలించారు పరుశురాంపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సమాచారం

## అసెంబ్లీ స్పీకర్ కు కౌశిక్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

హైదరాబాద్ : తక్షణమే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ కి క్షమాపణ చెప్పాలని ఓయూ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా స్పీకర్ పై కాగితాలు చింపి విసరడాన్ని నిరసిస్తూ ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ భూభారతి బిల్లును తీసుకొచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక దళిత స్పీకర్ పై భూభారతి కి సంబంధించిన పేపర్లు చించి వేసి విసరడం సరికాదన్నారు. ఇప్పటికైనా టిఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు అగ్ర వర్ణ దురఅహంకార ధోరణికి వదిలిపెట్టాలని అన్నారు. తక్షణమే పాడి కౌశిక్ రెడ్డి అసెంబ్లీ స్పీకర్ కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే పాడి కౌశిక్ రెడ్డి పైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి పొందాలి

### - జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం: నైపుణ్యాభివృద్ధితో స్వంత బలం మీద ఉపాధి పొందడమే కాక పది మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ముంపు ప్రాంత వాసులకు స్వయం ఉపాధికి ఆర్సిఎం బిషప్ సగిలి ప్రకాష్ ఆధ్వర్యంలో కరుణగిరి బైపాస్ రోడ్ లోని కారుణ్య కమ్యూనిటీ సెంటర్లో ఏర్పాటుచేసిన నైపుణ్య అభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదలతో ఎన్నో బాధలు పడి, ధైర్యంగా నిలదొక్కుకున్నామన్నారు. నైపుణ్య కార్యక్రమం ద్వారా జీవన రీతిని, పద్ధతిని మార్చుకోనుటకు అవగాహన కలుగుతుందన్నారు. మహిళలు కుట్టుమిషన్, హోమ్ నర్సింగ్, ఇస్తరాకులు, కప్స్, క్యాండీల్స్, అగరవత్తుల తయారీ, బ్యూటీషియన్ తదితరాల్లో నైపుణ్యం పొంది, స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలన్నారు. మనం అభివృద్ధి చెందినప్పుడే కుటుంబాలు, సమాజం, గ్రామం, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అందరూ బాగుంటే, నేనూ బాగుంటాను అనే భావన రావాలన్నారు. కోర్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. నైపుణ్య కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా నైపుణ్య అభివృద్ధి కార్యక్రమానికి వచ్చిన మహిళలను సమస్యల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరదల్లో ఇండ్లు కొట్టుకుపోవడం, తీవ్ర నష్టం వాటిల్లడం జరిగిందని, ఇండ్ల నిర్మాణానికి మహిళలు కోరగా, ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరుగుతున్నట్లు, మొదటి విడతగా స్థలాలు ఉన్న వారికి పథక లబ్ది చేకూర్చనున్నట్లు, దశల వారిగా అర్హులందరికి ఇండ్లు మంజూరులు జరగనున్నట్లు తెలిపారు. కాలనీల్లో రోడ్లు, మౌళిక సదుపాయాల కల్పన కు చర్యలు చేపట్టనున్నట్లు అన్నారు. అనంతరం రాజీవ్ గృహకల్ప సమీపంలో ఉన్న మదర్ థెరిస్సా ఓల్డ్ ఏజ్ హోమ్ ను సందర్శించారు. ఆశ్రమంలో అనాధలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు . వరదల వల్ల దెబ్బతిన్న భవనాలు పరిశీలించారు. నీరు సాఫీగా వెళ్లిపోయేలా కార్యాచరణ చేయాలన్నారు. నష్టానికి ప్రభుత్వం నుండి సహకారానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ తహసిల్దార్ రాంప్రసాద్, ఫాదర్ తప్పేట శౌరీ వికార జర్నల్, ఫాదర్ మాధ్యు వరప్రసాద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌పై అమిత్ వ్యాఖ్యలను సమర్థించిన వైఎస్ఆర్‌సీపీ

### - అవమానించలేదని క్లారిటీ

అమరావతి : పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ అంశంలో రాజకీయ పార్టీలన్నీ తమ అభిప్రాయాలను చెబుతున్నాయి. సహజంగానే ఎన్డీఏ పార్టీలు ఎన్డీఏను సమర్థిస్తున్నాయి. ఇండీ కూటమి పార్టీలు అమిత్ షాపై ఆందోళనలు చేస్తున్నాయి. అయితే ఏ కూటమిలో లేని వైసీపీ అనూహ్యంగా అమితా షాకు మద్దతుగా నిలిచింది. ఆయన చేసిన వ్యాఖ్యల్ని సమర్థించిది. అమిత్ షా అంబేద్కర్ అగౌరవ పర్చలేదని తెలిపిది. వైసీపీ అధికారిక ట్విట్టర్ హ్యాండిల్ లో వేసిన ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. సహజంగా బీజేపీకి మిత్రులుగా ఉన్న టీడీపీ, జనసేన ఎన్డీఏ కూటమిలో ఉన్నాయి. ఆ కారణంగా వైసీపీ బీజేపీ కూటమిని, ఆ కూటమిలోని నేతల్ని సమర్థించకూడదు. పైగా ఇటీవలి కాలంలో జగన్ ఢిల్లీలో దర్నా చేశారు. ఆ ధర్నాకు సపోర్టు చేసిన వారంతా ఇండీ కూటమి పార్టీలకు చెందిన నేతలే. తనకు కష్టం వచ్చినప్పుడు వారంతా వచ్చి సపోర్టు చేసినా జగగన్ మాత్రం ఇలాంటి కీలక విషయాల్లో ఇండీ కూటమి ఆందోళనలకు మద్దతు ఇవ్వడం లేదు. సరి కదా బీజేపీకి మద్దతు పలుకుతున్నారు. జమిలీ ఎన్నికల విషయంలోనూ వైసీపీ బీజేపీ కూటమికే మద్దతు తెలిపింది. అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్, మిత్రుపక్షాలు తీవ్ర ఆందోళనలు చేస్తున్నాయి. ఆయన రాజ్యాంగ నిర్మాతను అవమానపరిచారని అంటున్నాయి. అంబేద్కర్ ను స్మరించుకోవడం కన్నా దేవుడ్ని స్మరించుకోవడం బెటరని ఆయన అన్నారని ఆరోపిస్తున్నారు . ఈ అంశంపై ఆయన వివరణ ఇచ్చారు.

# వైష్ణవాలయాలు, పంచరామాలకు స్పెషల్ ప్లాన్

విజయవాడ : పుణ్యక్షేత్రాల యాత్ర చేసే భక్తులకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. సప్త శ్రీనివాస దర్శన భాగ్యం, పంచ వైష్ణవ క్షేత్ర దర్శనం, త్రిముఖ వైష్ణ దర్శన భాగ్యం పేరుతో పుణ్యక్షేత్రాలకు స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. మచిలీపట్నం నుంచి స్పెషల్ సర్వీస్‌లు అందుబాటులో ఉండనున్నాయి.ఆర్టీసీ నిత్యం కొత్త సర్వీసులను, ప్రత్యేక సర్వీసులను అందుబాటులో తెస్తుంది. డిమాండ్‌ను బట్టి, ప్రయాణికులు, యాత్రీకులు అత్యధికంగా వెళ్లే మార్గాలకు అతితక్కువ ధరకు, సురక్షితమైన ప్రయాణాన్ని అందిస్తుంది. అందులో భాగంగానే రాష్ట్రంలోని, ఏడు శ్రీనివాస ఆలయాలు, ఐదు వైష్ణవ ఆలయాలు, త్రిముఖ వైష్ణవ ఆలయాల దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీస్‌లను అందుబాటులోకి తెచ్చింది.మార్గశిర మాసంలో సప్త శ్రీనివాస దర్శనం, పంచ వైష్ణవ క్షేత్రదర్శనం, త్రిముఖ వైష్ణవ దర్శనం పేరుతో ప్రతి శుక్ర, శనివారం ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ప్రతి శుక్ర, శనివారాల్లో రాత్రి సమయంలో బస్సు మచీలిపట్నం ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరుతోంది. అప్పనపల్లి, యానాం, మండపేట, వాడపల్లి, అన్నవరప్పాడు, కొడమంచిలి, అబ్బిరాజుపాలెం దర్శనం అనంతరం తిరిగి మచిలీపట్నం చేరుకుంటారు.

పంచ వైష్ణవ ఆలయాల దర్శనం..అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి, అప్పనపల్లి శ్రీబాల బాలజీ స్వామివారి ఆలయం, గొల్లలమామిడాడ కోదండరామ స్వామివారి ఆలయం, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం, ద్వారకా తిరుమలలో వెంకటేశ్వరస్వామి దర్శనం అనంతరం తిరిగి మచిలీపట్నం చేరుకుంటారు.

త్రిముఖ వైష్ణవ దర్శనం..

ద్వారకా తిరుమలలో వెంకటేశ్వరస్వామి దర్శనం, వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనం, అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనం అనంతరం తిరిగి మచిలీపట్నం చేరుకుంటారు.

ప్యాకేజీ ఇలా..

1. సప్త శ్రీనివాస దర్శన ప్యాకేజీ సూపర్ లగ్జరీ సర్వీసుకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.900 లుగా నిర్ణయించారు.
2. పంచ వైష్ణవ ఆలయాల దర్శన ప్యాకేజీ సూపర్ లగ్జరీ సర్వీసుకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1,300లుగా నిర్ణయించారు.
3. త్రిముఖ వైష్ణవ దర్శన ప్యాకేజీ సూపర్ లగ్జరీ సర్వీసుకు ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.1,050లుగా నిర్ణయించారు.

# ఐప్యాక్... పేకప్...

విజయవాడ : వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు 2019లో అధికారాన్ని తెచ్చిపెట్టిన ఐ ప్యాక్ సంస్థ ఆంధ్రప్రదేశ్ నుంచి ప్యాకప్ చెప్పేసింది. ఐ ప్యాక్ సంస్థ బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ దే అయినప్పటికీ ఆయన 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన బీహార్ రాజకీయాలకు పరిమితమయ్యారు. దీంతో ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారు దానిని నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికలకు కూడా వైఎస్ జగన్ మరోసారి గెలిచేందుకు ఐప్యాక్ సంస్థను కొనసాగించారు. ఐప్యాక్ సంస్థకు రుషిరాజ్ నేతృత్వం వహించారు. ఐదేళ్ల పాటు ఐప్యాక్ సంస్థ వైసీపీకి సేవలందించింది. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ, సోషల్ మీడియాలో ప్రచారం వరకూ అంతా తానే అయి ఐప్యాక్ సంస్థ జగన్ కు అనుకూలంగా పనిచేసింది ఎన్నికల పోలింగ్ జరిగిన తర్వాత నేరుగా అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఐప్యాక్ సంస్థకు వెళ్లి వారితో ముచ్చటించి వచ్చారు. ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారికి అభినందనలు తెలిపారు. దేశం నివ్వెరపోయాలా ఫలితాలు వస్తాయని తెలిపారు. ఇటు ఐప్యాక్ సంస్థ కూడా రెండోసారి గెలుపు వైసీపీదేనంటూ జగన్ కు నివేదికలను అందించడంతో ఆ సంస్థపై జగన్ పూర్తిగా నమ్మకం ఉంచారు. తన గెలుపునకు సంక్షేమ పథకాలు సగం కారణమైతే, మిగిలిన సగం ఐప్యాక్ పూర్తి చేస్తుందనిగట్టిగా నమ్మారు. కానీ ఫలితాలు తారుమారయ్యాయి. నిజంగానే దేశం నివ్వెరపోయేలా మైండ్ బ్లాంక్ అయ్యేలా వైసీపీకి కేవలం పదకొండు స్థానాలు మాత్రమే వచ్చాయి. అప్పటి నుంచి ఐ ప్యాక్ యాక్టివిటీ పెద్దగా లేదు.మరోవైపు ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో పాటు సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెట్టే పోస్టులపై చర్యలకు సిద్ధమవుతుంది. అనేక మంది పై కేసులు నమోదయ్యాయి. కొందరు జైళ్లకు వెళ్లి వచ్చారు. మరికొందరు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. దీంతో ఐప్యాక్ టీంలోనూ కొంత బెరుకు ఏర్పడినట్లుంది. తాము ఇక్కడ ఉంటే కేసులను ఎదుర్కొనాల్సి వస్తుందని భావించి బెజవాడ నుంచి బిచాణా లేపేసింది. ఇప్పుడు విజయవాడలో ఐ ప్యాక్ సంస్థ లేనట్లేనని అంటున్నారు. వైసీపీలో కూడా పెద్దగా యాక్టివిటీ లేకపోవడం, ఎన్నికలకు ఇంకా నాలుగున్నరేళ్లు గడువు ఉండటంతో ఐప్యాక్ సంస్థ షటర్స్ క్లోజ్ చేసిందని చెబుతున్నారు. విజయవాడ నుంచి పక్కకు వెళ్లి పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో ఉండాలన్నా అక్కడ కూడా తమకు అనుకూలమైన ప్రభుత్వం లేకపోవడంతో ఐ ప్యాక్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో లేకుండా పోయింది. గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కూడా ఐప్యాక్ పనిచేసింది. ఐప్యాక్ బెజవాడ నుంచి బోర్డు తిప్పేసి ఇప్పుడుకోల్ కత్తా, బీహార్, ఢిల్లీకి వెళ్లినట్లు తెలిసింది. బీహార్ లో తమ సంస్థ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ కు అండగా ఉండేందుకు ఒక టీం వెళ్లిందంటున్నారు. అలాగే కోల్ కత్తాకు మరొక టీం వెళ్లిందని చెబుతున్నారు. ఇక ఢిల్లీలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున పనిచేయడానికి ఐ ప్యాక్ టీం అక్కడకు వెళ్లిందన్నది సమాచారం. మొత్తం మీద జగన్ ను వదిలి ఐప్యాక్ టీం పూర్తి గా దూరంగా వెళ్లిపోయిందనే చెప్పాలి.

### మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రుల పై

# వాహన యజమానులపై కేసులు

**తల్లిదండ్రులు మైనర్ డ్రైవింగ్ విషయంలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి**

**జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 285 వాహనాలు సీజ్**

**తరచు మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే కేసులు తప్పవు : ఎస్పి అఖిల్ మహాజన్**




రాజన్న సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక దృష్టి సారించి మైనర్ మైనర్ డ్రైవింగ్ పై స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించి 285 వాహనాలు సీజ్ చేసి,పట్టుబడిన మైనర్లకు వారి తల్లిదండ్రులకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కౌన్సెలింగ్ నిర్వహించి తరచు మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్. గతంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో మైనర్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన సుమారు 300 వాహనాలు సీజ్ చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఈ చాలాన్ల కింద జరిమాన విధిస్తూ వాహనాలు విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. కారణం లేని మరణం ఒక రోడ్డు ప్రమాదమే కావున ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించవద్దని,దానితో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో ప్రమాదాలకు కారణం అవుతున్నారన్నారు. రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ డ్రైవింగ్ చేయడం వలన ఒక వ్యక్తి మరణించాడని ఆ మైనర్ తల్లిదండ్రులపైన కేసు నమోదు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేసారు. మైనర్ డ్రైవింగ్ చేస్తూ,మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణంమై ఎదుటి వారి ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తే 10 సంవత్సరాల కఠిన శిక్షలు పడేల చట్టాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులకు,వాహనాల యజమానులు పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని 18 సంవత్సరాలు నిండాని పిల్లలు వాహనాలు ఇవ్వద్దన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వలన ఏదైనా జరగరాని సంఘటనలు జరిగితే కుటుంబం జీవితాంతం బాధపడవలసి వస్తుందని పిల్లలను రోడ్డు ప్రమాదం ద్వారా దూరం చేసుకోవడం కుటుంబ సభ్యులకు తల్లిదండ్రులకు తీరని లోటు అన్నారు. మైనర్ డ్రైవింగ్, రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు గురించి జిల్లాలో అన్ని పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్ కార్యక్రమం ద్వారా విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనల, మైనర్ డ్రైవింగ్ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిఐ లు, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇద్దరు చైన్ స్నాచర్స్ అరెస్టు

మేడ్చల్ : జల్సా లకి అలవాటు పడి ఈజీ మనీ కోసం చైన్ స్నాచింగ్ పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ తరలించిన ఘటన షామీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం పెట్ బషీరాబాద్ ఏసిపి రాములు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈనెల 10వ తేదీన ముడిచింతలపల్లి గ్రామంలో ఓ వృద్ధురాలు మెడలో నుంచి చైన్ స్నాచింగ్ ప్రయత్నించగా విషయం విధితమే. దీన్ని ఛాలెంజ్ గా తీసుకున్న షామీర్పేట్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం దాదాపు 70 సీసీ కెమెరాలును పరిశీలించి బండ్లగూడకి చెందిన అంజి రెడ్డి, బోలి గూడెం చెందిన నరేందర్ రెడ్డి అరెస్ట్ చేశారు .వీరిద్దరూ ఐటీ కంపెనీలో క్యాబ్ డ్రైవర్లుగా పనిచేస్తూ జీవనం కొనసాగించేవారు. ఈజీ మనకోసం అలవాటు పడి నగర శివారలో చైన్ స్నాచింగ్ పాల్పడ్డారు. అందులో భాగంగా ఈ నెల 10 వ తేదీన మూధుచింతల పల్లి చెందిన బసవమ్మ (55) రోడ్డు పైన వడ్లు ఆరబోస్తూన్నా సమయంలో ఇద్దరు వ్యక్తులు స్కూటీ పైన వచ్చి ఆమె మెడలో ఉన్న 4 తులాల పుస్తెల తాడును చోరీకి ప్రయత్నించగా దానికి వృద్ధురాలు ప్రతిఘటించడంతో 5 గ్రాముల బంగారం దోచుకెళ్ళినట్లు తెలిపారు. షామీర్పేట్ పరిధిలో అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.వీరి వద్దనుండి 5.5 గ్రాముల బంగారం, ఒక కారు, ఒక స్కూటీ రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో అంజిరెడ్డి పై మూడు కేసులు ఉన్నట్లు చెప్పారు. ఇంత చాకచక్యంగా మేడ్చల్ సిసిఎస్ షామీర్పేట్ పోలీసులు కలిసి నిందుతులను పట్టుకున్నందుకు వారికి సీపీ చేతుల మీదుగా రివార్డులు అందజేసినట్లు ఏసిపి తెలిపారు. సీసీ కెమెరాలు ప్రతి ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలని ఏసిపి కోరారు. ఈ సమావేశంలో షామీర్పేట్ సిఐ శ్రీనాథ్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గంగాధర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ దల్లినాయుడు, ఎస్సైలు హారిక, తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌కు కాంగ్రెస్ చేసిందేమీ లేదు!

### జరుగుతున్న రగడపై స్పందించిన చంద్రబాబు

అమరావతి : గత రెండు రోజులుగా దేశవ్యాప్తంగా అమిత్‌షా వివాదం కుదిపేస్తోంది. అంబేడ్కర్‌ను ఆయన అవమానించి రాజ్యసభలో మాట్లాడారంటూ దేశవ్యాప్తంగా విపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. ఇందులో ఎన్డీఏ మిత్ర పక్షాలను లాగేందుకు ఇండీ కూటమి పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. కీలకంగా ఉన్న టీడీపీని టార్గెట్ చేశాయి. అందుకే మంత్రివర్గ సమావేశంలో దీనిపై క్లారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. గురువారం మంత్రివర్గ భేటీలో అజెండాలోని అంశాలపై చర్చ పూర్తి అయన తర్వాత అంబేడ్కర్ అంశాన్ని చర్చకు పెట్టారు. అదే టైంలో పార్లమెంట్ అవరణంలో ఘర్షణ జరిగిందని కూడా తెలుసుకున్నారు. దీనిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడికి ఫోన్ చేసిన నారా లోకేష్ ఏం జరిగింతో తెలుసుకున్నారు. అనంతరం మంత్రి వర్గంలోనే చంద్రబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ వివాదంపై స్పందించారని తెలుస్తోంది. ఒక విషయంపై కానీ వివాదంపై స్పందించే ముందు చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని చంద్రబాబు సూచించారు. ఇప్పుడు అంబేడ్కర్ విషయంపై మాట్లాడితే అసలు అంబేడ్కర్ గురించి కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఆయన ఎప్పుడు గెలిచారు... ఓడించింది ఎవరు అనే విషయాలు ప్రస్తావించారు. చనిపోయిన తర్వాత కూడా పార్లమెంట్‌లో విగ్రహం పెట్టింది వీపీ సింగ్ ప్రభుత్వంలోనే అని తెలిపారు. అంబేడ్కర్‌పైపై అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సమర్థిస్తున్నారా లేదా ఖండిస్తున్నారా మీ వైఖరి ఏంటని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఏపీ సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు. అంబేడ్కర్‌పైపై అమిత్‌షా చేసిన వ్యాక్యలు సరికాదని వాటిని ప్రధాని కూడా ఖండించలేదని అన్నారు. అంతే కాకుండా వాటిని సమర్థించేలా కామెంట్స్ చేశారని తెలిపారు. ఇలాంటి అంశంపై చంద్రబాబు లాంటి వ్యక్తి లోతుగా ఆలోచించి స్పందించాలన్నారు కేజ్రీవాల్. చంద్రబాబు ఎలా స్పందిస్తారనే ఆలోచన ప్రజల్లో ఉందని అన్నారు. అందుకే దీనిపై చంద్రబాబు స్పందన ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. అటు ఉద్ధవ్ ఠాక్రే కూడా కూటమి నేతలపై ఒత్తిడి తీసుకొచ్చింది. అమిత్‌షా చేసిన కామెంట్స్ వాళ్లు సమర్థిస్తారా లేకుండా వ్యతిరేకిస్తారా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు, నితీష్ కుమార్ కీలకంగా ఉండటంతో ఈ వివాదంపై స్పందించాలని ఈ ఇద్దరిపై ఒత్తిడి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో పార్టీ నేతలు, మంత్రులు నోరు జారి కొత్త సమస్యలు తీసుకురాకుండఉండేందుకు చంద్రబాబు మాట్లాడారు. పార్టీ, ప్రభుత్వం లైన్ ఏంటో చెప్పేశారు. మీడియా ముందుకు వచ్చినప్పుడు ఎలా మాట్లాడాలో చిన్న క్లాస్ కూడా తీసుకున్నారు.

## పార్శిల్‌లో డెడ్‌బాడీ-షాక్ తిన్న మహిళ

పశ్చిమగోదావరి : ఉండి మండలంలో డెడ్‌బాడీ కలకలం రేపింది. ఆ డెడ్‌బాడి పార్శిల్‌లో రావడంతో అంతా భయపడిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏం జరిగిందో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఉండి మండలం యండగండిలో తులసి అనే మహిళకు ఓ పార్శిల్ వచ్చింది. అందులో ఎలక్ట్రిక్ పరికరాలు ఉన్నాయంటూ పార్శిల్ తెచ్చిన వ్యక్తి చెప్పాడు. ఇచ్చి వెళ్లిపోయాడు. కాసేపు ఆగిన తర్వాత పార్శిల్ ఓపెన్ చేసిన తులసి కాళ్లు చేతులు వణికిపోయాయి. పార్శిల్‌లో కుళ్లిన డెడ్‌బాడీని చూసిన తులసికి ఏం చేయాలో అర్థం కాలేదు. అందర్నీ పిలిచి చూపించింది. వెంటనే పోలీసులకు కూడా సమాచారం ఇచ్చింది. తనకు ఓ పార్శిల్ వచ్చిందని అందులో కుళ్లిన డెడ్‌బాడీ ఉందని వివరించింది.వెంటనే వచ్చిన పోలీసులు ఏం జరిగిందో ఆరా తీశారు. అందర్నీ విచారిస్తున్నారు. పార్శిల్ ఇచ్చిందెవరు అనే విషయాన్ని కూడా ఆరా తీస్తున్నారు. ఇంతకీ ఆ డెడ్‌బాడీ ఎవరిది అనే విషయంపై కూడా దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన క్షత్రియ సేవా సమితీ ఆమెకు విడతల వారీగా సామాగ్రి పంపిస్తున్నారు. మొదటి విడతలో టైల్స్ పంపించారు. ఇప్పుడు రెండో విడత విద్యుత్ సామగ్రి పంపిస్తున్నట్టు సమాచారం ఇచ్చారు. వచ్చిన పార్శిల్‌లో అవే ఉంటాయని ఆమె ఓపెన్ చేసి చూశారు అంతే షాక్ తిన్నారు

# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమి

### రేవంత్ తీరుపై తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల అభ్యంతరం

హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఎన్టీఆర్ 100 అడుగుల విగ్రహ నిర్మాణానికి భూమి కేటాయించడానికి సీఎం రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేయడం వివాదాస్పదమైంది. రెండ్రోజుల క్రితం ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ సభ్యుడు మధు సూదన రాజు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిశారు.ఈ క్రమంలో గత ఏడాదిన్నర కాలంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేపట్టిన కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించి హైదరాబాద్‌లో 100 అడుగుల ఎత్తుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పడానికి, ఎన్టీఆర్ నాలెడ్జి సెంటర్‌ను ఏర్పాటు చేసి దానిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనుకొంటున్నామని ఇందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున స్థలాన్ని కేటాయించి సహకరించాలని కోరారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షులు, నందమూరి తారక రామారావు గారి 100 అడుగుల విగ్రహం ప్రతిష్టాపనకు మరియు ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు కోసంప్రభుత్వ తరఫున స్థలం కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజలందరికీ ఇష్టమైన నటుడు, నాయకుడని.. ఆయన 100 అడుగుల విగ్రహం హైదరాబాద్‌లో ప్రతిష్టించాలన్న ప్రతిపాదనకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నట్టు టీడీపీ నేతలు వెల్లడించారు.

తెలంగాణకు ఇదేమి ఖర్మ!... ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమి కేటాయించాలనే నిర్ణయంపై తెలంగాణ ఉద్యమ జర్నలిస్టులు అభ్యతరం చెబుతున్నారు. తెలంగాణకు ఇదేమి ఖర్మ అంటూ నిరసన చెబుతున్నారు. డెబ్భై ఏండ్ల పైబడ్డ తెలంగాణ ఉద్యమంలో ఇంతకంటే ఘోరమైన సంఘటన మరొకటి లేదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వ చర్యను”తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక” తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించారు. భూమి కేటాయించాలనే ప్రభుత్వం పునరాలోచించకుంటే అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి “తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల వేదిక” పెద్ద ఎత్తున ఉద్యమిస్తదని ప్రకటించింది.

# ఏపీలో జోరు వర్షాల జాడ

హైదరాబాద్ : ఏపీలో జోరు వర్షాల జాడ కనిపిస్తోంది. రానున్న 12 గంటల్లో ఏపీలో మరింతగా జోరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. నైరుతి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం ఇంకా కొనసాగుతుండగా, రానున్న 24 గంటలు ఏపీలోని పలు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.ఇప్పటికే కోస్తాంధ్ర, రాయలసీమ పరిధిలో గల పలు జిల్లాలలో ఉదయం నుండి మోస్తారు వర్షం కురుస్తోంది. అయితే అల్పపీడనం కారణంగా వచ్చే 12 గంటల్లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అలాగే 24 గంటల్లో కాకినాడ, అల్లూరి, మన్యం, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం కూడా ఉంది.అలాగే కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్ఆర్, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రానున్న 12 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటన జారీ చేసింది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మోటార్ల వద్దకు వెళ్లకుండా ఉండడమే సురక్షితమని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వం కూడా ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్స్ ని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి, వరద నీరు చేరేలా ఉంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. అయితే ఇప్పుడిప్పుడే ఏపీకి వర్షం వదిలేలా లేదని చెప్పవచ్చు.

# జనసేన గూటికి ఆమంచి..



ఒంగోలు : చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమెహన్. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఒకానొక టైంలో జిల్లా రాజకీయాలను ఏలిన నేత. కానీ ఇప్పుడు ఆయన రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. చీరాల సెగ్మెంట్లోని వేటపాలెం జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆమంచి.. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా చీరాల నుంచి పోటీ చేసి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 2014లో నవోదయం పార్టీ అభ్యర్థిగా ఆటో గుర్తుపై రెండో సారి పోటీ చేసి చీరాలలో తిరిగి విజయం సాధించారు. తర్వాత టీడీపీలో చేరిన ఆయన.. మంత్రి పదవి ఆశించి.. అది దక్కకపోవడంతో గత ఎన్నికల ముందు వైసీపీ నీడకు చేరారు. 2019 ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేసిన ఆయన టీడీపీ అభ్యర్థి కరణం బలరామకృష్ణమూర్తి చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాలతో కరణం బలరాం వైసీపీలో చేరడంతో.. చీరాలలో కరణం, ఆమంచిల మధ్య ఆధిపత్యపోరు తీవ్ర స్థాయికి చేరింది. వారి విభేదాలకు చెక్ పెట్టడానికి వైసీపీ అధ్యక్షుడు ఆమంచిని పర్చూరు వైసీపీ ఇంచార్జ్ గా పంపారు. అక్కడ గెలవడం కష్టమన్న భావనతో ఆమంచి తిరిగి చీరాలకు వచ్చి అక్కడ నుంచి పోటీ చేయడానికి గ్రౌండ్ వర్క్ కూడా చేశారు. అయితే చీరాల వైసీపీ టికెట్ తనకే దక్కుతుందని ధీమాతో కనిపించిన ఆమంచికి జగన్ షాక్ ఇచ్చారు. చీరాల వైసీపీ టికెట్ ఎమ్మెల్యే బలరాం కుమారుడు కరణం వెంకటేష్‌కు కేటాయించి.. ఆమంచికి పర్చూరు టికెట్ ఆఫర్ చేశారు. అందుకు ఆమంచి తిరస్కరించి.. తన రాజకీయ జీవితం ఇచ్చిన చీరాలకే ఫిక్స్ అవుతానని వైసీపీకి గుడ్ బై చెప్పేశారు. ఇక గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు ఆమంచి కృష్ణమోహన్. తన ప్రత్యర్థిని ఓడిస్తానని చెప్పి మరి చేసి చూపించారు ఆమంచి. చీరాల నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన ఆయన.. నలభై వేల ఓట్లు సాధించారు. వైసీపీ తరపున పోటీ చేసిన కరణం వెంకటేశ్ ఓట్లు చీల్చడంలోనూ.. ఆయన ఓటమి లోనూ.. అమంచి చాలా కీలకపాత్రే పోషించారు. మొత్తానికి తాను అనుకున్న గోల్ అయితే రీచ్ అయిన ఆమంచి.. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్నా అంత సంతృప్తిగా ఫీల్ కావడం లేదట. ఈ వ్యవహారమే ఇప్పుడు పొలిటికల్ గా హాట్ టాపిక్ గా మారింది. ఆమంచి కృష్ణ మోహన్ జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారని చర్చ జరుగుతోంది. ఇప్పటికే జనసేన పార్టీ వర్గాలతో సైతం ఆయన సంప్రదింపులు జరిపినట్లు టాక్ నడుస్తుంది. గతంతో కూడా తాను పవన్ కల్యాణ్ పై చేసిన విమర్శలు.. వైసీపీ అధిష్టానం సూచిస్తేనే మాట్లాడినట్టు పలు వేదికల్లో ఓపెన్ గానే వ్యాఖ్యానించారు. ఎలక్షన్ కి ముందు కూడా ఆయన జనసేనలో చేరతారని జోరుగా ప్రచారం జరిగింది. దాంతో మళ్లీ ఆమంచి జనసేన లో జాయినింగ్ అంటూ వాదనలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆమంచి కృష్ణమోహన్ సోదరుడు ఆమంచి స్వాములు ఇప్పటికే జనసేన పార్టీలో యాక్టీవ్ గా ఉన్నారు. గత ఎన్నికల్లో గిద్దలూరు, చీరాల నుంచి టికెట్ ఆశించి.. కూటమి సమీకరణాల్లో పోటీ చేయకుండా ఉన్నారు స్వాములు. అయితే గత కొన్నేళ్లుగా అన్న తమ్ముళ్ల మధ్య వైరం ఏర్పడింది. వారిద్దరూ మధ్య మాటలు కట్ అయ్యాయని కూయ అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో.. ఇద్దరు రాజీకి వచ్చి ఒకే పార్టీలో కొనసాగుతారా అని చర్చ జరుగుతోంది. ఒకవేళ ఇద్దరు ఒకే పార్టీలో ఉంటే జనసేనకు డబుల్ బొనాంజాగా మారతారని అనుకుంటున్నారు. అలానే ఆమంచి బ్రదర్స్ మళ్లీ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చక్రం తిప్పే ఛాన్స్ కూడా ఉందని డిస్కస్ చేసుకుంటున్నారు. అయితే ఆమంచి కృష్ణమోహన్ కు.. మాజీ మంత్రి బాలినేనికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా వ్యవహారం ఉందని చెబుతున్నారు. బాలినేని శ్రీనివాసరెడ్డి కొద్ది కాలం క్రితమే జనసేన పార్టీలో జాయిన్ అయ్యారు. మరి ఈ పరిస్థితుల్లో కృష్ణమోహన్ జనసేనలోకి రావడాన్ని బాలినేని అడ్డుకుంటారని కూడా టాక్ నడుస్తోంది. సంక్రాతి తర్వాత జనసేనలో చేరేందుకు ఆమంచి భావిస్తున్నారట. ఇటు పవన్ కళ్యాణ్ నుంచి కూడా ప్రస్తుతానికి ఎటువంటి సిగ్నల్స్ రాలేదని.. ఆ చర్చల్లో ఆమంచి కృష్ణ మోహన్ ఉన్నారని ప్రచారం జరుగుతోంది. రాజకీయ భవిష్యత్తు కోసం ఆమంచి కృష్ణ మోహన్ ఏం నిర్ణయం తీసుకోబోతున్నారు ? జనసేనాని ఆయన రాకకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారా ? ఆమంచి చేరికను బాలినేని అడ్డుపడతారా చేరిన తర్వాత అమంచి సోదరులు మళ్లీ కలిసిపోయి ఉమ్మడి జిల్లాలో మళ్లీ చక్రం తిప్పగలరా అని చర్చించుకుంటున్నారు.

# అలా తీగలాగితే... కదులుతున్న రేషన్ డొంక

కాకినాడ : కాకినాడ పోర్టులో రేషన్ బియ్యం తరలిస్తున్నారనే ఆరోపణలతో సముద్రంలోనే నిలిపివేసిన స్టెల్లా ఫిష్ లో తనిఖీలు పూర్తి చేసిన అధికారులు.. అందులో రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో సముద్రంలోకి పరుగులు పెట్టిన జిల్లా యంత్రాంగం.. పవన్ ఎంట్రీతో మరింత అప్రమత్తమైంది. సముద్రంలో లోడింగ్ కోసం వేచియున్న నౌక దగ్గరకు వెళ్లిన అధికారులు.. దానిని పోర్టు నుంచి వెళ్లకుండా అడ్డుకుని తనిఖీలు నిర్వహించారు. దాంతో.. రేషన్ బియ్యం అక్రమ వ్యవహారం నిజమేనని తేలింది. పవన్ కళ్యాణ్ ఆదేశాలతో స్టెల్లా షిప్ ను నిలిపివేసిన అధికారులు.. అందులో 1,320 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తీవ్రంగా పయత్నాలు చేస్తున్న జిల్లా యంత్రాంగం.. క్రమంగా అక్రమార్కులపై కఠినంగా వ్యవహరిస్తోంది. అందులో భాగంగా తొలుత స్టెల్లా నౌకలోని బియ్యం పైనే దృష్టి సారించింది. ఇక్కడ అధికారుల తనిఖీలు, వెల్లడైన అంశాలపై.. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, జేసీ రాహుల్ మీనా, ఎస్పీ ఎస్పీ విక్రంత్ పాటిల్ మీడియాకు వివరాలు అందజేశారు. ప్రజలకు చెందాల్సిన పీడీఎస్ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లు ఆర్జిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక బృందం ఏర్పాటు చేయగా.. అనుమానాస్పద ప్రాంతాల్లో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ సీఎం తనిఖీల సమయంలో స్టెల్లా నౌకలో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. దాంతో.. పూర్తిగా నౌకను పరిశీలించి, తనిఖీలు నిర్వహించేందుకు ఐదు ప్రభుత్వ శాఖలకు చెందిన బృందాలు స్టెల్లా షిప్ లో 12 గంటల పాటు తనిఖీలు నిర్వహించాయి. అందులో.. 4,000 టన్నుల బియ్యాన్ని గుర్తించగా.. వాటి నుంచి శాంపిల్స్ సేకరించి ప్రభుత్వ ల్యాబ్ లకు పంపించారు. అందులో ముందుగా గుర్తించిన 640 టన్నుల రేషన్ బియ్యంతో పాటు అదనంగా మరో 680 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్లు కలెక్టర్ వెల్లడించారు. బియ్యంగా గుర్తించిన సరకును సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ఎగుమతి చేసినట్లు అధికారులు గుర్తించారు. దాంతో.. అసలు వారు ఎక్కడి నుంచి, ఎలా పీడీఎస్ బియ్యాన్ని సేకరిస్తున్నారు అనే విషయమై పోలీసులు, అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ సంస్థను అడ్డుపెట్టుకుని ఎవరెవరు అక్రమ రవాణా చేస్తున్నారు. వస్తున్న డబ్బుల్లో ఎవరి వాటాలు ఎంత అనే విషయాలపైనా ప్రభుత్వ పెద్దలు గట్టిగానే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. కాగా.. స్టెల్లా షిప్ లో దొరికిన పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించిన ఉన్నతాధికారులు.. ఆ బియ్యాన్ని ప్రభుత్వానికి సరెండర్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. సముద్రంలోని షిప్ లో లోడ్ చేసిన బియ్యాన్ని పూర్తిగా తిరిగి ఒడ్డుకు చేర్చి.. ప్రభుత్వ గోదాములకు చేర్చుతామని కలెక్టర్ షన్మోహన్ ప్రకటించారు. ఈ బియ్యంతో పాటు యాంకరేజ్ పోర్ట్ లోని బాజీపో 1000 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యాన్ని లవాన్ కంపెనీ నుంచి ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉంచగా.. వాటిని సీజ్ చేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాలు, స్వయంగా పర్యవేక్షిస్తుండడంతో జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాపై జిల్లా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. రైస్ మిల్లుల దగ్గర నుంచి బియ్యం రవాణా చేసే ఆటోల వరకు అన్నింటిపై పోలీసు నిఘా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విధానాలు, ఉద్దేశాలకు వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠినంగా ఉంటామన్న అధికారులు.. ఎగుమతిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. నిజాయితీగా ఎగుమతులు చేసే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సహకరిస్తాయని ప్రకటించారు.

## కాంగ్రెస్ నేతలతో
# జగన్ మంతనాలు

అనంతపురం : రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరు. ఎప్పుడు.. ఎవరు ఏ పార్టీలోకి జంప్ అవుతారో తెలీదు. కాకపోతే పైచేయి సాధించేందుకు మాత్రం ఎత్తుకు పైఎత్తులు వేస్తుంటారు. ప్రస్తుతం ఏపీలో అదే జరుగు తోంది. ఏపీలో కాంగ్రెస్ కోలుకోకుండా దెబ్బతీసే ప్రయత్నాల్లో జగన్ నిమగ్నమైనట్లు తెలుస్తోంది. రాజకీయాల్లో ఎత్తులు వేయడంలో జగన్‌కు తిరుగులేదని కొందరు చెబుతుంటారు. గడిచిన ఐదేళ్లలో అదే చేశారు. ఫలితం రివర్స్ అయ్యింది. పార్టీ నుంచి నేతలు వలస పోవడంతో ఏం చెయ్యాలో తెలియక దిక్కుతోచని స్థితిలోపడ్డారు మాజీ సీఎం. ప్రత్యర్థులను ఎదుర్కొనే బదులు పార్టీ బలంగా ఉండేలా స్కెచ్ వేశారు. ఐదేళ్ల జగన్ పాలనను చూసిన ఆ పార్టీ నేతలు.. ఫ్యాన్‌కు లైఫ్ లేదనే భావనకు వచ్చారు. ఈక్రమంలో వలస బాట పడుతున్నారు. వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ చాపకింద నీరులా విస్తరిస్తూ వస్తోంది. ఈ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు కొత్త స్కెచ్ వేశారట జగన్. కాంగ్రెస్ నేతలను రప్పించుకుంటే ఆ పార్టీ బలహీనమవుతుందని ఆలోచన చేస్తున్నారట. జగన్ ఆలోచనకు తగ్గట్టుగా అంతా జరుగుతున్నట్లు కనిపిస్తోంది. బుధవారం కర్నూలు లో వైసీపీ ప్రధాన కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి కూతురు వివాహ రిసెప్షన్‌కు వెళ్లారు అధినేత. వైసీపీ నేతలతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వాటిలో కాంగ్రెస్ మాజీ పీసీసీ చీఫ్ శైలజానాథ్ ఉన్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలతో జగన్ మంతనాలు చేసినట్టు ఓ వార్త గుప్పుమంది. దాదాపు అరడజను నేతలతో మాట్లాడారట. మాజీ పీసీసీ చీఫ్ రేపోమాపో వైసీపీలో చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. శైలజానాథ్‌తోపాటు మరికొందరు నేతలున్నట్లు అంతర్గత సమాచారం. జగన్ ఆలోచన కూడా అదే. కాంగ్రెస్ పార్టీ కోలుకుంటే వైసీపీ ఉండదని భావిస్తున్నారట. తన చెల్లెలు షర్మిలను రాజకీయంగా అడ్డుకట్ట వేస్తే తనకు తిరుగు వుండదని మాజీ సీఎం ఆలోచన. అటు కాంగ్రెస్‌ను వీక్ చేసినట్టు ఉంటుంది.. ఇటు వైసీపీ బలంగా ఉన్నట్లు కనిపిస్తోందని ఫ్యాన్ పార్టీ నేతల భావన. వైసీపీ స్కెచ్ నేపథ్యంలో వైఎస్ షర్మిల ఏ విధంగా ముందుకెళ్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వైఎస్ ఫ్యామిలీలో చిచ్చు..

కడప : జగన్‌కు కష్టాలు తీవ్రమయ్యాయి. ఓ వైపు పార్టీ సమస్యలు.. ఇంకోవైపు ఇంటి కష్టాలు. వీటి నుంచి బయటపడలేక నానాఇబ్బందులు పడుతున్నాడు. ఒక్కోసారి ఫ్యామిలీ సభ్యులపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో చేసిన తప్పులపై లోతుగా తవ్వి తీస్తోంది కూటమి సర్కార్. ఆ గండం నుంచి బయటపడేందుకు నేతలు ఎవరిదారి వారు చూసుకుంటున్నారు.. మరికొందరైతే బెంబేలెత్తి పోతున్నారు. దీనిపై పార్టీ కూడా చేతులెత్తేయ డంతో ఏం చెయ్యాలో తెలియక నేతలు, కార్యకర్తలు వలస పోతున్నారు. పార్టీలో ఎలాంటి కష్టాలు వచ్చినా కడప ప్రజలు వైఎస్ఆర్ ఫ్యామిలీని ఆదరిస్తూ వచ్చారు.. వస్తున్నారు కూడా. గడిచిన ఐదేళ్లు వైసీపీ పాలన చూసిన ప్రజలు ఈసారి రూటు మార్చారు. ఏళ్ల తరబడి జరుగుతున్న పనులు, నేతల వ్యవహారశైలి గమనించారు ప్రజలు. రీసెంట్‌గా పులివెందుల లో జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మొత్తం కైవశం చేసుకుంది. సింపుల్‌గా చెప్పాల ంటే వైసీపీ చేతులెత్తేసిందన్నమాట. పట్టుసా ధించేందుకు వైసీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి రంగం లోకి దిగినా ఫలితం లేకపోయింది. చివరకు ఫ్యాన్ పార్టీ చేతులెత్తేసింది. కడప జిల్లాలో మొత్తం 203 నీటి సంఘాలు ఉండగా, అందులో 202 సంఘాలు కూటమి ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఒక్కమాటలో చెప్పాలంటే వైసీపీ కోట బద్దల వుతోంది. నియోజకవర్గంలో 32 సంఘాలను సైకిల్ పార్టీ ఏకగ్రీవంగా దక్కించుకుంది. ఇక అసలు విషయానికొద్దాం. ఈ క్రమంలో కడప కార్పొరేషన్‌పై కన్నేసింది టీడీపీ. దానికి వెనుక నుంచి చకచకా పావులు కదుపుతున్నారు బీటెక్ రవి. వైసీపీకి చెందిన కార్పొరేటర్లతో మంతనాలు సాగించారు. కడప జిల్లాలో వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడంపై జగన్ తీవ్ర అసహనానికి గురైనట్టు తెలుస్తోంది. టీడీపీలో చేరిన 11 మంది కార్పొరేటర్లతోపాటు మరో 11 మంది గోడ దూకేందుకు సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయం జగన్ చెవిలో పడింది. వెంటనే అలర్టయిన అధినేత, అవినాష్‌రెడ్డికి ఫోన్ చేశారని సమాచారం. ఎవరూ పార్టీని వీడకుండా చూడాలని కాసింత గట్టిగానే చెప్పాడట. ఇంత జరుగుతున్నా.. ఇన్నాళ్లు ఏం చేస్తున్నావని మందలించారట. కడప కార్పొరేషన్ టీడీపీ చేతిలోకి వెళ్తే దాని ప్రభావం ఏపీ వ్యాప్తంగా పడుతుందని చెప్పారట జగన్. మిగతా కార్పొరే టర్లు గోడ దూకకుండా చూడాలని అవినాష్‌కు సీరియస్‌గా చెప్పారట. ఈ గండం నుంచి గట్టెందుకు తీవ్రపయత్నాలు చేస్తున్నారు ఎంపీ అవినాష్‌రెడ్డి. తనకున్న పరిచయాలతో నేతలు వెళ్లిపోకుండా చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ విషయాన్ని అవినాష్‌రెడ్డి తన సన్నిహితుల వద్ద చెప్పివాపోయారట. ఐదేళ్లుపాటు అధికార పార్టీతో కష్టాలు పడే బదులు వలస పోవడమే బెటరని అంటున్నారు. కడప కార్పొరేషన్ వైసీపీ చేయి జారిపోతే, ఇక కూటమికి తిరుగుండదని అంచనాలు మొదలయ్యాయి. మొత్తానికి ఈ గండం నుంచి అవినాష్‌రెడ్డి ఎలా గట్టెక్కుతాడో చూడాలి.

# అంగట్లోకి అంగన్వాడీ గుడ్లు

రాజమండ్రి : కోడిగుడ్డు ధరలు బాగా పెరిగాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నా.. వినియోగదారులు మాత్రం ఇబ్బంది పడుతున్నారు. ఈ ధరల ప్రభావం కేవలం వినియోగదారులపైనే కాకుండా.. ప్రభుత్వంపైనా పడుతోంది. అయినా ప్రభుత్వం వెనకడుగు వేయకుండా.. చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు భారీగా డబ్బులు ఖర్చు చేస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆధీనంలోని విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఏలోటూ లేకుండా గుడ్ల సరఫరా చేస్తోంది. అయితే.. ధరలు పెరగడంతో..కక్కుర్తి రాయుళ్లు జూలు విదిల్చారుప్రభుత్వం కాంట్రాక్టర్లకు గుడ్లు సరఫరా చేసినందుకు.. ఆ నెలలోని మార్కెట్ ధరకు అదనంగా 51 పైసలు రవాణా ఛార్జీలు కలిపి చెల్లిస్తుంది. ఇటీవల కోడిగుడ్ల ధర రూ.7 వరకు అయ్యింది. దీంతో గిట్టుబాటు కాక చిన్నసైజు గుడ్లను స్కూళ్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం.. ఒక గుడ్డు 45 గ్రాముల బరువు ఉండాలి. కానీ.. సరఫరా చేస్తున్న గుడ్డు అంత ఉండటం లేదు. రాష్ట్రంలోని 55 వేల 607 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతీరోజూ లక్షలాది గుడ్లను సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం అన్నీ చిన్న సైజు గుడ్లనే సరఫరా చేసేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లేయర్స్ మొదటి దశలో సైజు తక్కువ గుడ్డు పెడుతుంది. వాటిని మార్కెట్‌లో విక్రయించే వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేయరు. దీంతో కాంట్రాక్టర్లు ఆ గుడ్లనే ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీలకు పంపిస్తారు. వాటికి ధర కూడా తక్కువగా ఉంటుంది. ఈ కారణంగామే ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నసైజు గుడ్లు దర్శనమిస్తున్నాయి. కాంట్రాక్టర్లు అలా చేస్తే.. సిబ్బంది మరో అడుగు ముందుకేసి డబ్బులు సంపాదిస్తున్నారు. చాలా అంగన్‌వాటీ కేంద్రాల్లో 50 శాతం కూడా హాజరు ఉండటం లేదు. కానీ.. అందరూ వచ్చినట్లు, గుడ్లు తీసుకున్నట్టు, తిన్నట్టు నమోదు చేసి.. మిగిలిన గుడ్లను మార్కెట్‌లో ఒకటి 6 రూపాయల చొప్పున అమ్మేస్తున్నారు. తక్కువకు రావడంతో చిన్న చిన్న వ్యాపారులు వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఒక్కటి రెండూ సెంటర్లలో ఇలా చేస్తున్నారంటే ఏమో అనుకోవచ్చు. కానీ.. వేలాది అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఈ దందా చూడటానికి చిన్నగానే కనిపిస్తున్నా.. లెక్కలు వేస్తే అసలు విషయం తెలుస్తుంది. ఉదాహరణకు.. రాష్ట్రంలో 55 వేలకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి సగటున రోజుకు 50 గుడ్లు వచ్చాయి అనుకున్నా.. 27 లక్షల 50 వేల అవుతాయి. వాటిల్లో 60 శాతానికి పైగానే లబ్ధిదారులకు ఇచ్చినా.. ఇంకా 10 లక్షల గుడ్లు మిగులుతాయి. అలా ఒక్కో గుడ్డును 6 రూపాయలకు విక్రయిస్తే.. రూ.60 లక్షలు అవుతుంది.

# డేంజర్ జోన్ లో ఆరుగురు మంత్రులు

విజయవాడ : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా శ్రమిస్తున్న నేత. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. తాను పరుగులు పెట్టడంతో పాటు ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా పరుగులు పెట్టిస్తున్నారు. అలాగే తప్పు చేసిన నాయకుల పట్ల కూడా సీఎం సీరియస్‌గా ఉంటున్నారు. స్వంత పార్టీ నేతలను కూడా క్రమశిక్షణలో ఉండాలని.. ఎలాంటి తప్పు చేయకూడదని గట్టిగానే చెబుతున్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యం అని నేతలకు నిర్దేశిస్తున్నారు. తప్పు చేస్తే ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు కూడా. తన మన అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలకు కూడా వార్నింగ్‌లు ఇస్తున్నారు సీఎం. నేతల తీరుతో పార్టీకి ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా సీఎం అలర్ట్‌గా ఉంటూ.. పార్టీ ఎమ్మెల్యేలకు, నేతలకు స్వీట్ వార్నింగ్స్ ఇస్తూనే.. హద్దులు దాటుతున్న వారిని ప్రత్యేకంగా పిలిపించి మరీ హెచ్చరిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బినెట్ భేటీలో మంత్రుల శాఖల్లో ఫైళ్లు పెండింగ్ లో ఉండటంపై సీఎం చంద్రబాబు స్పందించారు. మంత్రులు టెక్నాలజీని సరిగ్గా వాడుకోకపోవడాన్ని కూడా చంద్రబాబు తప్పుబట్టారు. మంత్రి దగ్గరికి ఏదైనా ఫైలు వచ్చి ఎంత సేపు పెండింగ్‌లో ఉంటోందో తనకు తెలుసని చంద్రబాబు తెలిపారు. మంత్రుల పనితీరును తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సీఎం వారికి తెలిపారు. జిల్లాలకు వెళ్లని ఇన్ ఛార్జ్ మంత్రుల తీరుపైనా చంద్రబాబు సీరియస్ అయ్యారు. రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకొస్తున్న పాలసీల్ని మంత్రులు లోతుగా పరిశీలించకపోవడంపైనా చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిలో కొంతమంది మంత్రులు అస్సలు వాటిపై అధ్యయనం చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపైనా తన మంత్రుల పనితీరుపై తన పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. మరోవైపు ఇప్పటికే ఆరునెలల పాలనలో పలు కేబినెట్ సమావేశాల్లో మంత్రులు తమ శాఖలపై పట్టు సాధించాలని చంద్రబాబు సూచిస్తూనే ఉన్నారు. అయినా కొందరు మంత్రుల వైఖరిలో మార్పు రావడం లేదని చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రుల పనితీరుపైగా పరిశీలన చేసిన సీఎం చంద్రబాబు నాయుడు.. ఆరుగురు మంత్రుల పనితీరు ఏ మాత్రం బాగోలేదని వ్యాఖ్యానించారు. వారి పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పనితీరు మార్చుకోలేదని ఆగ్రహించారంట. ఇకపైన కూడా మార్పు రాదని నాకు బాగా తెలుసు అని చంద్రబాబు గట్టిగానే క్లాస్ పీకారంటున్నారు. ఇదే లాస్ట్ అండ్ ఫైనల్ ఛాన్స్, ఇక చెప్పడం, వార్నింగ్‌లు ఇవ్వడం ఏమీ ఉండదు పదవి నుంచి తొలగించడమే అంటూ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ ఆరుగురు మంత్రులను మంత్రివర్గం నుంచి తొలగించడం పక్కా అని దాదాపు తేలిపోయింది. ఈ కీలక పరిణామం వచ్చే ఏడాది, అందులోనూ సంక్రాంతి తర్వాత ఉండే అవకాశాలే మెండుగానే కనిపిస్తున్నాయి. రాయలసీమ నుంచి ఇద్దరు, ఉత్తరాంధ్ర నుంచి ఒకరు, కోస్తా నుంచి ముగ్గురి విషయంలో మొత్తం ఆరుగురు మంత్రులపై గుర్రుగా చంద్రబాబు ఉన్నారు. వీరికి ఇచ్చిన శాఖల పరంగా న్యాయం చేయలేకపోవడం, కనీసం శాఖలపై పట్టు పెంచుకోవడానికి కూడా సాహసం చేయకపోవడం, ఇక లేనిపోని విషయాల్లో ఆ మంత్రులు, వారి కుటుంబ సభ్యులు తలదూర్చి వార్తల్లో నిలవడం ఇలా ఒకట్రెండు కాదు లెక్కలేనన్ని ఆరోపణలు వారిపై ఉన్నాయి. సంక్రాంతి తర్వాత వారందర్నీ పక్కనెట్టినా, లేదంటే ఇంకో ఆర్నెళ్లు సమయం ఇచ్చినా ఇవ్వొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి.

# మూడు ముక్కలాటకు చెక్

విజయవాడ : ఏపీలో ఈ ఏడాది ప్రారంభంలో రాజధానిపై విస్తృతమైన చర్చ జరుగుతోంది. మూడు రాజధానులకు కట్టుబడిన వైసీపీ ఓవైపు విశాఖలో సీఎం జగన్ క్యాంప్ ఆఫీస్ ప్రారంభించి ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమైంది. అదే సమయంలో విపక్షంలో ఉన్న కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ తాము అమరావతి రాజధానికే మద్దతిస్తున్నట్లు తేల్చిచెప్పేశాయి. ఈ తరుణంలో ఏపీ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు రాజధానికి కీలకంగా మారింది. అప్పటికే వైసీపీ మూడు రాజధానుల ప్రక్రియ ప్రారంభించి దానిపై కోర్టుల్లో కేసులు ఎదుర్కొంటోంది. మరోవైపు అమరావతి రాజధానికి ప్రజల మద్దతు సంపాదించేందుకు కూటమి పార్టీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. కానీ అసెంబ్లీ ఎన్నికల నాటికి మాత్రం అన్ని పార్టీలు రాజధాని చర్చను పక్కనబెట్టేశాయి. ఎన్నికల్లో మూడు రాజధానులకు మద్దతు అని చెప్తే అమరావతిలో ఓట్లు రావని వైసీపీ.. అలాగే అమరావతి రాజధాని అని చెప్తే రాయలసీమ, ఉత్తరాంధ్రలో వ్యతిరేకత తప్పదని కూటమి పార్టీలు భయపడ్డాయి. అయితే ఎన్నికల్లో మాత్రం ప్రజలు తాము ఇచ్చే తీర్పు ఆధారంగా రాజదాని నిర్ణయం అవుతుందని భావించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పార్టీలు ఎవరూ ఊహించని స్థాయిలో భారీ మెజార్టీతో అధికారంలోకి రావడంతో వైసీపీ మూడు ముక్కలాటకు చెక్ పడినట్లయింది. అదే సమయంలో అమరావతికి తిరిగి ప్రాణం వచ్చినట్లయింది. గత ఐదేళ్లుగా వైసీపీ మూడు రాజధానుల పేరుతో ఆడిన ఆటతో అమరావతి తీవ్రంగా నష్టపోయింది. ముఖ్యంగా అక్కడ ప్రభుత్వాన్నినమ్మి ఏకంగా 36 వేల ఎకరాల భూములు స్వచ్ఛందంగా ఇచ్చిన రైతులు ఐదేళ్ల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చివరికి వారికి సకాలంలో ఇస్తామన్న కౌలు రావడం కూడా కష్టమైపోయింది.

ప్రతీ ఏటా హైకోర్టుకు వెళ్లి మరీ కౌలు తెచ్చుకునే వారురాష్ట్రంలో అధికార మార్పుకు ప్రజలు ఇచ్చిన ఓటు రాజధానిపైనా స్పష్టత ఇచ్చేసింది. ఐదేళ్ల పాటు ఏపీ రాజధాని అంటే ఏదనే ప్రశ్నకు జవాబు కూడా దొరికింది. ఇక కోర్టుల్లో గతంలో రైతులు దాఖలు చేసిన కేసులు వెనక్కి తీసుకోవడమే మిగిలుంది. అటు కూటమి సర్కార్ కూడా అమరావతిలో వేగంగా అడుగులేస్తోంది. వచ్చే జనవరి నుంచి అమరావతిలో పనులు పునఃప్రారంభం కాబోతున్నాయి. అలా ఒక్క ఏడాదిలో రాజధానిపై ఫుల్ క్లారిటీ వచ్చేసింది.

# తిరుమల విజన్–2047 ప్రతిపాదనలకు ఆహ్వానం

తిరుమల : తిరుమల విజన్–2047 కోసం టీటీడీ ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. "స్వర్ణాంధ్ర విజన్ - 2047కి అనుగుణంగా తిరుమలలో కూడా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం లక్ష్యాలను నిర్ణయించారు. "స్వర్ణాంధ్ర విజన్- 2047కి అనుగుణంగా తిరుమలలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం టీటీడీ ప్రతిపాదనలను ఆహ్వానించింది. పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించే వ్యూహాత్మక ప్రణాళికతో "తిరుమల విజన్ - 2047" ను టీటీడీ ప్రారంభించింది. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రఖ్యాత ఏజెన్సీలను ఆహ్వానిస్తూ ప్రతిపాదనల కోసం ఆర్ఎఫ్‌పీని విడుదల చేసింది. ఇటీవల తిరుమలలో జరిగిన సమావేశంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, పర్యావరణ నిర్వహణ, వారసత్వ పరిరక్షణపై దృష్టి సారించాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసింది. ఇదే కాకుండా "స్వర్ణాంధ్ర విజన్ -2047కి అనుగుణంగా తిరుమలలో కూడా అభివృద్ధి పనులు చేసేందుకు టీటీడీ సిద్ధమైంది.

విజన్ డాక్యుమెంట్–2047 లక్ష్యాలు:

ఆధునిక పట్టణ ప్రణాళిక నిబంధనలను అనుసరిస్తూ తిరుమల పవిత్రతను పెంపొందించేందుకు శాశ్వతమైన వ్యూహాలను అమలు చేయడం. ఉత్తమమైన ప్రణాళికలు, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ బాధ్యతలకు ప్రాధాన్యత ఇవ్వడం.

ప్రపంచవ్యాప్తంగా తిరుమలను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు టీటీడీ ప్రయత్నిస్తుంది.

తిరుమల విజన్ 2047 లక్ష్యాలను చేరుకునేందుకు, పట్టణ ప్రణాళిక, ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, వారసత్వ పరిరక్షణ, పర్యావరణ నిర్వహణపై ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఏజెన్సీల నుండి ప్రతిపాదనలను టీటీడీ ఆహ్వానిస్తోంది.

తిరుమల అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయడం.

ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జోనల్ అభివృద్ధి ప్రణాళికను సవరించడం.

తిరుమలలోని పవిత్రతను కాపాడుతూ భక్తుల సౌకర్యాలను మెరుగుపరచడానికి భవిష్య వ్యూహాలను రూపొందించడం.

ప్రాముఖ్యత కలిగిన మౌలిక సదుపాయాలపై కార్యాచరణ ప్రణాళికలను తయారు చేయడం.

ప్రతిపాదనలకు గడువు – ప్రణాళిక లక్ష్యాలు

మూడు వారాల్లోగా ఆసక్తి గల ఏజెన్సీలు తమ ప్రతిపాదనలను సమర్పించాలని టీటీడీ కోరింది. ఇలాంటి భారీస్థాయి పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఏజెన్సీలకు ముందస్తు అనుభవం తప్పనిసరి అని స్పష్టం చేసింది. వారసత్వ పరిరక్షణ, పర్యావరణ నిర్వహణ, ఆధునిక పట్టణ ప్రణాళికలను మిళితం చేసే ఒక బృహత్తర భవిష్య ప్రణాళికలను రూపొందించడం లక్ష్యాలుగా నిర్ణయించారు. అంతేకాకుండా తిరుమలలో రాబోవు తరాల్లో మరింతగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక పవిత్రతను కాపాడటమే ఈ ప్రణాళిక లక్ష్యమని టీటీడీ పేర్కొంది.

# సినిమా



## మహానటి బ్రేక్... అసలు విషయం ఇదేనా?

మహానటి ఫేం కీర్తి సురేష్ తాజాగా తన చిరకాల స్నేహితుడు, ప్రియుడు ఆంటోనిని వివాహం చేసుకుని కొత్త జీవితాన్ని మొదలు పెట్టింది. వీరిద్దరి మధ్య ప్రేమ 15 ఏళ్లుగా కొనసాగుతుందనే వార్తలు వస్తున్నాయి. కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలో కీర్తి సురేష్ పెళ్లి చేసుకోవడంను కొందరు తప్పుబడుతూ ఉంటే, కొందరు మాత్రం గత కొంత కాలంగా హీరోయిన్స్ పెళ్లి చేసుకున్న తర్వాత సినిమాలు చేస్తూ బిజీగా ఉంటున్నారు. కనుక పెళ్లి అనేది కీర్తి సురేష్‌కి అడ్డు కాకపోవచ్చు అన్నారు. కీర్తి సురేష్ సైతం పెళ్లి ఫిక్స్ అయిన తర్వాత బాలీవుడ్‌లో సినిమాను చేయడం మాత్రమే కాకుండా, అందులో మునుపెన్నడూ లేనంతగా స్కిన్ షో చేసింది. ముందు ముందు ఆమె నుంచి మరింతగా అందాల ఆరబోత చూడటం ఖాయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో కీర్తి సురేష్ కొత్త సినిమాల గురించి చర్చ జరుగుతోంది. ఇటీవలే బేబీ జాన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఆ సినిమా ఫలితంతో సంబంధం లేకుండా బాలీవుడ్ నుంచి ఈమెకు వరుసగా ఆఫర్లు వస్తున్నాయట. కానీ ప్రస్తుతానికి వచ్చిన ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తూ వస్తుంది. పెళ్లి తర్వాత వరుసగా సినిమాలు చేయాలి అనుకున్న కీర్తి సురేష్ కాస్త గ్యాప్ ఇచ్చి ఆ సినిమాలను మొదలు పెట్టాలని భావిస్తుందట. అందుకే వచ్చిన ఆఫర్లను ఆమె సున్నితంగా వెనక్కి పంపించిందని తెలుస్తోంది కీర్తి సురేష్‌కి ప్రస్తుతం ఉన్న క్రేజ్ నేపథ్యంలో బాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లో ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి. అయినా పెళ్లి తర్వాత మినిమం గ్యాప్ తీసుకోవాలనే ఉద్దేశ్యంతో కొత్త ప్రాజెక్ట్‌లకు ఆమె నో చెబుతోంది. ప్రస్తుతం ఆమె కమిట్ అయిన రెండు మూడు సినిమాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఆ సినిమాలు వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆ సినిమాలు పూర్తి అయిన తర్వాత కీర్తి సురేష్ కొత్త ప్రాజెక్ట్‌లను చేపట్టే అవకాశాలు ఉన్నాయని కోలీవుడ్ వర్గాల వారు అంటున్నారు. మొత్తానికి కీర్తి సురేష్ సినిమాల గురించి తమిళ్ మీడియాలో కుప్పలు తెప్పలుగా కథనాలు వస్తున్నాయి.




## బాలీవుడ్ స్టార్ సోహైల్ ఫస్ట్ టాలీవుడ్ మూవీ ఫస్ట్ లుక్!

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ యాక్షన్ సినిమా షూటింగ్ కార్యక్రమాలు చివరి దశకు వచ్చాయి. వచ్చే ఏడాదిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నట్లు ఇటీవల నిర్మాత కళ్యాణ్ రామ్ ప్రకటించారు. నందమూరి కళ్యాణ్ రామ్ కెరీర్ లో 21వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాలో పలువురు ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ఈ సినిమాలో కళ్యాణ్ రామ్‌కి జోడీగా సాయి మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ అమ్మడు టాలీవుడ్‌లో గతంలో నటించినా పెద్దగా గుర్తింపు దక్కించుకోలేదు. కానీ ఈ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు దక్కే అవకాశాలు ఉన్నాయని మేకర్స్ అంటున్నారు. కళ్యాణ్ రామ్‌తో పాటు ఈ సినిమాలో లేడీ అమితాబ్ బచ్చన్‌గా పేరున్న సీనియర్ నటి విజయశాంతి కీలక పాత్రలో కనిపించబోతున్నారు. అంతే కాకుండా బాలీవుడ్ స్టార్ నటుడు సోహైల్ ఖాన్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు సోషల్ మీడియా ద్వారా ఫోటోలను షేర్ చేశారు. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కళ్యాణ్ రామ్ ను ఢీ కొట్టే విలన్ పాత్రలో సోహైల్ ఖాన్ కనిపించబోతున్నాడని తెలుస్తోంది. సినిమాలోని ఆయన లుక్‌ను బర్త్ డే సందర్భంగా విడుదల చేసి ప్రత్యేకంగా యూనిట్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సినిమా షూటింగ్ ఇటీవల హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్వహించారు. ఆ షెడ్యూల్‌లో కళ్యాణ్ రామ్‌తో పాటు సోహైల్ ఖాన్‌లు పాల్గొన్నారు. సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి అయ్యిందని, విజయశాంతిపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు, హీరో, హీరోయిన్‌లపై సాంగ్స్, కొన్ని యాక్షన్ సీన్స్ షూట్ చేస్తే సినిమా షూటింగ్ పూర్తి అయినట్లే అంటూ యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

## 'ఆదిపురుష్' తర్వాత రూటు మార్చాడు!

లోకమాన్య : ఏక్ యుగ్ పురుష్ సినిమాతో దర్శకుడిగా మారిన ఓం రౌత్ విమర్శకుల ప్రశంసలు దక్కించుకున్నాడు. ఆ సినిమా వచ్చిన ఐదేళ్ల తర్వాత అంటే 2020లో తన్హాజీ సినిమాతో మరోసారి దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అజయ్ దేవగన్ ముఖ్య పాత్రలో నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. దాంతో వెంటనే ప్రభాస్ తో 'ఆదిపురుష్' సినిమాను మొదలు పెట్టాడు. తన్హాజీ సినిమా సూపర్ హిట్ కావడంతో ఆదిపురుష్ సినిమాతో కచ్చితంగా ఓం రౌత్ అలరిస్తాడని అంతా భావించారు. కానీ ఆయన ఆ సినిమాతో బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా



నిరాశ పరిచాడు. రామాయణం అని చెప్పి మరేదో తీశాడు అంటూ ట్రోల్స్ వచ్చాయి. ఓం రౌత్ దర్శకత్వంలో వచ్చిన ఆదిపురుష్ సినిమా ఓటీటీ ద్వారా వచ్చిన తర్వాత మరింతగా విమర్శలు వచ్చాయి. ఆ సినిమాను తీసినందుకు, చేసినందుకు ప్రభాస్‌ను జనాలు ఓ రేంజ్‌లో విమర్శించారు. అయినా ఓం రౌత్ వెంటనే మరో సినిమాను చేసేందుకు సిద్ధం అవుతున్నాడు అనే వార్తలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు దర్శకుడిగా ఓం రౌత్ మరే సినిమాను మొదలు పెట్టలేదు. ప్రభాస్ మరో అవకాశం ఇచ్చాడు అనే వార్తలు వినిపించాయి. కానీ ఆ వార్తల్లో నిజం లేదని తెలుస్తోంది. ఎట్టకేలకు ఓం రౌత్ తన తదుపరి ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. ఈసారి దర్శకుడిగా కాకుండా నిర్మాతగా ఆయన ప్రాజెక్ట్ రాబోతుంది. అది కూడా సినిమా కాకుండా ఒక వెబ్ సిరీస్‌గా ఆయన నుంచి రాబోతుంది. ప్రముఖ నటుడు, ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ నటుడు మనోజ్ బాజ్‌పేయి ముఖ్య పాత్రలో ఇన్స్‌పెక్టర్ జెండే అనే పేరుతో వెబ్ సిరీస్‌ను రూపొందించబోతున్నారు. ఆ వెబ్ సిరీస్‌కి చిన్మయి మాండ్లేకర్ దర్శకత్వం వహించబోతున్నారు. త్వరలో షూటింగ్ ప్రారంభం కాబోతున్న ఈ వెబ్ సిరీస్‌ను వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి అంటూ బాలీవుడ్ మీడియా వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

## బాబాయ్- అబ్బాయ్ మూమెంట్.. ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ!

బాబాయ్.. అబ్బాయ్.. అదేనండీ పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ బాండింగ్ గురించి అందరికీ తెలిసిందే. చిన్నప్పటి నుంచి చరణ్ ను పవన్ బాగా చూసుకుంటారు! మెగాస్టార్ చిరంజీవి తన మూవీ షూటింగ్స్ తో బిజీగా ఉండడం వల్ల.. చరణ్ ఎక్కువగా పవన్ దగ్గరే పెరిగారు. ఈ విషయాన్ని మెగా ఫ్యామిలీ మెంబర్స్ చాలా సార్లు చెప్పారు. చరణ్ కూడా బాబాయ్ పై ఉన్న తన ఇష్టాన్ని అనేక సార్లు వివిధ సందర్భాల్లో బహిరంగంగా ప్రదర్శించారు. అయితే ఇప్పుడు బాబాయ్.. అబ్బాయ్ కోసం సందడి చేయనున్నారు. రామ్ చరణ్ అప్ కమింగ్ మూవీ గేమ్ ఛేంజర్ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ గా రానున్నట్లు తెలుస్తోంది. దీంతో మెగా అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్.. జనవరి 10వ తేదీన రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మేకర్స్ జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు.



పుష్ప-2తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సుకుమార్ చీఫ్ గెస్ట్ గా హాజరుకానున్నారు. అయితే రీసెంట్ గా లక్నోలో టీజర్ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించిన మేకర్స్.. చెన్నైలో త్వరలో సందడి చేయనున్నారు. జనవరి మొదటి వారంలో తెలుగు స్టేట్స్ లో ఓ ఈవెంట్ ను నిర్వహిస్తామని ఇప్పటికే గేమ్ ఛేంజర్ నిర్మాత దిల్ రాజు తెలిపారు. ఇప్పుడు ఆ కార్యక్రమానికి సంబంధించిన వివరాలు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. జనవరి 4వ తేదీన ఆ వేడుక గ్రాండ్ గా జరగనున్నట్లు సమాచారం. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్.. ముఖ్య అతిథిగా హాజరు కానున్నారట. ఇప్పుడు ఈ విషయం వైరల్ గా మారగా.. బాబాయ్ అబ్బాయ్ మూమెంట్ కోసం వెయిటింగ్ అంటున్నారు నెటిజన్లు. ఇక గేమ్ ఛేంజర్ విషయానికొస్తే.. చరణ్ డ్యూయల్ రోల్ పోషించారు. రాజకీయ నాయకుడిగా, ఐఏఎస్ గా కనిపించనున్నారు. కియారా అద్వానీ హీరోయిన్ గా నటించారు. శ్రీకాంత్, నవీన్ చంద్ర, అంజలి, ఎస్ జే సూర్య తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. మరి సంక్రాంతి కానుకగా థియేటర్లలో సందడి చేయనున్న గేమ్ ఛేంజర్ చిత్రం ఎలాంటి విజయం సాధిస్తుందో వేచి చూడాలి.

## అలాంటి వార్తల నడుమ..అభి-ఐష్ చేతిలో చెయ్యేసి..

ఐశ్వర్య రాయ్ – అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ ముంబై మీడియా ప్రచారం చేస్తోంది. ఇది వారి అభిమానుల్లో తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. ఈ తరహా ప్రచారంపై అమితాబ్ – అభిషేక్ సహించలేని స్థితిలో అసహనం వ్యక్తం చేసారు. తప్పుడు కథనాలతో మీడియా వ్యాపారం చేస్తోందని అమితాబ్ సూటిగా విమర్శించారు. అయినా వార్తలు ఆగడం లేదు. నెటిజనుల ఊహాగానాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. అయితే ఇటీవల ఓ వేడుకలో అభిషేక్ – ఐశ్వర్య జంటగా కనిపించి అన్నిటికీ సమాధానమిచ్చారు.



చూపరులందరికీ ఒక స్పష్టత వచ్చేసింది. ఈ జంట నడుమ ఏం జరిగినా కానీ, మీడియా అతిగా ప్రవర్తిస్తోందని చాలామంది భావించారు. ఇప్పుడు కుమార్తె ఆరాధ్య కోసం మరోసారి ఐశ్వర్యారాయ్– అభిషేక్ జంటగా కనిపించారు. దీంతో మరింత స్పష్టత వచ్చింది. జంటగా కలిసి రావడం సన్నిహితంగా మెలగడంతో బ్రేకప్ పుకార్లకు చెక్ పెట్టినట్టయింది. గురువారం సాయంత్రం ధీరూభాయ్ అంబానీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవానికి ఐశ్వర్య తన భర్త అభిషేక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ వేడుకలో అభిషేక్ తన సతీమణికి అంగరక్షకుడిగా కనిపించారు. పెద్దవాడైన అమితాబ్ విషయంలోను అభి-ఐష్ జంట ఎంతో కేర్ తీసుకోవడం కనిపించింది. కుమార్తె ఆరాధ్య ఉన్న వేదిక వైపు వెళ్లేందుకు సిద్ధమైన ఐశ్వర్యను అనుసరించిన అభిషేక్ వీపుపై మెల్లగా తడుతూ భరోసా ఇచ్చే అరుదైన క్షణం ఓ వీడియోలో కనిపిస్తోంది. అలాగే అమితాబ్‌తో కలిసి నడిచి వెళుతూ అభి-ఐష్ చిరునవ్వులతో కనిపించారు. ఈ వీడియో వేగంగా అభిమానుల్లో వైరల్ అయింది. ఈ జంటను ఇలా చూసి అభిమానులు చాలా సంతోషిస్తున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో అనంత్ అంబానీ– రాధిక మర్చంట్ వివాహ వేడుకల్లో వేర్వేరుగా కనిపించిన తర్వాత ఐశ్వర్యారాయ్ విడాకుల గురించి ప్రచారం మొదలైంది. ఆ తర్వాత అభిషేక్ చర్యలు సందేహాలు రేకెత్తించాయి. కానీ ఇప్పుడు పరిస్థితి వేరుగా ఉంది. అయితే స్కూల్ ఈవెంట్ కోసం ఐశ్వర్యారాయ్ సపరేట్ కార్ లో వచ్చి, అమితాబ్, అభిషేక్ ని కలిసిన విజువల్స్ కొంత ఆశ్చర్యపరిచాయి. ఈవెంట్లో చేయి చేయి కలిపి కనిపించినా కానీ భార్య, భర్త ఇద్దరూ విడివిడిగా వేర్వేరు కార్లలో వెన్యూ వద్దకు రావడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

## భారతీయుడు 2 రిజల్ట్..తనను సమర్థించుకున్న శంకర్

కమల్ హాసన్ కథానాయకుడిగా శంకర్ తెరకెక్కించిన భారతీయుడు 1996లో విడుదలై ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. ఈ సినిమాకి రెండు సీక్వెల్స్ ప్లాన్ చేసారు శంకర్. భారతీయుడు 2 (ఇండియన్ 2) ఈ ఏడాది విడుదలై పెద్ద ఫ్లాపైంది. కానీ ఈ పరాజయంతో పని లేకుండా 'భారతీయుడు 3'ని విడుదలకు సిద్ధం చేస్తున్నారు శంకర్. ఎట్టకేలకు తమిళ మ్యాగజైన్ వికటన్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో భారతీయుడు 2 పరాజయంపై శంకర్ తొలిసారి నోరు విప్పారు. ఈ పరాజయాన్ని తాను అస్సలు ఊహించలేదని అన్నారు. ఇల్లు శుభ్రంగా ఉంటే దేశం శుభ్రంగా ఉంటుంది! అనేది అద్భుతమైన ఆలోచన. నేటి పరిస్థితులకు అవసరమైనది. . ఇది ఆచరణాత్మకంగా ఎలా అమలవుతుందనేది చిక్కు ప్రశ్న.. మంచి ఆలోచనతో సినిమా తీశాను..అని కూడా శంకర్ తనను తాను సమర్థించుకున్నారు. అంతేకాదు.. ఈ సినిమా చూశాక హైదరాబాద్ లో జరిగిన రెండు వేర్వేరు సంఘటనల్లో దాని ప్రభావం ఎలా పడిందో కూడా శంకర్ వివరించారు. తెలంగాణలోని



ఓ కార్పొరేషన్‌కు చెందిన మహిళా ఇంజనీర్ భర్త లంచం వసూలు చేస్తూ కెమెరాకు చిక్కారు.. అది భారతీయుడు 2 ప్రభావం అని శంకర్ అన్నారు. రెండు రోజుల క్రితం ఓ ఆటో డ్రైవర్ దొంగతనం చేశాడు. అతడి ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుండి బంగారు గొలుసు లాక్కున్నాడు. అతడిని కుటుంబ సభ్యుడే పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించాడు. నేను ఈ రకమైన వార్తా కథనాలు చూసినప్పుడు సంతోషించి వదిలేయలేదు.. నేను ఇంకా నా పనిపై దృష్టి పెడుతున్నాను.. అని అన్నారు. భారతీయుడు 2 ఈ ఏడాది జూన్ లో విడుదలై ఫ్లాపైంది. ముఖ్యంగా విమర్శకులు ప్రేక్షకుల ప్రతికూల సమీక్షలు వచ్చాయి. రెండో భాగం పరాజయంతో సంబంధం లేకుండా ఇప్పుడు మూడో భాగం (భారతీయుడు 3)ని విడుదల చేస్తామని కూడా శంకర్ తెలిపారు.



## స్టన్నింగ్ లుక్ లో వైష్ణవి..

వైష్ణవి అంధలే.. ఎవరీ బ్యూటీ అనుకుంటున్నారా? సోషల్ మీడియా యూజర్స్ లో అనేక మందికి ఆమె తెలిసే ఉంటుంది. ఎప్పటికప్పుడు గ్లామరస్ ఫిక్స్ తో సందడి చేసి ఆ మరాఠీ ముద్దుగుమ్మ.. స్టార్ హీరోయిన్ అవ్వాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు క్లియర్ గా తెలుస్తోంది. వచ్చిన అవకాశాలను అందుకుంటూ సత్తా చాటుతోంది వైష్ణవి. అయితే ముంబైకు చెందిన మల్టీ టాలెంటెడ్ వైష్ణవి.. మోడలింగ్ తో కెరీర్ ను స్టార్ట్ చేసి మంచి గుర్తింపు సంపాదించుకుంది. ఆ తర్వాత ఓవైపు షార్ట్ ఫిల్మ్స్.. మరోవైపు కమర్షియల్ యాడ్స్ లో కనిపించి మెప్పించింది. 2019లో మిస్ ఇండియా మహారాష్ట్ర కిరీటాన్ని గెలుచుకున్న ఆమె.. ఒక్కసారిగా అందరిని దృష్టిని ఆకర్షించింది. ఫెమినా మిస్ ఇండియా పోటీలో వెస్ట్ జోన్‌కు ప్రాతినిధ్యం వహించిన వైష్ణవి.. రెండు అవార్డులను గెలుచుకోవడం విశేషం. మిస్ ఫోటో జెనిక్, మిస్ బ్యూటిఫుల్ హెయిర్ క్యాటగిరీస్ లో సత్తా చాటిన ఆమె.. దేశంలోని టాప్ 12 మోడల్స్ లో ఒకరు. అదే సమయంలో లాయర్ గా పట్టా అందుకుని అన్ని రంగాల్లో తోపేనని ప్రూవ్ చేసుకుంది! అయితే వైష్ణవి అటు యాక్టింగ్ పై ఫోకస్ పెడుతూనే.. ఇటు సోషల్ మీడియాలో బిజీగా ఉంటోంది. మంచి టాలెంట్ ఉన్న ఫోటో అండ్ వీడియోగ్రాఫర్ అయిన ఆమె.. యూట్యూబ్ ఛానెల్ ను మెయింటైన్ చేస్తోంది. అలా లాయర్, యాక్టర్, యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అయిన వైష్ణవి మల్టీ టాలెంటెడ్. అదే సమయంలో నెట్టింట అందాలను ఆరబోస్తూ ట్రెండ్ లో ఉంటోంది వైష్ణవి. కొత్త కొత్త పిక్స్ ను షేర్ చేస్తూ మాయ చేసే ఆమె.. డైలీ తన సోషల్ మీడియా వాల్ చెక్ చేయాలనే సందడి చేస్తుంటోంది. ట్రెండీ ఔట్ ఫిట్స్ కు కేరాఫ్ అడ్రెస్ ఆమె! తాజాగా స్పెషల్ డ్రెస్ లో దిగిన కొత్త పిక్స్ షేర్ చేసి.. క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది అమ్మడు. వైట్ కలర్ సూట్ వేసుకున్న ముద్దుగుమ్మ.. తన స్కిన్ షోతో మైండ్ బ్లాక్ చేసిందనే చెప్పాలి. ఒక్క పిక్ లో వేరే లెవెల్ పోజ్ ఇచ్చి ఫ్లాట్ చేస్తోంది.



## పూజా హెగ్డే పాంచ్ పటాకా..

బుట్ట బొమ్మ పూజా హెగ్డే టాలీవుడ్ నుంచి పెద్దగా అవకాశాలు అందుకోవట్లేదు. రాధే శ్యాం ముందు వరకు స్టార్ సినిమా అంటే పూజా పేరు వినిపించేది కానీ ఇప్పుడు ఆమెను ఎవరు పట్టించుకోవట్లేదు. పూజా హెగ్డే ని తెలుగు పరిశ్రమ పూర్తిగా దూరం పెట్టింది. దీని వెనక కారణాలు ఏంటన్నది మాత్రం తెలియదు. ఐతే టాలీవుడ్ లో ఛాన్సులు లేకపోయినా బాలీవుడ్ లో సినిమాలు చేస్తుంది పూజా హెగ్దే. ప్రస్తుతం అక్కడ షాయిద్ కపూర్ తో దేవా సినిమా చేస్తుంది అమ్మడు. ఈ సినిమా పూర్తి కాకుండానే వరుణ్ ధావన్ సినిమాలో సెలెక్ట్ అయినట్టు తెలుస్తుంది. బాలీవుడ్ తో పాటు కోలీవుడ్ నుంచి కూడా పూజా హెగ్దేకి ఆఫర్లు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే సూర్య 44 సినిమాలో నటిస్తున్న పూజా బేబ్ ఆ సినిమా సెట్స్ మీద ఉండగానే దళపతి విజయ్ చివరి సినిమాలో ఛాన్స్ అందుకుంది. విజయ్ తో ఆల్రెడీ బీస్ట్ సినిమా చేసిన పూజా హెగ్దే మరో లక్కీ ఛాన్స్ అందుకుంది. ఇక ఈ సినిమాతో పాటు లేటెస్ట్ గా లారెన్స్ చేస్తున్న కాంచనా సీరీస్ లో కూడా పూజా హెగ్దే ఫైనల్ అయినట్టు తెలుస్తుంది. పూజా కి తమిళ పరిశ్రమ నుంచి వస్తున్న ఈ ఆఫర్లు కచ్చితంగా ఆమె కెరీర్ ని మళ్లీ సెట్ రైట్ చేసుకునేలా చేస్తుందని చెప్పొచ్చు. మొన్నటిదాకా చేతిలో ఒక్క సినిమా కూడా లేదని పూజా గురించి మాట్లాడిన వారంతా కూడా ఇప్పుడు అమ్మడు చేస్తున్న ఐదు సినిమాల గురించి చెప్పుకుంటున్నారు. పాంచ్ పటాకాతో పూజా మళ్లీ తన కెరీర్ లో జోష్ నింపుకుంది.పూజా హెగ్దే ఫ్యాన్స్ కి ఈ సినిమాలు తప్పకుండా సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయని చెప్పొచ్చు. తెలుగులో కెరీర్ ముగిసింది అనుకునేలోగా కాస్త డల్ అయిన అమ్మడు తమిళ్, హిందీ పరిశ్రమల నుంచి వస్తున్న ఆఫర్లతో ఖుషి అవుతుంది. ఈ సినిమాల విషయంలో పూజా హెగ్దే చాలా కాన్ఫిడెంట్ గా ఉందని అర్థమవుతుంది. ఇక ఈ సినిమాల్లో ఏ ఒక్కటి హిట్ అయినా మళ్లీ టాప్ లీగ్ లో పూజా హెగ్దే కొనసాగే ఛాన్స్ ఉంటుంది. తన పని అయిపోయింది అనుకున్న వారందరికీ సమాధానం చెబుతూ పూజా హెగ్దే ఈ సినిమాలతో మరోసారి తన సత్తా చాటబోతుందని చెప్పొచ్చు.